
www.missionrk.com

# ప్రజ్ఞావతార కథామృతము



## తెలుగు అనువాదము

## డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు

# ప్రజ్ఞావతార కథామృతము

పూజ్యగురుదేవులు శ్రీరామశర్మఆచార్య తనయొక్క ఆధ్యాత్మిక జీవితాన్ని నాలుగుభాగాలుగా విభజించారు.

**1. నా జీవన సాధన యొక్క అంతరంగ విశేషాలు.**

**2. నా దృశ్యజీవితముయొక్క అదృశ్య అనుభూతులు.**

**3. విశ్వాసము, సందేహము, సమాధానము.**

**4. చమత్కారములతో కూడిన నా జీవనక్రమము మఱియు దాని మర్మము.**

మీరు భౌతిక జీవితంలో ఒక విద్య నేర్చుకోవాలనుకుంటే లేదా ఆ విద్యలో మీరు నిష్ణాతులవ్వాలనుకుంటే మీరు ఆ విద్యకు సంబంధించిన పుస్తకాలు యెన్నో చదవాలి, వివిధ కోణాలలో వాటిని అర్థము చేసుకోవాలి. అంటే మీరు నేర్చుకున్న విద్యకు సంబంధించిన యే పుస్తకము కనిపించినా దాన్ని చదివి అర్థము చేసుకోగలిగే స్థాయిలో వుండాలి. అంతేగాదు ప్రస్తుతమున్న పుస్తకాలమీద, భవిష్యత్తులో రాబోయో పుస్తకాల మీద కూడా మీకు అవగాహన వుండాలి.

అయితే ఆధ్యాత్మికవిద్యలోమాత్రం ప్రజ్ఞావంతులు కావాలి అంటే 'ఇన్ని సాధనలు యెందుకు చేయాలి?' అనే ప్రశ్న వేస్తారు. ప్రజ్ఞావంతులు కావాలి అంటే అంతకంటే యెక్కువ పుస్తకాలు చదవాలికదా? ఆధాత్మికవిద్యలో నూతన విధానాలు, ఒరవళ్ళు వుంటాయి. ఈ విషయమును సాధకులు గమనించాలి. గురుదేవుల ఆధ్యాత్మిక జీవితములో అనేక క్రొత్తకొత్త విధానాలు, దారులు కనిపిస్తాయి. వాటిని ఆచరించినప్పుడే మీరు ఆ విద్యలో నిష్ణాతులైనట్లు. లేకపోతే నిష్ణాతులు కాదుకదా? అంతరంగ సాధనలో చాలా ప్రముఖమైన, ముఖ్యాంశము యేమిటంటే సాధకుని శరీరము ప్రకాశవంత మవ్వాలి. మనకు నిత్యజీవితంలో యేదైనా ఒక విషయము లేక జ్ఞానము అర్థమయితే

యేమంటాము? బుజ్జిలో ప్రకాశము వున్నది, కాంతి వున్నది అంటాము. ప్రపంచంలోని యే విద్య లేక జ్ఞానము మీకు అర్థమయినా యీ మాటే అంటారు. ఆ కాంతియొక్క లోతులలోకి మనము వెడుతున్నాము. భౌతికజగత్తులో ఆ కాంతి మనకు సూర్యుని నుండి మాత్రమే లభిస్తుంది. ప్రపంచంలో మరిదేనికి యీ లక్షణము లేదు. భౌతికజగత్తులో మనకు సూర్యుని నుంచి వేడి, వెలుతురు లభిస్తాయి. భౌతికజీవితంలో మనము సూర్యుని నుండి వచ్చిన వేడి, వెలుతురును వుపయోగించుకుంటాము. అయితే నేడున్న శాస్త్రవేత్తలు సుర్యునినుండి లభించే వేడి, వెలుతురును అంతబాగా వుపయోగించుకోవడంలేదు. కొంతవఱకు వుపయోగించుకుంటున్న మాట వాస్తమే అయితే పూర్తిమేఱకు వుపయోగించుకోవడంలేదు. ఎలా వుపయోగించుకోవాలి? అంటే ---- ఒక విత్తనము లాగ.

మనము భూమిలో ఒక విత్తనము నాటితే సూర్యునియొక్క వేడి, ఆ వేడి నుండి లభించిన జలమును వుపయోగించుకుని అది మొలకెత్తుతుంది. వేడే లేకపోతే నీరు లేదు. వేడిని నీటి అణువులుగా మార్చి, ఆ నీటి అణువులను తిరిగి వర్షరూపంలో అందిస్తుంది ప్రకృతి. ఎప్పుడైతే సూర్యునినుండి ప్రకాశము వెలువడుతోందో అదే ప్రకాశంతోపాటు వేడికూడ వుత్పన్నమౌతోంది. వేడి వేఱు, వెలుతురు వేఱు. రెండిటి లక్షణాలలో తేడా వున్నది. వాటి లక్షణములను వుపయోగించుకుని మనము భౌతికజగత్తులో సశాస్త్రీయంగా అనుకున్న ఫలితాలను పొందవచ్చు. ఆధ్యాత్మికవిద్యలోకూడ ఆ సూత్రమును వుపయోగించుకుని మనము ఫలితాలను పొందవచ్చు. కాంతి లేక వేడి యొక్క ఫలితాలు పొందాలి అంటే వాటి జపము చేస్తే సరిపోదు. వాటి లక్షణములనుకూడ వుపయోగించుకోవాలి. ఉపయోగించుకున్నప్పుడు ఫలితాలు పొందగలుగుతాముతప్ప వుత్తినే వాటి నామస్మరణ చేస్తే లాభము లేదు. థియరీలో చెప్పబడిన విషయాలను ఆచరణలో పెట్టాలి. ఆధ్యాత్మికవిద్యలోకూడ అంతే.

అందుకే గురుదేవులు శ్రీరామశ్మఆచార్యగారు యీ పుస్తకము వ్రాస్తూ, అందులోని మొదటి విషయానికి ***'నా జీవన సాధనయొక్క అంతరంగ విశేషాలు'*** అనే పేరు పెట్టారు. అంటే మీరు దేన్ని సాధన చేస్తున్నారు అంటే మీ జీవితాన్ని సాధన చేస్తున్నా రన్న విషయము దీన్నిబట్టి అర్థమౌతోంది. సాధనలో మీరు దైవదర్శనము పొందటం లేదు, మంత్ర, తంత్ర, యంత్రాలను సాధించడంలేదు. మీరు దేన్ని సాధన చేయడానికి ప్రయత్నిస్తున్నా రంటే మీలోని వెలుతురుని పట్టుకోవడ మనేది సాధన చేస్తున్నారు. ఆ సాధనయొక్క మానసికస్థితులు -

**1. మానసిక పరిష్కారము,**

**2. భావనాత్మక ఉత్కృష్టత,**

**3. విచారణ,**

**4. కార్యాచరణపద్ధతి.**

***1. మానసికపరిష్కారము*** : - అంటే మీ మనస్సు నిర్మలంగా మారాలి. మీ ఆలోచనావిధానం యొక్క ఆధారభూతమైన అవగాహన మారాలి. మానసికపరిష్కాము లభిస్తే తక్షణమే మీరు శ్రీరామశర్మఆచార్య గురుదేవుల యొక్క మానసికస్థితికి వెళ్ళగలిగే అవకాశ మున్నది. ఈ జీవితము దివ్యత్వానికి సంబంధించినది అనే విషయము సాధకులకు అవగాహనలోకి రావాలి. అంటే మనకు మొదట యేమి అర్థము కావాలంటే మన శరీరాలు మనము స్వయముగా యేర్పరుచుకున్నవే, ఇతరులు యేర్పరచినవి కాదు అని.

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।

తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ॥ (భ॥త అ॥4, శ్లో॥5)

*భావము : శ్రీభగవాను డిట్లనెను. శత్రువుల తపింపజేయు అర్జునా! ఇంతకు పూర్వము నీకు నాకూ యెన్నో జన్మలు గడచిపోయినవి. వానినన్నింటిని నీవెరుగవు. అయితే నాకు అవన్నియు తెలియును.*

మన పూర్వజన్మలగురించి మనకు యేమి తెలియదు. ఆ జన్మలకు మనము యేమి ప్రాముఖ్య మియ్యము. అసలు ఆ జన్మలగురించి తెలియకపోతే వాటికి విలువ యేమిస్తాము?

ప్రతి గురువు మఱియు అవధూతల జీవితచరిత్రలో మనకు వారి యొక్క పూర్వజన్మల వివరము కనిపిస్తుంది. మనము ఒక జన్మ యెత్తాము అంటే కచ్చితంగా గతజన్మ వుంటుంది. అందుచేత ఆధ్యాత్మికజగత్తులో ముందుకు వెళ్ళాలి అనుకునే సాధకులు తమ పూర్వజన్మల మీద దృష్టి సారించాలి. ఎందుకంటే మీరు ఆధ్యాత్మికజగత్తులో యే స్థాయిలో వున్నారు అన్న విషయము తెలియడానికి. అయితే యిలాంటి విషయములు గురువు లేకుండా అవగాహనలోకి రావు. ఆయన చెబుతాడు మీరు యే స్థితిలో వున్నారో, ఆ స్థితినుండి ముందుకు వెళ్ళడానికి యే సాధనలో చేయాలో. గురువు దగ్గఱకు వెళ్ళి నాకు ఆధ్యాత్మిక జగత్తులోకి ప్రవేశించాలనుంది కనుక నేను నా సాధనలను యెక్కడినుండి మొదలుపెట్టాలి? అని అడిగితే గురువు దానికి సమాధానము చెబుతాడు. ఈనాడు అలాంటి గురువులు అరుదు. ఒకవేళ వున్నా మనము వారి దగ్గరికి వెళ్ళి వ్యక్తి గతమైన కోరికలు కోరుతాము కాని వారియొక్క పూర్మజన్మల పరంపరను గమనించము. మీ ఆలోచనల పరంపరలను యీ భౌతిక శరీరములకే పరిమితము కానీయకండి. గురువు వుంటేకాని ఆధ్యాత్మికవిద్యను నేర్చుకోలేము. ఆధ్యాత్మికవిద్యలోకి రావాలంటే సమర్థుడైన గురువు వుండాలి. ఈనాడు అలాంటి గురువులు అరుదు కదా? మఱెలా? గురువులు అశరీరధారులైనా వారు తప్పక సహాయము చేస్తారు. అయితే మనము వారిని మనకు సహాయము చేయనివ్వగలగాలి.

ఆధ్యాత్మికవిద్యలో ప్రవేశించాలనుకునే సాధకులు మొదట తమ ఆంతరంగిక చేతనత్వమును మార్చుకోవాలి. ఎలా మార్చుకోవాలి? అనేదానికి గురుదేవుల జీవితము ఒక వుదాహరణగా నిలుస్తుంది.

మీ ఆలోచనావిధానమును కేవలము శరీరంమీదే కేంద్రీకరించకండి. నోటితో నేను ఆత్మను అని అనడంకాదు. ఆత్మవలె జీవించడానికి ప్రయత్నించాలి. కార్ తోలడము నేర్చుకోవాలంటే డ్రైవర్‌సీట్‌లో కూర్చోవాలి, ఆ డ్రైవింగ్ నేర్పేవాడు చెప్పినట్లు ఆచరించాలి. మీరు కార్ తోలడము యెలా నేర్చుకున్నారు? డ్రైవర్‌లాగ ప్రవర్తించారుగనుక. మీ క్రియాపద్ధతి డ్రైవర్ కుండే క్రియాపద్ధతిలాగ వున్నదిగనుక. మఱి ఆత్మ లాగ జీవించాలంటే? ఆత్మలాగ జీవించడము అభ్యసించడమే! భౌతికపరమైన యీ విద్యలకే యింత కష్టడవలసి వస్తే మఱి ఆధ్యాత్మికవిద్య నేర్చుకోవటానికి యింకా యెంతో కష్టపడగలగాలి. డ్రైవర్ లాగ జీవిస్తే కార్ తోలడము ఎలా వస్తోందో, ఆధ్యాత్మిక జగత్తులోకూడ ఉపాసన ఆవిధమైన ఫలితములనే యిస్తుంది. ***ఉపాసన అంటే దైవీవిగ్రహం మీద కొన్ని పూలు జల్లి, నైవేద్యం పెట్టి, ఆరతివ్వడమే కాదు; నువ్వు యే దేవతను వుపాసిస్తున్నావో ఆ దేవత వలె జీవించగలగాలి.*** అలాగని కర్మకాండలు వద్దనడంలేదు యే గురువు. ఆ కర్మకాండల వెనుక ఒక విధివిధానమున్నది. ఆ విధానము యేమిటంటే ఆత్మ వలె జీవించుట.

పూర్వజన్మల పరంపరగురించి మీరు తప్పక తెలుసుకోవాలి. మఱి ఆధ్యాత్మికవిద్యలో మాత్రము మాకు గురువు లెందుకు అంటారు చాలామంది. ఆధ్యాత్మికతలో నీవు ఆత్మ వలె జీవించాలనుకుంటే ఆ విద్య

www.missionrk.com

రావాలంటే చాల పుస్తకాలు చదవాలి. దానితోపాటు సాధనలో గురుదేవులు చెప్పిన 4 మానసికస్థితులు తెచ్చుకోవాలి. ముఖ్యంగ **1. మానసిక పరిష్కారము కావాలి. 2. భావనాత్మక ఉత్కృష్టత** కావాలి. ఆ మానసికస్థితులు రావాలంటే ఇంటా, బయటా గెలవాలి. కుటుంబంలోని మఱియు సమాజములో అనేక సమస్యలు వస్తావు. ఆ పరిస్థితులకి నీవు భయపడితే యెలా? ఆత్మవలె జీవించాలి. అలా జీవించినవారు ఆత్మలే. కారు డ్రైవింగ్ నేర్చుకుంటే వస్తుంది కదా ? ఏవిద్యనూ మీరు నేర్చుకోవాలన్నా మీ మానసిక సామర్థ్యాన్ని బట్టి ఆ విద్య వస్తుంది. మనిషి మనిషి లాగ జీవిస్తూ తాను ఆత్మను అనే విషయమును మర్చిపోయి మనిషి వలె జీవిస్తూ దానిలోనే కూరుకుపోయాడు.

***2. భావనాత్మక ఉత్కృష్టత*** :- అంటే? దాన్ని ఒక వుదాహరణద్వారా అర్థము చేసికుందాము. శ్రీకృష్ణునిమీద అర్జుననికి కొంచెము కినుక వుండేది. కారణము అర్జునుడు యెన్ని దానాలు, యెన్ని మంచిపనులు చేసినా కృష్ణుడు 'నువ్వు దానం చేయడంలో కర్ణుని మించినవాడివి కాదులే' అనేవాడు. అర్జునుడు యీ మాటకి చాలా బాధపడేవాడు. ఒకరోజు కృష్ణార్జునులు యమునానదికి స్నానానికి వెళ్ళారు. ఒకచోట కృష్ణుని మాయచేత సృష్టించబడిన ఒక బంగారు గుట్ట కనపడింది. కృష్ణుడు ఆ బంగారుగుట్టను అర్జునుడికి చూపించి దీన్ని సాయంత్రంలోపల దానము చేయి అని అంటాడు. అర్జునుడు దానము చేయటము మొదలుపెట్టాడు. రెండు చేతులతో దానము చేసినా ఆ గుట్ట తరగటంలేదు. కృష్ణుడు స్నానమునకు వెళ్ళివచ్చాడు, సాయంత్ర మయ్యింది కాని అర్జునుడు యెంతదానము చేసినా ఆ గుట్ట తరగటము లేదు. అప్పుడు కృష్ణుడు కర్ణుడుని పిలిపించి కర్ణునితో 'నువ్వు యీ బంగారుగుట్టను దానము చేయి' అని అంటాడు. కర్ణుడు వెంటనే ఆ దారిలో వెడుతున్న ఒక కుఱ్ఱవాడిని పిలిచి 'ఈ బంగారుగుట్ట మొత్తము నీది, దీన్ని తీసుకుని పో' అన్నాడు.

భావనాత్మక ఉత్కృష్టత అంటే అది. అర్జునుడు దానము చేసినది అతనిది కాదు. కృష్ణుడిది. అయినా కర్ణుడు చేసిన విధముగా దానము చేయలేకపోయాడు. ఎందుకంటే అతనికి దానము చేసే గుణము లేదు కనుక.

అందువలన మనకు ముందుగా యిచ్చే గుణము (దానము) వుండాలి. మీది కాని ధనమును దానము చేయటానికి మీరు బాధపడితే! లేక నేను చాలా దానాలు చేసాను అని గొప్పలు చెప్పుకుంటే! అది తప్పు కదా!

ఆత్మవిద్యను మీరు మాటలద్వారా, మనస్సుద్వారా పొందలేరు, అది అవాఙ్మానసగోచరం అని అన్నారు ఋషులు. భగవంతునిగూర్చి మనము మాటలద్వారా, మనస్సుద్వారా చెప్పగలిగితే అది తప్పు. నువ్వు భగవంతుని మాటలద్వారా, మనస్సు ద్వారా గ్రహించలేవు అని వేదాలు ఘోషిస్తున్నాయి అని ఋషులు పదేపదే హెచ్చరించారు.

మానసికపరిష్కారంకోసం పుస్తకాలు చదవాలి. ఆ చదివినది అర్థమయ్యింది అనే భ్రాంతిలో వుండకూడదు. ఎందుకంటే ఋషులు ఉచ్చాతివుచ్చతలములో వుండి వేదములను, భగవంతుని దర్శించారు గనుక అవి మనో వాక్కులకు అతీతము అని గ్రహించాలి. జీవితమును నువ్వెలా వివరిస్తావు? భగవంతునిగూర్చి నువ్వేమి వివరించలేవు. ఋషులు వ్రాసిన సాహిత్యమును చదివి అది నాకు అర్థమయ్యింది అనే భ్రాంతిలో వుండకూడదు. వారియొక్క భావనాత్మక ఉత్కృష్టతను మనమసలు వూహించలేము.

అర్జునుడు దానము చేసినది తనది కాదు. కృష్ణుడిది. అయినా కర్ణుడు చేసిన విధముగా చేయలేకపోయాడు. ఎందుకంటే అతనికి దానము చేసే గుణము లేదు. దానము చేసి మనము యెవ్వఱిని వుద్ధరించడం లేదు. దానము చేస్తే మనకు మనము నాటుకుంటున్నాము అని కర్మసిద్ధాంతము ప్రతిపాదిస్తోంది. దానము చేస్తున్నావు అంటే నువ్వు యివ్వగలిగిందే యిస్తున్నావు అనే కదా! ఇవ్వలేనిది యెవ్వఱూ దానము చేయలేరు.

www.missionrk.com

అందువలన మనకు ముందుగా దానగుణము వుండాలి. మీది కాని ధనమును దానము చేయటానికి మీరు బాధపడితే! లేక నేను చాలా దానాలు చేసాను అని గొప్పలు చెప్పుకుంటే! అది తప్పు కదా! కర్మసిద్ధాంతము యేమి చెప్తుంది? నాటు -కోసుకో అనికదా. భౌతికజగత్తులో మనిషి యెంత ప్రోగుచేసుకున్నా అవన్నీ అతని సామర్థ్యంవల్ల కాదు అనేది గ్రహించాలి. ప్రకృతి ప్రసాదిస్తే మనిషి దాన్ని అనుభవిస్తాడు. ప్రకృతిలో వున్న సంపదలను పొందగలగట మనేది ఒక్క గురువులకే సాధ్యమయినది.

గురువు యివ్వనిదే నువ్వు శరీరమును పొందలేవు. శరీరమే కాదు భౌతికజగత్తులో దేన్ని పొందలేవు అన్న విషయమును సాధకుడు గ్రహించాలి. గురుదేవులు ఈ విషయమును స్పష్టంగా తెలియజేశారు. ఆధ్యాత్మిక గ్రంథాలు చదివి మీ పాండిత్యము ద్వారా భావనాత్మకత లేకుండా నేను చాలా గొప్పవాడిని అని చాటుకుంటే యేమి ప్రయోజనము లేదు. ఇది భావనాత్మక ఉత్కృష్టత.

***3. విచారణ*** ః - అనగా ఆలోచనావిధానమును అమలుపఱచుట. ఉదా : - మీరు ఒక ఇల్లు కట్టుకోవటానికి ముందునుంచి యెలా పద్ధతి ప్రకారము ప్రణాళిక ఆచరిస్తారో దానిని విచారణ అంటారు.

***4. కార్యాచరణ*** ః- గృహము నిర్మించటానికి ప్రళాళిక వేసుకున్నతరువాత నిర్మాణము చేస్తారు కదా! అది కార్యాచరణ.

మానసిక పరిష్కారము, భావనాత్మక ఉత్కృష్టత, విచారణ, కార్యాచరణ యీ నాలుగు మనిషియొక్క అంతరంగము మీద ఆధారపడివుంటాయి. మీ అంతరంగ పరిస్థితి యెలా వుంటుందో, బాహ్యపరిస్థితి అలానే వుంటుంది. గురువుల దగ్గఱకు వెళ్ళాక మనుష్యుల రోగాలు, సమస్యలు నివారింపబడటానికి కారణము గురువుల యొక్క ఆంతరంగికస్థితే. గురువుల యొక్క అంతరంగ మానసిక స్థితి యెంతో స్పష్టంగా వుంటుంది. అందుచేతనే వారి దగ్గఱకుగాని లేక వారి సమాధుల దగ్గఱకుగాని వెళ్ళినప్పుడు మనుష్యుల సమస్యలు పరిష్కరింపబడతాయి. అనారోగ్యము తొలగిపోతుంది. ఆంతరంగికస్థితి ఆత్మ వలె వుంటే యేది అనుకుంటే అది జరుగుతుంది.

**1. వాసనలు - సాధనావిధముగా,**

**2. కుతర్కముల సమూహము - సజలశ్రద్ధగా,**

**3. సంశయాకుల చిత్తవృత్తులు - కదల్చలేని, సుస్థిర విశ్వాసముగా పరిణతిచెందాలి.**

ఆవగింజంత నమ్మకముంటే చాలు కొండలనైనా కదిపేయవచ్చు.

**సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధమయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః ॥ (భ॥గీ 17అ॥, శ్లో॥ 3)**

***భావము ః భరతవంశీయుడా! మానవు లందఱి శ్రద్ధ వారి అంతఃకరణమునకు అనురూపమై యున్నది. ఈ పురుషుడు శ్రద్ధామయుడు. అందువలన యే పురుషు డెట్టి శ్రద్ధ గల వాడగునో అతడు స్వయముగ అటువంటివాడే యగుచున్నాడు.***

ఎవఱికైనా శ్రద్ధ వుంటేకాని ఆధ్యాత్మికజగత్తులో ప్రవేశము కలుగదు. ఒకసారి జీవితంలో శ్రద్ధ కలిగినతర్వాత దాన్ని యెట్టిపరిస్థితులలోనూ పోగొట్టుకోకుండా చూసుకోవల్సిన బాధ్యత మనిషిదే. మీయొక్క అంతరంగక స్థితి యెలా వుండాలంటే 'భవానీశంకరం వందే శ్రద్ధా విశ్వాసరూపిణం'. విశ్వాసము, శ్రద్ధ యీ రెండిటికి తేడా యేమిటి?

విశ్వాసము ః- ప్రణాళికప్రకారము, క్రమము తప్పకుండా యేదైనా ఒక పని చేస్తే ఆ పని ఫలిస్తుంది అనే జ్ఞానము కలిగివుండటమే విశ్వాసము.

www.missionrk.com

శ్రద్ధ :- ఎన్ని ఆటంకములు వచ్చినా అనుకున్న పని చేసితీరతాను అనేది శ్రద్ధ.

ఈనాడు మనిషికి ఆధ్యాత్మికతలో వుండవల్సిన అతి ముఖ్యమైన యీ రెండు లక్షణాలు లేవు. కాని భౌతిక జగత్తులో వున్నాయి. కాబట్టి మీకు ఫలితాలు వస్తున్నాయి. గురువుల జీవితచరిత్రలు చదివికూడా మనకు విశ్వాసము-శ్రద్ధ కలుగకపోతే యెలా!

గురుదేవులు నాలుగు రకముల మార్పులు గురించి చెప్పారు. 1. మానసిక పరిష్కారము - గురువుల చరిత్రల పారాయణ మానసిక పరిష్కారమును కలుగజేస్తాయి. 2. భానాత్మకఉత్కృష్టత. **ఆత్మవలె జీవించేవిధానము. గురువు ఆత్మవలె జీవిస్తాడుగనుక మనముకూడ ఆయనను అనుసరించాలి. ఆయన ఎలా జీవించాడో మనమూ అలాగే జీవించాలి.** 3. విచారణ. 4. కార్యచరణపద్ధతి.

## నన్ను ఇంటింటికి తీసికెళ్ళండి - పరమ పూజ్య గురుదేవులు

పరమపూజ్య గురుదేవుల మూర్తిమంతమైన స్వరూపము ఆయన వాఙ్మయము. దీనిని ఇంటి ఇంటికీ తీసుకు వెళ్లడానికి నిష్ఠావంతులైన పరిజనుల అవసరం ఉన్నది. ఈ పనిని చేయడానికి మేము యోగ్యులము అనుకునే వారు క్రింది వివరాలతో ''అఖండజ్యోతి సంస్థాన్,' మధురకు'' వివరంగా తెల్పండి. సమయదాన అవధి 2 నెలలు. టోలీలు ప్రతీ నెల 1 తేదీన మరియు 15వ తేదీన బయలుదేరతాయి. వివరాలు, పేరు, చిరునామా, ఎస్.టి.డి. కోడ్‌తో పాటు, ఫోన్ నెంబరు, చదువు వివరాలు, వయస్సు, మిషనుతో ఎప్పటి నుంచి సంబంధం ఉంది? మిషనుకి సంబంధించిన యోగ్యతలు, చేసే ఉద్యోగము, వ్యవసాయము, ఎప్పటి నుంచి ఎప్పటి వరకూ సమయదాను ఇవ్వగలరో తెలుపగలరు.

# నా దృశ్య జీవితము యొక్క ఆదృశ్య అనుభూతులు

" **నా ఆధ్యాత్మిక సాధనలోని రెండు మజిలీలు, 24 సంవత్సరాల కాలములో పూర్తైనది. యువావస్థలోనే మాతృవత్ పరదారేషు, పరద్రవ్యేషు లోష్టవత్ అనే ఆదర్శమునుండి అతిక్రమణము జరుగుతుంది.** "

**మాతృవత్ పరదారేషు - తన భార్యతప్ప పరస్త్రీ లందఱూ తల్లులుగా కనిపించాలి.** ఈ సాధనయొక్క పరాకాష్ఠగా ప్రకృతే తల్లిగా కనిపించాలి. ఈ దృష్టికోణము అనుభవంలోకి రావడమునే ద్విజత్వము అంటారు. అంటే ఒక జన్మ తల్లిగర్భంనుండి లభిస్తే మఱో జన్మ ప్రకృతి ప్రసాదిస్తుంది. తల్లి గర్భంలో వున్నప్పుడు తల్లినుంచి ఆహారము లభిస్తుంది. బాహ్యప్రపంచంలోకొచ్చాక బొడ్డును కత్తిరిస్తారు. ఆక్షణంనుండి బిడ్డ ప్రకృతి వశంలోకొస్తాడు. అప్పటినుండి ప్రకృతే అవసరాలన్నీ చూసుకుంటుంది. ప్రకృతిని మాతగా అనుభూతి చెందే ఆ దృష్టికోణమును అలవరచుకోవడమే ద్విజత్వమును పొందుటకు అర్థము.

శ్రీరామశర్మఆచార్య తన ముందుజన్మలో యీ సాధన చేశారు. అంటే ఆయన శ్రీరామకృష్ణపరమహంసగా వున్నప్పుడు యఅ సాధన చేశారు. పరమహంస తన భార్య యైన శ్రీశారదామాతను దేవిగా వుపాసించాడు. శ్రీరామశర్మగా వచ్చాక కూడ ఆయన మాతాజీని తల్లిగానే ఉపాసించారు. అది తాంత్రికసాధన. అందుచేత గురుదేవులు దాన్ని రహస్యంగానే వుంచారు.

ఈ సాధనకు ఋషులు అందించిన అద్భుతమైన చక్కని విధానము భగవంతునికి స్త్రీరూపమును యిచ్చుట. ఉదా॥ గాయత్రీమాత. కాళికామాత. ఆధ్యాత్మికజగత్తులోకి అడుగుపెట్టిన ప్రతీసాధకుడు మొదట అలవర్చుకోవల్సిన లక్షణము ప్రకృతిని తల్లిగా అనుభూతి చెందుట.

తరువాత స్థితి **పరద్రవ్యేషు లోష్టవత్.** అనగా నీదికానిది నీవు ముట్టుకోకు. శ్రీరామకృష్ణపరమహంసలో యీ రెండు స్థితులను చూస్తాము. చాలా అద్భుతముగా ఆయన యీ రెండు స్థితులయొక్క పరాకాష్ఠకు చేరుకున్నారు. ఆధ్యాత్మికజగత్తులోని మొదటి రెండు చరణములను ఆయన అత్యద్భుతంగా సాధించారు. ఆయన శ్రీరామశర్మ ఆచార్యగ వచ్చి మఱల యీ సాధనలను అనుభూతిలోకి తెచ్చుకోవడానికి 24 సంవత్సరాలు పట్టింది.

**పరద్రవ్యేషు లోష్టవత్** - నీది కాని ధనమును నీవు ఆశించకు. ముట్టుకుంటే కొంపలంటుకుంటాయి.

శ్రీరామకృష్ణ పరమహంస దక్షిణేశ్వర్‌లో ఆయన నివసించే గదికి వ్యాయువ్యదిశగా ఒక తోట, దాని పక్కనే ప్రహరీగోడ వుండేవి. ఆప్రక్కనే ఒక హోమియో వైద్యుడు వుండేవాడు. ఒకసారి శ్రీరామకృష్ణపరమహంస చాలా అనారోగ్య కారణముగా వైద్యుని దగ్గఱికి వెళ్ళారు. ఆ వైద్యుడు వూరిలో లేడు, రెండుదినములకు గాని తిరిగిరాడు అని తెలిసినది. వైద్యుని దగ్గర వుండే సహాయకుడు (కంపౌడర్) నేను ఒక మోతాదు మందు ఇప్పుడు ఇస్తాను వేసుకోండి. ఱేపటికి రెండు మోతాదులు పొట్లము కట్టి యిస్తాను, అది ఱేపు వేసుకోండి, అని అన్నాడు.

www.missionrk.com

పరమహంస ఒక మోతాదు ముందు అక్కడ వేసుకుని, రెండు మోతాదులు గదికి తెస్తూండగా దారి కనిపించలేదు. రామకృష్ణపరమహంస ఆరోజు మందుకాక తేపటికి కూడా ముందు జాగ్రత్తతో మందు తెచ్చుకుంటున్నాడు. తేపటికి దాచడము అనేది రాగానే దారి కనిపించడము మానేసింది. ఆయన చేతనత్వముయొక్క నిర్మలత్వముయొక్క పరాకాష్ఠస్థితి అది.

మనము మనవళకే గాక మనవలకి, మునిమనవలకి తపన పడి ఆస్థులు యేర్పటుచేస్తాము కదా! అలా చేయడంలో తప్పులేదు కాని దానిని 'నాది, నేను' అని అనుకోవడము తప్పు. దృశ్యజీవితముయొక్క అదృశ్య అనుభూతులలో పూర్వజన్మల సంస్కారాలనుంచి మీకు యేమి వస్తున్నాయో మీరు గుర్తించగలగాలి. చివరికి మీరు ప్రయాణము చేసే బస్, రైలు వాటిలో వుండే తోటి ప్రయాణికులతో కూడా మీకు పూర్వజన్మ సంబంధాలు వుంటాయని తెలియటము లేదు. మఱి యీ విషయములు యెలా తెలుస్తాయి? పూర్వజన్మలు తెలిస్తే తెలుస్తాయి.

గురుదేవులకు యీ రెండు సాధనలు పరాకాష్ఠస్థితికి చేరడానికి 24 సంవత్సరాలు పట్టింది అని వ్రాసుకున్నారు.

**“ నా ఆధ్యాత్మిక సాధనలోని రెండు మజిలీలు, 24 సంవత్సరాల కాలములో పూర్తి అయినవి. సాధారణముగా యువావస్థలోనే మాతృవత్ పరదారేషు. పరద్రవ్యేషు లోష్టవత్ అనే ఆదర్శమునుండి అతిక్రమణము జరుగుతుంది. కామ లోభముల ప్రబలత కూడా యీరోజుల్లోనే వుంటుంది. 15 సంవత్సరముల వయస్సు నుండి 24 సంవత్సరాలలో నాకు 40 ఏళ్ళు వచ్చులోపల వాటి తీవ్రత తగ్గింది. సాధారణంగా యీ వయస్సులోనే కోరికలు, వాసనలు, తృష్ణలు, మహత్వకాంక్షలు, ఆకాశ పాతాళములను కలపటానికి ప్రణాళికలు వేస్తూవుంటాయి. ఈ అవధిలో స్వాధ్యాయ, మనన, చింతలకు, ఆత్మ సంయమనము, జప, ధ్యాన సాధనకు వుపయోగించబడినది. ఈ వయస్సులో అనేక వికారములు ప్రబలముగా వుంటాయి. అందువల్ల సాధారణముగా పరమార్థప్రయోజనములకు 40 సంవత్సరములు దాటిన వ్యక్తులనే వుపయోగిస్తారు. ”**

**“ పెరుగుతున్న వయస్సులో అర్థవ్యవస్థ నుంచి, సైన్య సంచాలన లాంటి అనేక మహత్వపూర్ణ కార్యాల బాధ్యత తీసుకోవలసివుంటుంది. సేవాకార్యాలలో కూడా యువకులు చాలా సహాయము చేయగలరు. కానీ లోకమంగళ కార్యముల నేతృత్వము చేయడానికి, ఈ వయస్సు సరైనది కాదు. శంకరాచార్య, దయానంద, వివేకానంద, రామదాసు, మీరా, నివేదితా లాంటి కొంతమంది తక్కుక వయస్సులోనే మంగళకరమైన కార్యనేతృత్వ భారము వహించి దానిని నెరవేర్చగలిగారు. సాధారణంగా తక్కువ వయస్సు గందరగోళాలని సృష్టిస్తుంది. పేరు, పదవులమీద ఆకాంక్ష, ధనప్రలోభము, వాసనాత్మక ఆకర్షణ వున్నవాళ్ళు సామాజిక క్షేత్రములో నేతృత్వము వహించుటకు ప్రవేశిస్తే అనేక వికృతులు సంభవిస్తాయి. అనేక అభివృద్ధి చెందుతున్న సంస్థల సర్వనాశనము ఇలాంటి వారివల్లనే జరుగుతుంది. మంచి, చెడు అన్ని వయస్సుల వారిలో వున్నా, సాధారణంగా యౌవనములోనే మహత్వకాంక్షలు వుంటాయి. పెరుగుతున్న వయస్సుతో పాటు స్వాభావికముగా వ్యక్తిలో యీ కోర్కెల వేడి తగ్గుతుంది. అప్పుడు అతని భౌతిక లాలసలు కూడా తగ్గుతాయి. మరణకాలము సమీపిస్తున్నది అని గుర్తుకువచ్చి పరలోకము సవరించుకోవటానికి ధర్మకార్యముల మీద రుచి పెరుగుతుంది. ఇందువల్ల తత్త్వవేత్తలు వానప్రస్థ-సన్యాసముల కొఱకు ఆయువు యొక్క ఉత్తరార్థమునే వుపయుక్తము అని నిర్దేశించారు. ”**

**“ అది యేమి రహస్యమోకానీ నా మార్గదర్శకుడు నా యౌవన మంతా కఠోరతపశ్చర్యకు వినియోగించారు. తపస్సాధనలోనే 40 యేళ్ళ వయస్సు వచ్చినది. వర్చస్వ, నేతృత్వ, అహంకార, మహత్వకాంక్షల ప్రలోభాలలో కొట్టుకొనిపోయే**

ప్రమాదముందని అనుకున్నారేమో, అతి పెద్ద పనులు చేయుటకు కావల్సిన ఆంతరిక పరిపక్వము మఱియు ఆత్మబలము లేదని అనుకున్నారేమో, లేక గొప్పపనులు చేయుటకు అవసరమైన సంకల్పబల, ధైర్య, సాహస, సంతులనములను పరీక్షించారేమో! ఏదియేమైన నా మొదటి 40 సంవత్సరములు నేను మీతో అనేకసార్లు చర్చించిన సాధనాక్రమములోనే గడిచిపోయినాయి. "

ఈ అవధిలో అంతా సామాన్యముగానే వున్నది. అసామాన్యమైన దొకటే. అది ఆవునేతితో నిరంతరము వెలిగే అఖండదీపము. నా పూజాగృహములో నిరంతరము అది వెలుగుతూనే వుండేది. దీని యొక్క వైజ్ఞానిక లేక ఆధ్యాత్మిక రహస్య మేమిటి? నేను సరిగ్గా చెప్పలేను. గురువు గురువే కదా! ఆదేశము ఆదేశమే! అనుశాసనము అనుశాసనమే! సమర్పణంటే సమర్పణే. ఒకసారి బాగా పరీక్షించి- ఈ పడవలో కూర్చుని ప్రయాణిస్తే మునిగే ప్రమాదము లేదని నిర్ణయించుకున్నాక కళ్ళు మూసుకుని కూర్చుండిపోయాను. మిలిటరీలో సైనికుడికి అనుశాసనము ప్రాణము కంటే యెక్కువ ప్రీతికరమైనది. నాది అంధశ్రద్ధ అనుకోండి లేక అనుశాసన ప్రియత అనుకోండి, నా జీవితానికి యే దిశను నిర్ధారించారో, ఏ కార్యపద్ధతిని ఆచరించమన్నారో, దానినే సర్వస్వమనుకొని పూర్తినిష్ఠతో పూర్తితత్పరతతో చేసుకుంటూ వెళ్ళాను. నా సాధనాగదిలో అఖండదీప స్థాపన యీ ప్రక్రియలోని భాగమే. మార్గదర్శకుడిని విశ్వసించాను. ఆయనకు పూర్తిగా సమర్పణ చేసుకున్నాను. ఇంక ప్రశ్న లెందుకు?తర్కము లెందుకు? సందేహము లెందుకు? ఇవి యెప్పుడూ నాలో వుదయించలేదు. నా సాధనలో అఖండదీపము అత్యంత అవసరము అని చెప్పారు. అంతే పురశ్చరణలు పూర్తి అయ్యేవఱకు అలాగే వెలుగుతూ వుండేటట్లు చూశాను. ఆ తరువాత అది ప్రాణప్రియముగా మారినది. 24 సంవత్సరముల తరువాత దానిని ఆర్పివేయవచ్చు. కాని ఆ ఊహే నాకు ప్రాణాంతకముగా అన్పించినది. అందువల్ల యింక అది నా జీవితాంతము వెలుగుతూవుంటుంది. నేను అజ్ఞాతవాసానికి వెళ్ళాను. ఇప్పుడు మళ్ళీ వెళ్ళబోతున్నాను. అప్పుడు నా ధర్మపత్ని దీని భాధ్యత వహిస్తుంది. నేను ఏకాకినై వుంటే, భార్య లేకపోతే యింకొక విధానము యేర్పరచేవాడిని. అఖండదీప బాధ్యత చాలా క్లిష్టమైనది. వేతనము కోసము, శ్రద్ధలేనివాళ్ళు, ఆంతరికదృష్టితో దుర్బలులు యీ దివ్యాగ్నిని కాపాడలేరు. అనేకమంది అఖండదీప స్థాపన చేస్తారు. అవి పేరుకుమాత్రమే అఖండదీపములు. అవి అనేకసార్లు ఆరిపోతూవుంటాయి. మళ్ళీ వెలిగిస్తూవుంటారు. నా జ్యోతి అఖండముగా వుండుటకు కారణము బాహ్య సతర్కత కాదు. అంతర్నిష్ఠ కారణమని తెలుసుకోవాలి. దీన్ని అఖండముగా వుంచుటకు నా ధర్మపత్ని అసాధారణ సహాయ సహకారము లందించినది. "

సాధకులు జపము చేస్తున్నప్పుడు అఖండదీపము ఆవునేతితో వెలిగించుకుని, ప్రక్కనే కలశమును నీటితో యేర్పాటు చేసుకోవాలి. జప పరిసమాప్తివఱకు ఆ దీపము అలా వెలుగుతూనే వుండాలి. ముందుగా పూజా కార్యక్రమమును పూర్తిచేసి తర్వాత జపమును ఆరంభించాలి.

***నైవేద్యము పెట్టిన ఘనపదార్థము ప్రసాదంగా మారి అది మనస్సుగా మారుతుంది. తీర్థముగా స్వీకరించే నీరు ప్రాణశక్తిగా మారుతుంది. నూనె వాక్శక్తి నిస్తుంది. ఈనాడున్న దేశకాల పరిస్థితులలో నువ్వులనూనె సాధకునిలోని వాక్శక్తిని పెంచుతుంది. ఆముదపుదీపము పిల్లల్లోని జ్ఞాపకశక్తిని పెంచుతుంది. అరుగుదలను పెంచుతుంది. పూర్వకాలంలో ఆముదపుదీపాలను వుపయోగించేవారు. ఫలితాలు బాగుండేవి.***

www.missionrk.com

**" అఖండదీపము, అఖండయజ్ఞ స్వరూపమేమో. అగరుబత్తులను వెలిగించుట హవన -సామాగ్రి యొక్క; జపము-మంత్రోచ్చారణ యొక్క; జ్యోతి - నేతితో ఆహుతి వేసే - క్రియాకలాపాలకు సంకేతమేమో. ఈవిధంగా ఒక అఖండహవనము యొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో. నీటితో నిండిన కలశము, వెలుగుతున్న దీపస్థాపన; అగ్ని - జల సంయోగముతో స్టీమింజన్ లాంటి సూక్ష్మప్రయోజనము జరుగుతున్నదేమో! "**

మనిషి పరిణామక్రమములో ముందుకుపోతే కాని యోగి కాలేడు. అందువలన జపము చేస్తున్నప్పుడు పూజామందిరంలో పెట్టుకున్న కలశములోని నీరు, జ్యోతి యీ రెండూ సాధకుని యొక్క భావ తీవ్రతను బట్టి వారి జీవితాలని పరిణామక్రమంలో చాలా ముందుకు తీసుకునిపోతాయి.

**" అంతర్జ్యోతిని వెలిగించుకొనుటకు యీ బాహ్యజ్యోతినుండి సహాయము లభిస్తున్నదేమో. ఏదియేమైన యీ అఖండజ్యోతినుంచి నాకు భావనాత్మకప్రకాశము, అనుపమానందవం ఉల్లాసము నిరంతరం లభిస్తున్నది. "**

మనము దేవుని దగ్గఱ దీపము వెలిగించి అగ్గిపుల్ల అక్కడే పడేస్తాము. అలా వుంటుంది మన యొక్క శ్రద్ధ. అలా చేయకూడదు. పూజావేదిక యెప్పుడూ శుచిగా వుండాలి.

ఓం యశ్శుచిఃప్రయతో భూత్వాజుహుయా దాద్య మన్వహమ్ ।
శ్రియః పఞ్చదశర్చఞ్చ శ్రీకామస్సత తం జపేత్ ॥ (శ్రీసూక్తం-16)

***తాత్పర్యము :- శ్రీకాముడు (ధనమును కోరువాడు) శుచియై ప్రయత్నముతో శ్రద్ధతో ప్రతిదినమును శ్రీసూక్తమునందలి ముందరి పదునైదు ఋక్కులను జపించవలె. ఆ మంత్రములతో హోమము చేయవలయును.***

పూజామందిరమును యెంత శుభ్రంగా పెట్టుకుంటే అంత ధనము సమకూరుతుంది. అష్టసిద్ధులు, నవనిధులు వస్తాయి. భగవంతుని దగ్గఱ యెంత శుభ్రంగా వుంచగలిగితే అంత శుభ్రంగా వుంచండి.

**" బయట పూజావేదిక మీద పెట్టిన యీ దీపము కొన్నిరోజులు బయటనే వెలుగుతున్నట్లు కన్పించినా మెల్లిమెల్లిగా నాలోపల కూడా యీ అఖండజ్యోతి నా అంతఃకరణలో అలాగే నిరంతరము వెలుగుతున్నదన్న అనుభూతి స్పష్టముగా తెలియుట మొదలెట్టినది. "**

పురుషసూక్తము : తస్యమధ్యే వహ్నిశిఖా అణీయోర్థ్వావ్యవస్థితః ॥ నీలతోయదమధ్యస్థాద్విద్యుల్లేఖే వభాస్వరా । నీవారశూకవత్తన్వీపీతాభాస్వ త్యణూపమా ॥ తస్యాశ్శిఖాయామధ్యే పరమాత్మావ్యవస్థితః । సబ్రహ్మాసశివ స్సహరిస్సేన్ద్రస్సోఽక్షరః పరమస్స్వరాట్ ॥

హరిద్వార్‌లో వెలిగించబడ్డ అఖండద్వీపము శివపార్వతులు కళ్యాణము చేసినప్పుడు రగిలించబడిన అగ్ని. ఆ అఖండజ్యోతి దగ్గఱ 12 కోట్ల కోట్ల గాయత్రిజపము జరుగుతున్నది. కనుక గాయత్రీ సాధకులు హరిద్వార్, శాంతికుంజ్ వెళ్ళి ఆ అఖండదీపమును దర్శించాలి.

**" ఏవిధముగా పూజాగృహములో యీ అఖండజ్యోతి తన ప్రకాశమునందజేస్తున్నదో అదేవిధముగా నా సమస్త అంతరంగము నాలో వెలుగుతున్న అఖండజ్యోతి ద్వారా జ్యోతిర్మయముగా మారుతున్నదని నిరంతరము తెలిసింది. నేను శరీరము, మనస్సు, ఆత్మలో, స్థూల-సూక్ష్మ-కారణ-శరీరాలలో యే జ్యోతి అవతరణ సాధన-ధ్యానము చేయుచున్నానో సంభవతః అది యీ అఖండదీపము యొక్క ప్రతిక్రియేనేమో. నా ఉపాసనయొక్క సంపూర్ణ అవధిలో యేవిధముగా ఉపాసనాగృహములో అఖండదీపము తన వెలుతురును విస్తరింపచేసిందో, అదేవిధముగా భావనాక్షేత్రములో కూడా అటువంటి ప్రకాశమే అన్ని వైపుల విస్తరించేది. నేను, నాది అంతా ప్రకాశమయమే. చీకటి పొరలు తొలగిపోయాయి.**

www.missionrk.com

**మోహాంధకారము భస్మమైనది. ప్రకాశమయమైన భావనలు, ఆలోచనలు, గతివిధులు నా శరీరమును మనస్సును అవరించుకున్నాయి. సర్వత్రా అన్నివైపులా ప్రకాశము సముద్రము వలె విస్తరించి యున్నది. నేను చేప వలె యీ విశాల ప్రకాశసముద్రంలో ఈదులాడుతున్నాను. ఈ అనుభూతులు, ఆత్మబలము, దివ్యదర్శనము మఱియు అంతః ఉల్లాసము వికసించడానికి అఖండదీపము యెంత సహాయపడినదో నేను చెప్పలేను. ఇది నాయొక్క కల్పనయే కావచ్చు. ఊహయే కావచ్చు. కాని నేనెప్పుడు అనుకుంటాను. పూజాగృహములో అఖండదీప స్థాపనే చేసియుండకపోతే పూజాగృహములో ఆవరించివుండే మసకవెలుతురు వలె నా అంతరంగము కూడా మసక-మసకగానే వుండేదేమో. ఇప్పుడైత నాకు యీ అఖండదీపము దీపావళి దీపపర్వము వలె నా నరనరాలలో మిఱుమిట్లు గొలుపుతూ కన్పిస్తున్నది. నా భావభరిత అనుభూతుల ప్రవాహములో 32 సంవత్సరాలకు పూర్వము మాసపత్రిక ఆరంభించినపుడు ప్రపంచములో కెల్ల నాకు ప్రియమైన నేను యిష్టపడే సర్వోత్తమమైన పేరు 'అఖండజ్యోతి' అని పేరు పెట్టాను. ఆ భావావేశములో ప్రతిష్ఠించబడిన మాసపత్రిక యీ అఖండదీపము యొక్క చిన్న విగ్రహముగా, మూర్తిగా, ప్రపంచములో మంగళమయ ప్రగతి ప్రకాశ కిరణాలు విస్తరింపజేయుటలో సమర్థవంతముగా వుపయోగపడింది. నా అఖండదీపంలోని కొన్ని ప్రకాశ కుంజములే ప్రతినెల అఖండజ్యోతి మాసపత్రికగా వస్తున్నవి. "**

గురువుల చరిత్రలు వున్న ప్రతి పుస్తకము ఒక అఖండజ్యోతియే. గురుదేవులయొక్క అఖండజ్యోతి ప్రకాశపుంజాలు మీ లోపలికి ప్రవేశించటానికి యీ పుస్తకాలు మీకు చాలా వుపయోగపడతాయి. కనుక ప్రతిదినము అఖండజ్యోతి మాసపత్రిక చదవండి. చదవడంతోపాటు సాధనను చేయాలి. చేస్తూ గురుదేవులు చెప్పిన మానసికస్థితులను తెచ్చుకోవాలి. ఆధ్యాత్మికవిద్యయొక్క లక్షణాలు - 1. మానసిక పరిష్కారము 2. భావనాత్మక ఉత్కృష్టత. ఆధ్యాత్మికజగత్తులో యీ రెండు సాధకులు నిరంతరము గుర్తుంచుకోవలసిన విషయాలు.

**1. మానసిక పరిష్కారము :** అనగా సాధకుని ఆలోచనావిధానము వున్నతమైన స్థితిలో వుండాలి. ఉదా॥ ఒక వ్యక్తి ఇంజనీర్ అవ్వాలంటే అతను ఇంజనీర్ లాగా ఆలోచించాలి. భౌతికవిద్యలు ఒకసారిగా రావు. ఒక్కొక్కసారి చాలా సంవత్సరాలు కష్టపడినా అనుకున్న ఫలితాలు రాకపోవచ్చు, పరీక్షలలో ఉత్తీర్ణులుకూడా కాకపోవచ్చు. అంతమాత్రంచేత తమయొక్క ప్రయత్నాలు ఆపరుకదా. మీ జీవితవిధానములో ఆధ్యాత్మికవిద్య నేర్చుకుంటున్నప్పుడు మానసిక పరిష్కారము యొక్క ప్రాముఖ్యత మీకు తెలియాలి. ఏవిధమైన మార్పులు రావాలో మనకు తెలియవుగనుక ఆధ్యాత్మికతలొ మనకు ఫలితాలు రావటములేదు. మీ ఆలోచనా విధానము మార్చుకుంటే చాలు, మీ జీవితాలలో చాలా చమత్కారములు జరుగుతాయి. భౌతికజగత్తులో ధనము సులభంగా వస్తుంది. అయితే నీకు ఒకచోట కూర్చోవడము రావాలి. ఉత్తినే కూర్చోవడము కాదు. ధనము రావాలి అనే మానసికస్థితిలో కూర్చోవాలి. అప్పుడు ఫలితము కనిపిస్తుంది. వ్యాపారులు ఆ మానసికస్థితిని కలిగివుంటారు. అలానే ఆధ్యాత్మికజగత్తులో మీ దగ్గఱ సమాజానికి వుపయోగపడేది యేదైనా వుంటే సమాజమే మీ ఇంటికి వస్తుంది. మనము వేంకటేశ్వరస్వామి దగ్గఱికి, తీర్థస్థలములకు యెందుకు వెళుతున్నాము? కోరికలు తీర్చుకోవడానికి. అలాగే మన దగ్గఱ సమాజమునకు అవసరమైనది వుంటే సమాజమే మనను వెతుక్కుంటూ వస్తుంది.

గురువుల దగ్గఱున్న ఆ ఆధ్యాత్మికత అనేది ఒక రోజులో రాదు. కొన్ని జన్మలు పడుతుంది. ఈనాడు గురువులు ఇలా చెపుతున్నారు. 'ఈనాడు జన్మిస్తున్నవారిలో వారు యెక్కడ జన్మించినా 5 సంవత్సరాలపాటు యీ ఆధ్యాత్మికతలో వుంటే అతనియొక్క పూర్వజన్మలు తెలుస్తాయి, అనేక సిద్ధులు కలుగుతాయి.' గురువుల యీ

మాటమీద శ్రద్ధ, విశ్వాసము వుండాలి. మానవశరీరధారి స్త్రీ/ పురుషు, జాతి, కులము తేడా లేకుండా 5 సంవత్సరాలు ఆధ్యాత్మికత చెప్పిన పద్ధతి ప్రకారము జీవిస్తే వారికి అష్టసిద్ధులు కలుగుతాయి. దీనికి కావలసిన మానసిక పరిష్కారము మీరు తెలుసుకోవాలి.

**2. భావనాత్మక ఉత్కృష్టత :** ఈనాడు మనకున్న విద్యావిధానంలో భావనలకు యేమి విలువ లేదు. ఒక్కరికికూడ దేశంమీద ప్రేమ లేదు. తల్లిదండ్రులు మీద, పిల్లల మీద యెక్కడా ప్రేమ లేదు. ఉన్నది కేవలము మోహము మాత్రమే. ప్రపంచము, సమాజము యేమనుకుంటుందో అనే భయంతోమాత్రమే మనము కుటుంబమును పోషిస్తున్నామేమో! మనకు భావనాత్మక ఉత్కృష్టత కావాలి, మానసిక పరిష్కారము కావాలి. మీరు ఆధ్యాత్మిక వేత్తలాగా ఆలోచించటము నేర్చుకోకపోతే యీ గురువుల యొక్క చరిత్రలలో అర్థము లేదు. కమ్యునిష్టు అంటే కమ్యునిజంలో చెప్పబడినట్లు ఆచరించే వ్యక్తి. రేషనలిష్ట్ అంటే ఆ ఆలోచనావిదానమును కలిగివుండటమేకాక వాటిని ఆచరించే వ్యక్తి. మఱి ఆధ్యాత్మికలో వుండే వ్యక్తి యెలా ఆలోచించాలి? ఆ వ్యక్తి భావనలు యేవిధముగా వుండాలి? ఉంటాయి? ఆ ఆలోచనావిధానమును అనుసరించాలి. అనుసరించి మీరందరు యోగులుగా మారాలి. అర్జునుడు శ్రీకృష్ణుడిని అడుగుతాడు.

కచ్చిన్నోభయవిభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥** (భ॥ 6 అ॥, శ్లో॥38)

***భావము : ఓ మహాభుజా! అలా భగవత్ప్రాప్తి మార్గమునుండి మోహములో పడిపోయి నిరాశ్రయుడగు పురుషుడు, చెదిరి ముక్కలైపోవునట్టి మేఘము వలె ఉభయభ్రష్టుడై నశించిపోజాలడుగదా?***

పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।
న హి కళ్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥ (భ॥ 6 అ॥, శ్లో॥ 40)

***భావము : శ్రీభగవానుడిట్లనెను. ఓ పార్థా! భగవత్ప్రాప్తికి ప్రయత్నించు సాధకుడు ఈ లోకమున గాని పరలోకమునగాని, నాశనము పొందడు. ఓ స్నేహపాత్రుడా! ఆత్మోద్ధరణ కొఱకు కర్మాచరణము గావించు నతడెవరైనను సరే దుర్గతిని పొందనేరడు.***

ఈ మార్గములో వున్నటువంటి వ్యక్తికి దుర్గతి వుండదు. ఆధ్యాత్మికజగత్తులో కష్టాలు రావు. వచ్చాయి అంటే అవి పూర్వజన్మలో చేసినవే అయివుంటాయి. లేదా ఆధ్యాత్మికతలో ప్రవేశించిన తరువాత కష్టాలు వచ్చాయి అంటే శ్రద్ధ లేకపోవడమే కారణమైవుంటుంది. చెయ్యకూడని పనులు చేయడంవలన నాశనమౌతాడు మనిషి. సాధన చేయకపోవడంవలన నాశనమౌతాడు. అంతేగాని పూజలు, వ్రతాలు, అనుష్ఠానాలు చేస్తే నాశనమవ్వడు. ఆధ్యాత్మికజగత్తులో యిన్ని యుగాలనుండి ఫలానా వ్యక్తి ఆధ్యాత్మికతవలన నాశనమయ్యాడు అని మీరు యెవరినైనా చూపించగలరా? చూపించలేరు.

అంతేకాదు ఆధ్యాత్మికజగత్తులోకి ప్రవేశించిన వ్యక్తి అతి భయంకరమైన భయమునుండికూడ రక్షింపబడతాడు.

నేహాభిక్రమనాశోऽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ (భ॥ అ॥ 2, శ్లో॥ 40)

**భావము : ఈ కర్మయోగమున ఆరంభ(బీజ) నాశన ముండదు. పైగా ప్రత్యవాయ(విపరీతఫల)దోషముకూడ వుండదు. అంతేకాకుండా కర్మయోగరూపమైన యీ ధర్మాచరణము(సాధన) స్వల్పమైనను జనన మరణ రూపమైన గొప్ప భయమునుండి రక్షింపగలదు.**

www.missionrk.com

ఆధ్యాత్మికజగత్తు అతి భయంకరమైన భయమునుకూడ నివారిస్తుంది అని గీతలో జగద్గురువు చెబుతాడు. ఆధ్యాత్మికతలో వున్న భయంకరమైన భయము మరణము. అయితే ఆధ్యాత్మికజగత్తును ఆశ్రయిస్తే మనిషి అమరుడౌతాడు. అమరుడవ్వడానికి ఆధ్యాత్మికజగత్తులో లోపించిన శ్రద్ధ, విశ్వాసములు తిరిగి మేల్కొనాలి.

**3. విచారణ :** ఇదికూడ సరిగా లేదు. రెసిడెన్సియల్ కళాశాలలో వుండి చదువుకుంటే మంచిమార్కులు వస్తాయని అందరికి తెలుసుకదా. కాని ఆ కళాశాలలో చదువుతూ కూడా విద్యార్థికి మంచి మార్కులు రాలేదు అంటే తప్పు కళాశాలవాళ్ళదికాదు విద్యార్థిదే. అతనికి చదవాలి అనే విచారణ వున్నది, కాని కార్యపద్ధతి లేదు. చదవడు. తల్లితండ్రులు పిల్లవాడిని పదేపదే చదువుకో చదువుకో అని పోరుతూవుంటారు. చదువుకోవటానికి విధివిధానాలు వున్నాయి. ఆ పద్ధతిప్రకారము చదువుకుంటే చదువొస్తుందిగాని, లేకపోతే యెంత పోరినా రాదు. పిల్లలకు సక్రమమైన పద్ధతిలో ఆలోచించటము నేర్పాలి. ఈనాటి తల్లిదండ్రులు పిల్లలకు పిఙికిమందు నూరిపోస్తున్నారు కాని వారిని వుత్సాహపరచటము లేదు. ' మేము నీకు అండగా, తోడుగా వున్నామని యెంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకి చెప్తున్నారు?

**4. కార్యపద్ధతి :** ఆలోచించినది కార్యరూపంలో పెట్టుట.

మానసిక పరిష్కారము భావనాత్మక ఉత్కృష్టత, విచారణ, కార్యపద్ధతి. ఇవి 4 ఆచరణలోపెట్టాలి సాధకుడు. ఇలా చేస్తే అంతరంగ పరిస్థితులు -బహిరంగ పరిస్థితులు కచ్చితముగా మారతాయి. నీ అంతరంగము మారితే అదేవిధముగా బహిరంగముగా పరిస్థితులు కూడా మారిపోతాయి.

మనము యేదైనా ఒక పనిని చేయాలంటే మనకు దానికి సంబంధించిన పనిముట్లు కావాలి. పనిముట్లు లేకపోతే ఆ పనిని చేయలేము. విచారణ వున్నా, మానసిక పరిష్కారము, భావనాత్మక ఉత్కృష్టత యిన్ని వున్నా పనిముట్లు లేకపోతే యే పని చేయలేము. ఒక ప్రతిభావంతుడైన శస్త్రచికిత్స చేసే వైద్యుడు వున్నాడు. ఉన్నా అతని దగ్గఱ శస్త్రచికిత్స చేయటానికి కావలసిన పనిముట్లు లేకపోతే యేమి లాభము? ఆధ్యాత్మికజగత్తులో వున్న సాధకుడు తత్సంబంధిత పనిముట్లను వుపయోగించుకోవటము మానివేశాడు. అసలు యెలా వుపయోగించుకోవాలోకూడ తెలియడంలేదు నేటి మనుష్యులకు. ఉదా॥ విష్ణుమూర్తి చేతిలో వున్న శంఖము, చక్రము, గద, పద్మము యీ నాలుగు వుపకరణములు. సాధకులు ఆ ఉపకరణములను వుపయోగించుకోవటము నేర్చుకోవాలి. అవి విష్ణువు చేతిలో వుంటే మీకు యేమి లాభము? విష్ణుమూర్తి చేతిలోని ఆ ఆయుధములను యెవరైతే వుపయోగించు కోగలుగుతారో ఆ వ్యక్తి విష్ణువు అవుతాడు.

శస్త్రచికిత్స చేసేందుకు వుపయోగపడే పరికరములను వుపయోగించుకుని వైద్యు డెలా శస్త్రచికిత్స చేస్తాడో సాధకుడు విష్ణుమూర్తి చేతిలోని ఆయుధాలను వుపయోగించుకొని విష్ణువు అయిపోగలడు. శంఖ, చక్ర, గద, పద్మాలను వుపయోగించుకున్న వ్యక్తి విష్ణువే అవుతాడు. ఆ స్థాయిలో జీవించగలగాలి సాధకుడు. అలా వుపయోగించుకోవాలి అనేదానికి సంకేతంగా ఋషులు దేవతల చేతిలో ఆయుధాలను యేర్పాటు చేశారు. మొట్టమొదట మీకు మానసిక పరిష్కారము రావాలి. మీరు ఒక భక్తుడు వలె, ఒక మానసికవేత్త వలె వుండాలి. దానితోపాటు భావనాత్మక ఉత్కృష్టత వుండాలి. ఒక వైద్యుడు దగ్గఱికి ఒక రోగి వచ్చాడు. అతనికి శస్త్రచికిత్స చేయవల్సిన అవసరమున్నది. వైద్యుడు చేస్తాను అన్నాడు. ఇక్కడ వైద్యునికి రోగికి శస్త్రచికిత్స చేయాలనే మానసిక

పరిష్కారము వచ్చింది. అయితే శస్త్రచికిత్స చేయడానికి డబ్బు యిస్తే కాని చేయనూ అన్నాడనుకోండి. అతనికి భావపరిష్కారము లేదు అంటారు.

మీరు ఒక యోగిలాగా ఆలోచించగలగాలి, యోగి లాగానే భావనలు వుండాలి. విచారణ, కార్యపద్ధతి- ఈ రెండు శ్రీరామశర్మఆచార్య గురువుగారి దగ్గఱ నేర్చుకోండి. గాయత్రీ హంసవాహిని. ఆధ్యాత్మికజగత్తులో శ్వాసకు హంసరూప మిచ్చారు ఋషులు.  ఆ శ్వాస మీయొక్క ఆలోచనలని మార్పుచేస్తుంది. శాంతముగా వున్న వ్యక్తి శ్వాస, కోపముగా వున్న వ్యక్తి శ్వాస వేఱ్వేఱుగా వుంటాయి. కోపము అంటే విచారణ.  కోపము వచ్చిన వ్యక్తి పద్ధతి యెలా వుంటుంది ? శత్రువు  కనిపిస్తే కొట్టేటట్లు, ఆవేశముగా వుంటుంది. శాంతముగా వున్న వ్యక్తి పద్ధతి యెలా వుంటుంది? నలుగురికి శాంతిని ప్రసాదిస్తుంది.

మనలో యెవ్వరికి సరిగా శ్వాస తీసుకోవటము తెలియదు. మనిషియొక్క సమస్యలకి కారణము ఊపిరి (శ్వాస) పీల్చుకొనే పద్ధతి సరిగా చేతకాకపోవడమే.

ఒక నటుడు కోపము వచ్చిన సన్నివేశంలో నటించాలి. అంటే యేమి చెయ్యాలి? తన శ్వాస మార్చుకోవాలి. మనిషి జీవించడానికి ఆధారము ఆ శ్వాసే. మనిషి జీవించివున్నాడా? లేదా? అనటానికి యేకైక పరీక్ష యేమిటి? శ్వాస ఆడటము. కోమాలోకి వెళ్ళినా శ్వాస వుంటే బ్రతికున్నట్లే. మనిషి జీవితంలో శ్వాసయొక్క ప్రాముఖ్యత యెంతో వున్నది. విజ్ఞానశాస్త్రము యెప్పుడూ ఆధారభూతమైన విషయాలలోనికి వెళుతుంది. మఱి మానవ జీవితము యొక్క ఆధారభూతమైన వస్తువేమిటి? శ్వాస. ఆ శ్వాసను సరిగా పీల్చుకోవాలి. శ్వాస మీద ఆధిపత్యమునకు ప్రాణాయామమును నిత్యము అభ్యసించాలి. దానితోపాటు ఆసనములనుకూడ వేయాలి. గురుదేవులు గాయత్రీ మహావిజ్ఞాన్‌లో ప్రాణాయామాలగూర్చి చర్చించారు. ఆ ప్రాణాయామాలను అభ్యాసములో పెట్టుకోవాలి. శ్వాస సరిగావుంటే కార్యాచరణ సరిగా వుంటుంది. భావనలయొక్క ఉత్కృష్టత అనగా మన ఆలోచనల విధానము యెలా వుండాలి? అనేదానికి గురుదేవులు అనేకసార్లు చెప్పారు. ఆ ఆలోచనావిధానమును ఆచరణలో పెట్టాలి.

తరువాత అంతరంగ, బహిరంగ పరిష్కారము. అంతరంగము మారితే బహిరంగము మారుతుంది. నీవు అత్మవు అని నీకు అంతరంగములో అర్థమైతే బాహ్యంలో వున్న గందరగోళాలు అవే సర్దుకుంటాయి. దేశానికి స్వాతంత్ర్యము కేవలము మహాత్మాగాంధీ  అహింసామార్గమువల్ల, గురువుల అంతరంగపరిష్కారము వలననే వచ్చింది. ఈనాడు మనము ఆ విషయమును మర్చిపోయి స్వాతంత్ర్యముకు వున్న విలువను పోగొట్టుకున్నాము.

గురువులు జీవితమును అధ్యయనము చేసిన శాస్త్రవేత్తలు. వారు జీవితవిధానమును 7 కోణాలనుండి కనిపెట్టేవారు. జీవితానికి ఏడు కోణాలే వుంటాయని ఆధ్యాత్మికవిద్య చెప్తుంది. సూర్యునియొక్క 7 కిరణాలు -7 కోణాలు. ఆ దృష్టికోణములు అర్థము కావడానికి యేమి చెయ్యాలి? 1. మానసికపరిష్కారము, 2. భావనాత్మక ఉత్కృష్టత వీటిగురించిన సాధనలు చెయ్యాలి. 3. విచారణ, 4. కార్యకారణ పద్ధతి, 5. అంతరంగ పరిష్కారము - బహరంగ పరిష్కారము. ఆధ్యాత్మిక జగత్తులో యివి మెట్లు. వీటిని ఆచరించిన వ్యక్తి అత్యద్భుత ఫలితాలను పొందితీరుతాడు అని గురుదేవులు శ్రీరామశర్మఆచార్యుల జీవితమును చూసి గ్రహించవచ్చు.

ఆధ్యాత్మికవిద్యను మన మొక విజ్ఞానంగా నేర్చుకోవాలి. నేర్చుకుంటున్నాము. అయితే అలా నేర్చుకుంటున్నా మనే అవగాహనాలోప మున్నది. దానివల్ల యేమౌతోందంటే ఆధ్యాత్మికతలో మనమేమి సంపాదించుకుంటాము? అన్నది తెలియకుండాపోతున్నది. భౌతికవిద్యలో అయితే ఎమ్.ఎ.చేస్తే ఫలానాది చదివాము అని స్పష్టంగా

www.missionrk.com

తెలుస్తున్నదిగాని ఆధ్యాత్మికవిద్యలో యీ అవగాహన లేదు. ఆధ్యాత్మికవిద్యను అనుసరిస్తే మన కోరికలు తీరుతాయి. అవి ఆ విద్యయొక్క ప్రక్కన వచ్చే ఉత్పాదనలేతప్ప అసలు ఉత్పాదన ఆధ్యాత్మికవిద్య రావడము. పట్టుచీర కొంటే యింకో చీర వుచితము అనంటే ఆ వుచితంగా యిచ్చే చీరకోసం ఓ 20,000 పెట్టి పట్టుచీర కొనంగదా! ఉచితంగా వచ్చే చీర - కోరికలు తీరడము లాంటిది. అసలు లాభము- ఆధ్యాత్మికవిద్యలో నిష్ణాతులవ్వడము. అది పట్టుచీర. మనము పట్టుచీర కావాలనుకోవాలితప్ప వుచితంగా వచ్చే చీరకోసం దీన్ని అనుసరించరాదు. భౌతిక కోరికలు తీర్చుకోవడంకోసం ఆధ్యాత్మికవిద్యను ఆశ్రయించరాదు. అయితే ఆ విద్యవల్ల కోరికలు తీరుతాయన్నది కచ్చితంగా చెప్పవచ్చు.

***మఱి ఆధ్యాత్మికజగత్తులో సాధకుడు కోరుకోవాలి? ఆధ్యాత్మికవిద్యలో కోరుకోవాల్సినవి - నవనిధులు లేక అష్టసిద్ధులు. ఇందులో యేదో ఒకటైనా లేక రెండూ అయినా కోరుకోవచ్చు. గాయత్రీ ఉపాసన యీ రెండిటిని ప్రసాదిస్తుంది.***

అలాగే హనుమంతుడుకూడ రెండూ ప్రసాదిస్తాడు. ఇక్కడ ఒక విశేషము యేమిటంటే హనుమంతుడు రామకార్యముచేశాడుగనుక అష్టసిద్ధులు, నవనిధులు ఆయనకు ప్రసాదించబడ్డాయిగాని ఆయన వాటికోసం యే సాధనలూ చేయలేదు. హనుమంతుడి బాల్యంలోనే ఆయన సాధనాసంపత్తి మొత్తము వున్నది. హనుమంతుడికి పుట్టుకతోనే వరదానాలు యివ్వబడ్డాయి. అయినా రాముడు వచ్చేంతవఱకు అవి యెందుకు వుపయోగపడలేదు? సుగ్రీవుడు, హనుమంతుడు యిద్దఱూ పిఱికివారిలాగ, చేతకానివారులా ఋష్యమూకపర్వతంమీద వాలికి భయపడి దాక్కున్నారు. రామలక్ష్మణులను చూసి వారిద్దఱూ వాలి పంపిన మనుష్యు లేమో అని భయపడ్డారు. మఱి హనుమంతుడికి దేవతలు వరా లిచ్చారుగదా? అవేమయ్యాయి? దేవతల వరదానాలు పనిచేయాలంటే దైవీకార్యము చేసితీరాల్సిందే అన్న విషయము మనుష్యులకు అర్థము కావడంలేదు.

ప్రభుత్వంయొక్క పనిచేస్తే ఆ వ్యక్తిని చూసి భయపడుతుంది సమాజము. ఒక రక్షకభటుడిని చూసి మనము భయపడతాము. అతనేమన్నా సర్వశక్తిమంతుడా? కాదు. అతని వెనకాతల ప్రభుత్వము వున్నది. ఆధ్యాత్మికత అంటే దైవీకార్యము లేక రామకార్యము అంటే మనలో వున్న ఆత్మారాముడి పని లేక జీవాత్మ పని చేయాలి. ఆ పని చేయాలంటే జీవాత్మకు సమర్పణ చేసుకోవాలి. మనము జీవాత్మకు సమర్పణ చేసుకోవడంలేదు, శరీరానికి సమర్పణ చేసుకుంటున్నాము. మనిషి లొంగవల్సినది కోరికలకు, ఆలోచనలకు, శరీరానికి కాదు. మఱి దేనికి లొంగాలి? మనిషి తనలో వున్న జీవాత్మకు లొంగాలి. హనుమంతుడు తన హృదయమును చీల్చి అక్కడ సీతారాములని చూపిస్తాడు. దానర్థము ఆయన తన ఆత్మారాముడికి సమర్పణ చేసుకున్నాడు అని. హృదయంలో వుండేదే రాముడు. ఆయన ఆ ఆత్మారాముడిని గమనించాడు. మనము గమనించము.

ఆధ్యాత్మికవిద్యను నేర్చుకుంటే మనకు అష్టసిద్ధులు, నవనిధులు వస్తాయి అనే అవగాహన కలిగించుకోడము అత్యవసరము. అవి మన లక్ష్యములు. అయితే అవి వెంటనే వస్తాయా? రావు. కొన్ని జన్మలు వాటికోసం వెచ్చించాలి. వీటిని సాధించుకునేందుకు జపము, ప్రాణాయామము, ధ్యానము అనే 3 అంగము లున్నాయి. ఏ మతమువారైనా యీ మూడిటిని అనుసరిస్తారు.

జపము గురించి గురుదేవులు ఇలా చెప్పారు. 'మీరు యే మంత్రమును జపిస్తూన్నా మీ భావము యెలా వుండాలి అంటే మీ శరీరములు ప్రకాశవంతమౌతున్నాయి'. మీ స్థూలశరీరమేగాదు, సూక్ష్మ, కారణశరీరములు,

www.missionrk.com

మీ కణకణము, రోమరోమము ప్రకాశవంతమౌతున్నాయి అని భావించుకోవాలి. రక్తము, నరములు మొదలగునవి ప్రకాశవంతమౌతున్నాయి అని భావించాలి. జపము లక్ష్యము వీటన్నింటిని ప్రకాశవంతము చేయడము. మీరు యెంత ప్రకాశవంతమవ్వగలిగితే అంత అవుతారు. జపము వలన భౌతికమైన లాభము యేమిటంటే మీరు చక్కని బంగారువర్ణంలోకి మారుతారు. ఉదా॥ రామకృష్ణపరమహంస జపము వలన బంగారువర్ణంలోకి మారిపోయాడు. బంగారపుగొలుసు ఆయన చేతిలో పెడితే అది, ఆయన రంగు రెండూ కల్సిపోయేవి. గురువు లందఱూ యీ వర్ణమును పొందుతారు. గురుదేవులు శ్రీరామశర్మఆచార్యగారు హిమాలయ యాత్రానంతరము నా రంగు బంగారువర్ణంలోకి మారింది అని తమ ఆత్మకథలో తెలియజేశారు. జపము అనేది భౌతికంగాకూడ ఇంత లాభము నిస్తుంది. ఆ వెలుగును ఆభా అంటారు ఆధ్యాత్మికజగత్తులో. ఆభా అంటే వెలుతురు అని.

జపము చేసేటప్పుడు గురుదేవులు అఖండదీపంయొక్క ప్రాముఖ్యతను చెబుతున్నారు. జ్యోతి అనేది 3 స్థాయిలో వుంటుంది. 1. మన కంటికి కనిపించే జ్యోతి. అది మనకు కనిపించే చీకటిని తొలగిస్తుంది. 2. జ్ఞానజ్యోతి. ఈ జ్ఞానజ్యోతిని ఈనాడున్న మన విద్యావిధానము స్పష్టంగా నేర్పుతున్నది. 3. ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతి మీకు అన్ని తెలియజేస్తుంది. మీకన్నీ తెలుస్తాయి. అన్ని విషయాల్లోను అవగాహన కలిగిస్తుంది.

రోగాలు నయమవ్వడంలేదు. వెంటనే గురువులను ఆశ్రయిస్తారుగదా? వ్యాపారస్తులకు వ్యాపారంలో నష్టమొస్తుంది. వెంటనే గురువులను ఆశ్రయిస్తారు. అంటే గురువుల జీవితవిధానంలో వారు అన్నిరకాల సమస్యలకు పరిష్కారమార్గము నివ్వగల రని ఋజువుచేస్తున్నారుకదా? గురువుల ఆ జ్ఞానజ్యోతులు మీ హృదయంలో వెలగాలి. గురువుల చిత్రపటాలే అనేక అద్భుతాలు చేస్తాయి. చిత్రపటాలు వుంటే వారున్నట్లే. ఉపయోగించుకోవాలి వాటిని.

జపసమయంలో వెలిగించిన అఖండజ్యోతికి ప్రతీకగా గురుదేవులు శ్రీరామశర్మఆచార్య 'అఖండజ్యోతి' మాసపత్రికను ఆరంభించి ప్రతీనెలా ఆ జ్ఞానమును ప్రపంచానికి అందించారు. ఆయన అందించిన జ్ఞానజ్యోతి కిరణాలు అనేకము. 3,600 పుటలున్న పుస్తకాలు 108 రచించారు. వాటిని గురుదేవుల వాఙ్మయంగా ప్రపంచానికి అందిస్తున్నది శాంతికుంజ్ ఆశ్రమము. ఆయన సాహిత్యంలోనే మనకు స్పష్టంగా ఒక విషయము అర్థమౌతుంది. ఆధ్యాత్మికత అంటే మీకు అష్టసిద్ధులు, నవనిధులు లభించితీరాలి అని గురుదేవులు తమ సాహిత్యంలో వ్రాశారు. వైద్యవిద్య చదివితే మందివ్వగలిగే సామర్థ్యము లభించినట్లే ఆధ్యాత్మికవిద్యను అభ్యసిస్తే అష్టసిద్ధులు, నవనిధులు లభించితీరాలి. ముక్తికోసం సాధనలు చేయనక్కఱ్లేదు. ఆత్మ ముక్తము. శరీరాలు ముక్తి చెందుతాయి అంటే నశిస్తాయి. మఱి యింక ముక్తి యెవఱికి? వీటికోసం సాధనలు చేయండి. అష్టసిద్ధులు, నవనిధులకోసము సాధన చేయండి. అష్టసిద్ధులు-1. అణిమ 2. లఘిమా 3. గరిమ 4. ప్రాప్తి 5. ప్రాకమ్య 6. వశితా 7. శ్రుత 8. దుష్టశక్తిప్రేరణా. నవనిధులు - 1. శంఖము 2. కచ్ఛపము 3. మరకము 4. పద్మము 5. మహాపద్మము 6. ముకుందము 7. కుందము 8. నీలము 9. చర్యా

దేవతల చేతిలో పద్మము అనేది ఒక నిధి. అది పువ్వే కాదు. శంఖము అనేది సముద్రంలో దొరికే ఒక వస్తువే కాదు. అది ఒక నిధి. మహాపద్మము అనేది ఒక నిధి. ఆధ్యాత్మికజగత్తులో లభించే సిద్ధులు, నిధులు అనేవి భౌతికజగత్తుకు సంబంధించినవి కావు అని అర్థము చేసికోండి. అవి మానసికస్థితులు. ప్రాప్తి అనే సిద్ధివలన మీరు యేది అనుకుంటే అది అవుతుంది. మీ దగ్గఱకు యెవఱు వస్తే వాళ్ళకు వారు కోరినది లభిస్తుంది. అదొకసిద్ధి.

www.missionrk.com

అణిమ - చిన్నగా అవడము. మహిమ - పెద్దగ అవడము. రామాయణంలో సురస అనే రాక్షసి వచ్చినప్పుడు హనుమంతుడు యీ రెండు సిద్ధులను వుపయోగించుకున్నాడు. సిద్ధులు అంటే ధనము కాదు.

భారతీయ ఆధ్యాత్మికతలో నిత్యజీవితంలో వుపయోగపడే జ్ఞానజ్యోతులను గురుదేవులు అఖండజ్యోతిగా వెలిగించారు. 1926 వసంతపంచమిరోజున గురుదేవుల జీవితంలో ఒక చమత్కారము జరిగింది. ఆయన 10 వ సంవత్సరంలో గాయత్రీమంత్రదీక్ష మదన్‌మోహనమాలవ్యా దగ్గఱ తీసుకున్నారు. ప్రతిదినము క్రమంతప్పకుండా 5 మాలలు గాయత్రీజపం చేయమని సలహాయిచ్చారు మాలవ్యాగారు. గురుదేవులు యిచ్చిన సూచనలమేఱకు జపము చేసుకుంటున్నారు. 10 సంవత్సరముల వయస్సులో గురుదేవులు దీక్ష తీసుకున్నాక కొన్ని నియమాలను పాటిస్తూ జపమును చేస్తూవచ్చారు. జపసాధకులైనవారు యెవరైనాసరే వాటిని పాటించితీరాల్సిందే. అప్పుడు ఫలితాలొస్తాయి. మంత్రజపము యెప్పుడూకూడ ఒకే స్థలంలో చేయాలి. ఒకే సమయానికి చేయాలి. ఒకే సంఖ్యలో చేయాలి. ఇలా జపము చేయకుండా జపంయొక్క ఫలితాలు సరిగారావు. అందుకే గురువులు అంతగా నియమాలను చెప్పడంలేదు. చెప్పినా సాధకులు వాటిని పాటించరు. పాటించనిదే ఫలితము రాదు. దానితో సాధకులలో విశ్వాసరాహిత్యము యేర్పడుతుంది. అందుకని గురువులు పెద్దగా నియమాలను చెప్పడంలేదు. గురువులు చెప్పిన నియమాలను పాటిస్తూ 40 రోజులు జపము చేస్తే కచ్చితంగా అద్భుత ఫలితాలొస్తాయి.

యజ్ఞస్థలము పరీక్షను నిర్వహించే స్థలము లాంటిది. అందుచేతనే పూర్వకాలంలో యెవరినిపడితే వారిని యజ్ఞస్థలంలోకి రానిచ్చేవారుగాదు. భౌతికవిద్యలోకూడ పరీక్షకు అందరిని అనుమతించరుగదా? ఆధ్యాత్మికవిద్యలో యజ్ఞస్థలము - సాధకుడు జపము చేసినదానికి ప్రతిఫలము పొందే స్థలము. అక్కడ నియమాలను తు.చ.తప్పకుండా పాటించి జపము చేసినవారందఱూ యజ్ఞము చేసుకోవచ్చు. నువ్వు యే దేవతామంత్రమును వుపాసించినా, జపము చేసిన సామూహికంగా యజ్ఞము చేసుకోవచ్చు. కనుక యజ్ఞము చేయడానికి ముందు ఒక కచ్చితమైన సంఖ్యలో అంటే మొదటగా కనీసము 24,000 జపము, అతి ఎక్కవగా అంటే 24,00,000 జపము పూర్తిచేయాల్సిందే. నవరాత్రులలో 24,000 పూర్తిచేసి దానికి తగిన లాభములను పొందవచ్చు. గురుదేవుల లాగ 24 సంవత్సరాల తపస్సు చేయవచ్చు. 24 సంవత్సరాలు అయిపోయిన తర్వాత గూడ గురుదేవులు జపము ఆపలేదు. కోట్ల గాయత్రీ జపము చేశారు గురుదేవులు. 'మీరుకూడ దీపయజ్ఞ ప్రక్రియతో ఆరంభించి జపము చేసుకోండి' అని అన్నారు.

**" అఖండదీపము -అఖండయజ్ఞస్వరూపమేమో! అగరుబత్తులను వెలిగించుట -హవన సామగ్రియొక్క; జపము -మంత్రోచ్చారణ యొక్క; జ్యోతి - నేతితో ఆహుతి వేసే క్రియాకలాపాలకు సంకేతమేమో! ఈవిధంగా అఖండహవనము యొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో. నీటితో నిండిన కలశము, వెలుగుతున్న దీపస్థాపన, అగ్ని-జల సంయోగంతో స్టీమింజన్ లాంటి సూక్ష్మప్రయోజనము జరుగుతున్నదేమో! "**

దీపము పెట్టుకున్నారు. బత్తీలు వెలిగించారు. కలశము పెట్టుకున్నారు. ఈ ప్రక్రియతో లేక దీపయజ్ఞంతో జపమును కలిపితే ఏరోజు జపఫలితమును ఆరోజే పొందటానికి సిద్ధమౌతున్నారన్నట. పూజలో యెప్పుడైతే ఆవునేతితో ఒక దీపము వెలిగించి, కలశంపెట్టి, అగరబత్తీలు వెలిగించామో అప్పుడక్కడ ఒక యజ్ఞప్రక్రియ జరుగుతోందన్నమాట. ఇలా చేయడం పరీక్ష వ్రాయడము లాంటిది. యజ్ఞప్రక్రియ ఒక పరీక్ష లాంటిది. ఆ పరీక్షలో మీరు వుత్తీర్ణులౌతారా? అవ్వరా? అన్నది తెలుసుకోవాలి. మీరు చేసే మానసిక ప్రక్రియనుబట్టి ఫలితము వుంటుంది.

**'' ఈవిధంగా ఒక అఖండహవనంయొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో! నీటితో నిండిన కలశము, వెలుగుతున్న జ్యోతియొక్క అగ్నిస్థాపన, అగ్ని -జల ప్రయోగంలో స్టీమింజన్ లాంటి సూక్ష్మ ప్రయోజనము జరుగుతున్నదేమో! అంతర్జ్యోతిని వెలిగించుకొనుటకు యీ బాహ్యజ్యోతి నుండి సహాయం లభిస్తున్నదేమో! ఏది యేమైనా ఈ అఖండజ్యోతినుండి నాకు భావనాత్మకప్రకాశము, అనుపమ ఆనందము, ఉల్లాసము నిరంతరము లభిస్తున్నది. "**

కనుక జపము సరిగ్గా జరుగుతున్నది అనేదానికి ఒకే ఒక నిరూపణ యేమిటంటే మీకు గురుదేవులు చెప్పిన ఉల్లాసము, అనుపమ ఆనందము, భావనాత్మకప్రకాశము లభించితీరాలి. మీరు యెలాంటి పరిస్థితులలో వున్నా ఇవి లభించి తీరాలి. మనము బాహ్యపరిస్థితులమీద ఆధారపడి సుఖదుఃఖాలను పొందుతాము.

ఆధ్యాత్మికజగత్తు యేమి చెబుతుందంటే బాహ్యపరిస్థితులకు ఆనందమునకు సంబంధము లేదు. ఉన్నది అని మనిషి అనుకుంటాడు. ఉదా॥ మా అబ్బాయికి 10వ తరగతిలో మంచి మార్కులు వస్తే........ ఆనందంగా నవ్వుతాను. రాకపోతే బాధపడతాను. అది మనిషి నిర్ణయించుకున్నది. ఆధ్యాత్మికజగత్తులోకూడ నిరంతరము ఆనందంగా వుండవొచ్చు. బాహ్యపరిస్థితులు యెలా వున్నా నిరంతరము ఉల్లాసంగా వుండవచ్చు. ఈనాటి మనిషికి ఆనందము, ఉల్లాసము అంటే నిజమైన అనుభూతి లేదేమో? ఆనందము, ఉల్లాసము అనేవి నిజానికి మనిషియొక్క సహజప్రవృత్తులు. ఆనందంగా వుండటము సహజస్థితి.

రమణమహర్షి దాన్ని నిరూపించారు. మీరు ఒక వస్తువును కొనటానికి డబ్బులుకూడబెట్టి, కూడబెట్టి దాన్ని కొన్నారు. అప్పుడు మీరు ఆనందము అనుభవిస్తారుగదా! అయితే రమణులు యేమన్నారంటే ఆనందంగా వుండటానికి కారణము నువ్వు ఆ వస్తువును కొనటం కాదయ్యా. ఆ వస్తువు కొన్న క్షణంలో నీకు కోరికలేమి లేవు. అందుచేత ఆనందంగా వున్నావు. ఈలోపు ఇంకో కోరిక వస్తుంది. ఆనందము మాయమౌతుంది. కనుక ఆనందము, ఉల్లాసము అనేవి మనిషియొక్క సహజస్థితులు. లేనిది నెత్తిన వేసుకుని బాధపడతాడు మనిషి.

**"ఈవిధంగా ఒక అఖండహవనంయొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో! నీటితో నిండిన కలశము, వెలుగుతున్న జ్యోతియొక్క అగ్నిస్థాపన, అగ్ని -జల ప్రయోగంలో స్టీమింజన్ లాంటి సూక్ష్మ ప్రయోజనము జరుగుతున్నదేమో! అంతర్జ్యోతిని వెలిగించుకొనుటకు యీ బాహ్యజ్యోతి నుండి సహాయం లభిస్తున్నదేమో! ఏది యేమైనా ఈ అఖండజ్యోతినుండి నాకు భావనాత్మకప్రకాశము, అనుపమ ఆనందము, ఉల్లాసము నిరంతరము లభిస్తున్నది. బయటపూజావేదికమీద పెట్టిన యీ దీపము కొన్నిరోజులు బయటనే వెలుగుతున్నట్లు కనిపించినా మెల్లిమెల్లిగా నాలోపలకూడ ఈ అఖండజ్యోతి నా అంతఃకరణలో అలాగే నిరంతరము వెలుగుతున్నదన్న అనుభూతి స్పష్టంగా తెలియుట మొదలెట్టింది. "**

బయట వెలిగించిన దీపము పూజచేస్తున్నప్పుడు మీకు లోపల వెలగాలి. జపము చేస్తున్నప్పుడు ఆ జప కిరణాలవల్ల సూర్యునినుండి వస్తున్న కాంతి కిరణములు నా శరీరంలో ప్రవేశించి నన్ను కాంతివంతముగా చేస్తున్నాయి అని భావన చేసుకోవాలి.

ఆధ్యాత్మికతతో అంతాకూడ భావములతో కూడియున్నది. యద్భావం తద్భవతి. మనము యే భావమూ లేకుండా జపము చేస్తాము. ఫలితమూ అలాగే వుంటుంది.

గుహుడు పూర్వజన్మలు గురించి పండితులు యేమి చెబుతారంటే - గుహుడు తన పూర్వజన్మలలో ఒకసారి ఒక పనిచేశాడు. శ్రీరాముడు త్రేతాయుగంలో పుట్టాడు. రామనామము పూర్వంనుండే వున్నది. గుహుడు పూర్వజన్మలో ఒక ఋషి కుమారుడు. ఆ దేశపురాజు తన గురువు చెప్పినట్లుగా జీవితమును గడుపుతున్నాడు. ఒకరోజు ఆ రాజు యేదో ఒక సమస్య వచ్చి పరిష్కారంకోసము గురువు ఆశ్రమానికి వచ్చాడు. ఆశ్రమంలో గురువు లేడు. గురుకుమారుడు వున్నాడు. ఆ రాజు గురుకుమారునికి తన సమస్య చెప్పి పరిష్కామార్గమును సూచించ మన్నాడు. గురుకుమారుడు కొంతసేపు ఆలోచించి 'రామనామమును మూడుసార్లు వుచ్చరించు, సరిపోతుంది' అన్నాడు. రాజు వెంటనే రామనామమును మూడుసార్లు వుచ్చరించాడు. సమస్యకు పరిష్కారము లభించిది. వెళ్ళిపోయాడు. గురువుగారు ఆశ్రమానికి తిరిగివచ్చారు. గురుకుమారుడు తను చేసిన పనిగూర్చి తండ్రికి తెలియజేశాడు. అంతట అది విన్న గురువుగారికి కోపం వచ్చింది. ఎందుకంటే రామనామమును ఒక్కసారి వుచ్చారణ చేస్తే చాలు ఆ సమస్య పరిష్కరింపబడుతుంది. అటువంటిదానికోసం మూడుసార్లు రామనామమును వుచ్చారణ చేయమన్నావు. నీకు రామనామ మహిమ తెలియలేదు. కనుక నీవు రామనామమును  వుచ్చరించడానికి అర్హతలేని జాతిలో జన్మించుదువుగాక! అని శపించాడు. ఆ ఋషి కుమారుడే త్రేతాయుగంలో రాముడిని నదిని దాటించిన గుహుడుగా జన్మించాడు.

రామనామ మహిమ తెల్సిన మనకు యెందుకు ఫలితాలు రావడంలేదు? రామనామ మహిమ కలియుగంలో పోయిందా? పోలేదుకదా? మన తప్పే అక్కడ కనిపిస్తున్నది. కదా! వాల్మీకి ఒకానొక జన్మలో ఒక క్రూరుడైన నరహంతకుడు. ఆ హంతకుడి దగ్గఱకు నారదముని వెళ్ళి రామనామమును వుచ్చరిస్తూండు. నువ్వు తరిస్తావు అని చెప్పాడు. వెంటనే ఆ హంతకుడు రామనామమును జపించడము మొదలెట్టాడు. కొంతకాలం తర్వాత వాల్మీకిగా మారిపోయాడు. నారదుడు వచ్చి రామనామమును జపించమన్నాక ఆ హంతకుడు ఒక హత్యకూడ చెయ్యలేదు. ఎవ్వరిని బాధపెట్టలేదు. అంటే మంత్రజప ఫలితము రావాలంటే మీ జీవితవిధానము మారాలి. జీవితంలో మార్పురాకుండా జపము ఫలితమియ్యదు. రత్నాకరుడు లాంటి ఒక హంతకుడు క్షణంలో మారగలిగినప్పుడు మనము యెందుకు మారలేము? నిత్యజీవితంలో తప్పుడు మాటలు  మాట్లాడవల్సిన అవసరము మనకు లేదేమో గమనించుకోండి. అనవసరమైన మాటలు వద్దు. వాక్శక్తిని దుర్వినియోగము చేసుకోకూడదు. నువ్వు యెవఱినైనా బాధపెడితే ప్రకృతిలో నిన్ను బాధపెట్టేవారుంటారు. నీ వాక్కుతో నువ్వు యెవ్వఱిని బాధపెట్టకుండా వుంటే, నువ్వు యేదంటే జరుగుతుంది. అంటే వాక్సిద్ధి లభించిందన్నమాట. ఆ వాక్సిద్ధికోసము జపతపాలు చేయనవసరంలేదు. యమనియమాలు  పాటిస్తే సిద్ధులు వచ్చేస్తాయి.

మనలో చాలామంది దొంగలు కాదు. అయినా మనల్ని దొంగలు అంటాడు జగద్గురువు. గీత చాలా స్పష్టంగా యీ విషయమును చెబుతుంది. 'స్తేన యేవసః' అంటాడు. తనకోసం వంట చేసుకునేవాడు దొంగే అంటాడు జగద్గురువు. యజ్ఞీయ ఆహారం తీసుకోవడము వుత్తమోత్తమము. ఎందుకంటే యజ్ఞప్రసాదమును అందరికి పంచికదా నువ్వు తినేది. అప్పుడు నువ్వు దొంగవి కావు. మనము దొంగలము అవునోకాదో మనము నిర్ణయించుకోకూడదు. భోజనవేళకు ఒక అతిథి వస్తే మనము మనస్సులో యీ వ్యక్తి వెళ్ళిపోతే బాగుండును. నేను భోజనము చేయవచ్చును అని అనుకుంటాము. అది తప్పవునా, కాదా? ఆధ్యాత్మిక సిద్ధులకు సాధనలు అవసరంలేదు.

www.missionrk.com

పూర్వజన్మలగురించి తెలియడంలేదు. అపరిగ్రహవ్రతమును ఆచరిస్తున్నవారికి పూర్వజన్మలగూర్చి తెలుస్తుంది. తనది కాని వస్తువును తను ముట్టుకోకూడదు. నేనేమి ముట్టుకోవడం లేదు అని ప్రతీవారు అనుకుంటారు. ముట్టుకుంటున్నావు అని ప్రకృతి చెబుతోంది. నీది అనే భ్రమతో నీ శరీరమును ముట్టుకుంటున్నావు. శరీరము ఆత్మది. ఆ ఆత్మ యీ శరీరమును యెందుకు తయారుజేసుకున్నదో నీకు తెలియదు. నువ్వు దాన్ని వుపయోగించు కుంటున్నావు. మఱది దొంగతనము కాదా? భారతీయులమైన మనకు కచ్చితంగా ఒక విషయము తెలుసు. మన శరీరమును మనము నిర్మించుకోలేదు. మన ఆత్మ నిర్మించుకున్నది. దాన్ని జీవాత్మ అంటారు. ఆత్మ యీ శరీరము యెందుకు నిర్మించుకున్నదో నీకు తెలుసా? తెలియదు. ఆ ఆత్మ నిర్మించుకున్న శరీరమును వుపయోగించుకుంటూ జీవితమును కొనసాగిస్తు; నేను అపరిగ్రహవ్రతమును పాటిస్తున్నాను అంటే?

ఏ క్షణంలో అయితే 'నేను ఆత్మను' అనే భావము నీకు వస్తుందో తక్షణమే నీకు పూర్వజన్మలగూర్చి తెలుస్తుంది. మహాత్ములు, గురువులు అందఱూ దీనికి వుదాహరణగా నిలుస్తారు. ఆధ్యాత్మికజగత్తులోనువ్వు యే తలములో వున్నావో తెలిస్తే అక్కడినుండి సాధన మొదలెట్టవచ్చు. అందుకు పూర్వజన్మలు తెలియాల్సిన అవసర మున్నది. మన ఆధ్యాత్మిజగత్తులో సాధనలు యెందుకు విఫలమౌతున్నాయంటే నువ్వు సాధనను క్రిందటి జన్మలో యెక్కడ ఆపావో నీకు తెలియదు. మఱి ఈ జన్మలో సాధన ఎక్కడినుండి మొదలెడతావు? తెలియదుగా? జన్మజన్మలపరంపరకు సంబంధించిన ఆధ్యాత్మిక సాధనలో మనము యెక్కడున్నామో మనకు తెలియాలిగా?

శ్రీరామశర్మఆచార్యగారు ఒక సవాలు విసిరారు. 'రాబోయే 200 సంవత్సరాలవఱకు కుండలినిజాగరణసాధన కోసముమీరు గురువును వెదుకవల్సిన అవసరంలేదు. మీరు ఆ సాధనలు మొదలెట్టేయండి. నేను సశరీరంగా వచ్చి మీకు యే సాధనలు చెప్పాలో అవి చెప్పి చేయిస్తాను'.

అంత పెద్ద గురువు మీకు అ, ఆ, ఇ, ఈలు నేర్పించరు. అది దృష్టిలో పెట్టుకోండి. సాధనలు చేస్తున్నప్పుడు తీవ్రత తెచ్చుకోండి. జపము చేస్తున్నప్పుడు మీ శరీరంలోని అణువణువు వెలుగుతో నిండుతోంది, శరీరము ప్రకాశవంతమౌతోంది అన్న భావన చేసుకోండి.

మీరు దీపం వెలిగించుకుంటే, అగరబత్తీలు వెలిగించుకుంటే, కలశం పెట్టుకుంటే స్టీమింజన్ కున్న శక్తి మీలో వస్తుంది. యంత్రం మిమ్మల్ని గమ్యస్థానము చేరుస్తుంది. మీరేకాదు మీతోపాటు అనేకమందిని గమ్యానికి చేరుస్తుంది. ఒక వ్యక్తి జపముచేస్తే చాలు ఆ కుటుంబంలోని అటు 7 తరాలు, ఇటు 7 తరాలు తరించిపోతాయి అని గురుదేవులు నొక్కివక్కాణిస్తున్నారు. స్టీమింజన్ అనేకమందిని లాగుతుందికదా? ఇక్కడా అంతే జరుగుతుంది.

**" ఈవిధంగా ఒక అఖండహవనంయొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో! ఏవిధంగా పూజాగృహములో యీ అఖండజ్యోతి తన ప్రకాశమును అందజేస్తున్నదో అదేవిధంగా నా సమస్త అంతరంగము నాలో వెలుగుతున్న అఖండజ్యోతిద్వారా జ్యోతిర్మయంగా మారుతున్నదని నిరంతరము తెలిసినది. నేను శరీరము, మనస్సు, ఆత్మలో; స్థూల, సూక్ష్మ, కారణశరీరాలలో ఏ జ్యోతి అవతరణ సాధన-ధ్యానం చేయుచున్నానో సంభవతః అది ఈ అఖండదీపంయొక్క ప్రతిక్రియయేనేమో! నా ఉపాసనయొక్క సంపూర్ణఅవధిలో ఏవిధంగా ఉపాసన గృహంలో అఖండదీపం తన వెలుగును విస్తరింపజేసిందో; అదేవిధంగా భావనాక్షేత్రంలో కూడ అటువంటి ప్రకాశమే అన్నివైపులా విస్తరించేది. నేను, నాది అంతా ప్రకాశమయమే. చీకటి పొరలు తొలగిపోయాయి. మోహాంధకారము భస్మమయ్యింది. ప్రకాశమయమైన ఆలోచనలు, భావనలు, గతివిధులు నా శరీరము, మనస్సును ఆవరించుకున్నావు. సర్వత్రా అన్నివైపులా ప్రకాశము సముద్రం వలె**

విస్తరించియున్నది. నేను చేప వలె యీ విశాల ప్రకాశసముద్రంలో ఈదులాడుతున్నాను. ఈ అనుభూతులు, ఆత్మబలము, దివ్యదర్శనము మరియు అంతఃఉల్లాసము వికసించడానికి అఖండదీపము ఎంత సహాయపడినదో నేను చెప్పలేను. ఇది నాయొక్క కల్పనయే కావచ్చు. ఊహయే కావచ్చు. కానీ నేనెప్పుడూ అనుకుంటాను. పూజామందిరంలో అఖండదీప స్థాపనే చేసియుండకపోతే పూజాగృహములో ఆవరించివుండే మసక వెలుతురు వలె నా అంతరంగంకూడ మసకమసకగానే వుండేదేమో. ఇప్పుడైతే నాకు ఈ అఖండదీపము దీపావళిదీపపర్వమువలె నా నరనరాలలో మిరుమిట్లు గొల్పుతూ కనిపిస్తున్నది. నా భావభరిత అనుభూతుల ప్రవాహంలో 32 సంవత్సరాలకు పూర్వము మాసపత్రిక ఆరంభించినప్పుడు ప్రపంచములోకెల్లా నాకు ప్రియమైన నేనిష్టపడే సర్వోత్తమమైన పేరు 'అఖండజ్యోతి' అని పెట్టాను. ఆ భావావేశంలో ప్రతిష్ఠించబడిన మాసపత్రిక ఈ అఖండదీపంయొక్క చిన్న విగ్రహంగా, మూర్తిగా, ప్రపంచంలో మంగళమయ ప్రగతి ప్రకాశ కిరణాలు విస్తరింపజేయుటలో సమర్థవంతంగా వుపయోగపడింది. నా అఖండదీపంలోని కొన్ని ప్రకాశకుంజములే ప్రతినెల అఖండజ్యోతి మాసపత్రికగా వస్తున్నవి. "

గురుదేవులు వ్రాసిన యే పుస్తకమైనా వొక వెలుతురే. ఒక జ్ఞానజ్యోతియే. గురుదేవులు 1926లో అఖండదీపం వెలిగించారు. ఆ దీపం ఆయన జీవితాంతము వెలుగును నింపింది. మఱి ఆయన వెలిగించిన అఖండదీపం మీ యింట్లో వుంటేనో! అయితే వుపయోగించుకుంటేనే వుపయోగపడుతుంది అన్నది వాస్తవము. అఖండజ్యోతిని మీ ఇంట్లో ప్రతిష్ఠించుకోండి. దానికి కొంత అంశదానమును చెల్లించండి.

"సాధనయొక్క మూడవచరణంలో ప్రవేశించగానే 'ఆత్మవత్ సర్వభూతేషు' కిరణాలు వెదజల్లబడ్డాయి. మాతృవత్ పరదారేషు మరియు పరద్రవ్యేషు లోష్టవత్ -సాధన నా శరీరము వరకే పరిమితము. కళ్ళలో పాపదృష్టి వస్తే వివేకము అనే మూడవనేత్రము తెరచి దానిని భయపెట్టి పారద్రోలాను. శరీరముమీద అత్యంత కఠోర నియమాలతో సంకెళ్ళు వేశాను. దానివల్ల దారితప్పే పరిస్థితు లేర్పడే సంభావనను తీసివేశాను. ఇంక దుష్టవ్యవహారము చేయలేనుకదా! మాతృవత్‌పరదారేషు- సాధనను ఎటువంటి అవరోధాలు లేకుండా నిభాయించుకున్నాను. ప్రారంభంలో మనస్సు కొంచెము ఎదురుతిరిగినది. బాధపెట్టినది. కానీ శరీరము నాకు ఎప్పుడూ సహకరించినది. మనస్సు నిరాశచెంది తన ఓటమిని ఒప్పుకున్నది. ఆతరువాత అది నాకు పూర్తిగా మిత్రుడై సహకరించినది. స్వేచ్ఛగా బీదరికాన్ని వరించడంవల్ల అవసరాలను సాధ్యమైనంతగా తగ్గించుకొనుటవల్ల సేకరణ అనే భావనను పూర్తిగా వదిలివేయడంవలన పరద్రవ్యము మీద ఆకర్షణ తొలగిపోయినది. పొట్టనింపుకోవడానికి, శరీరమును కప్పుకొనుటకు, నా స్వవుపార్జనే సరిపోతే, పరద్రవ్యము అపహరించుకొనుటకు అవసర మేముంది? మిగిలినది, దొరికినది ఇతరులకు పంచుతూ వచ్చాను. పంచడము, ఇవ్వడము అను రుచి మరిగి ఆ అనుభూతిలో ఆనందం పొందగల్గినప్పుడు ఇక సేకరించి సంగ్రహించుట మెందుకు? ఏ ప్రయోజనముకొరకు పరద్రవ్యమును ఆశించే పాపము చెయ్యాలి? సాధారణ బీద అపరిగ్రహి బ్రాహ్మణ జీవితం నాలో ఒక అసాధారణ ఆనందము, సంతోషము, ఉల్లాసము నింపినది. ఈ అనుభూతి ఇతరులకుకూడ లభిస్తే ఎవ్వరి మనస్సుకి పరద్రవ్యమును ఆశించి పాపభారమును శిరస్సుమీద మోపే కోరికే కలుగదు. అపరిగ్రహమువల్ల లభించే అనుదానాల ప్రక్రియ అంతఃకరణములలో ఎంత అద్భుతమైన ప్రభావము చూపిస్తుందో యెవరి కెరుక? నాకుమాత్రము ఈ దివ్యవిభూతుల భాండాగారము అప్రయత్నంగానే దొరికినది."

స్త్రీని తల్లిగ చూడటం అనేది ఒక జాతికి చెందినది. మాతృవత్ పరదారేషు అనేది ఆధ్యాత్మిక భావపరంపర. ఒక్క స్త్రీనే తల్లిగా చూడటంగాదు, ప్రకృతినే తల్లిగా చూస్తాడు ఆధ్యాత్మికవాది.

www.missionrk.com
ప్రకృతిమాత అంటారు. ఆబ్రహ్మకీటజనని వర్ణాశ్రమ విధాయిని - ఆ స్థాయిలో చూడగల్గాలి.

పరద్రవ్యేషు లోష్టవత్ నాకు న్యాయం ప్రకారం, ధర్మం ప్రకారం లభించిందే తీసుకుంటానుతప్ప మిగతాది నేను ముట్టుకోను అనేది. గురుదేవులు ఈ రెండు సాధనలు పూర్తిచేసి మూడవచరణంలోకి ప్రవేశించారు.

అపరిగ్రహవ్రతమును ఆచరిస్తే పూర్వజన్మలు తెలుస్తాయి. దీనివల్ల లాభాలు యేమిటి?

నా స్నేహితులకు, నాకు ఒకసారి ఒక వివాహ ఆహ్వానపత్రిక అందింది. అయితే కొంతమందిమే వెళ్ళాము. కొంతమంది రాలేదు. ఆ రానివారు యేమి నాటుకున్నారో తెలుసా? వారి పిల్లలకు వివాహ మయ్యే సదవకాశమును కోల్పోయారు. నాటు-కోసుకో అనేది ఆధ్యాత్మికసూత్రము. నువ్వు పెళ్ళికి వెళ్ళలేదు. ఏ బీజమును నాటుకున్నావు? వెళ్ళావు. వివాహము అయ్యే బీజమును నాటుకున్నావు. కనుక జీవితంలో అపరిగ్రహ బీద బ్రాహ్మణ జీవితమును గురుదేవులు జీవించినా ఆయన నాటుకున్నది యేమిటి? ఆనందం, ఉల్లాసము, సంతోషము నాటుకున్నారు. అపరిగ్రహజీవితం వలన పూర్వజన్మపరంపరలు తెలిశాయి.

పూర్వజన్మలు తెలిస్తే పిల్లల పెళ్ళిళ్ళకు కాళ్ళరిగేటట్టు తిరిగే అవసరమే లేదు. ముందే సంబంధము విషయము తెలుస్తుందిగదా? అపరిగ్రహమునకు చాలా శక్తి వున్నది. మీ అమ్మాయికి పెళ్ళి యెవతితో అవుతుంది? మీ అబ్బాయికి వుద్యోగము ఎవరి ద్వారా వస్తుంది? ఇలాంటి విషయములన్నీ తెలుస్తాయి. ఇలాంటి శక్తులు చాలా వున్నాయి. ఆ శక్తులు రావడానికి మీరేమి సాధనలు చెయ్యనవసరము లేదు. అయితే కొన్ని మానసిక నియమాలు పాటించాలి. అంతే. ఎన్నాళ్ళపాటు చేయాలి? సంవత్సరాలపాటు.

అహింసను పాటించడంలో గాంధీజీ నిష్ణాతుడు. ఆయన దాన్ని అలా కొన్ని సంవత్సరాలనుండి పాటిస్తూనేవున్నాడు. ఒకసారి హిందుముస్లిముల తగాదాలు చెలరేగి ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఆయన వారి మధ్యకు వెళ్ళి నన్ను చంపరాదా! అని నుంచున్నాడు. అందుఱూ కత్తులు, కటార్లు క్రిందన పడవేసి మౌనంగా తలదించుకుని నుంచున్నారు. అహింసయొక్క సాధనా ఫలితము అది.

అలాగే గాంధీగారు సాత్వికాహారమును తీసికునేవారు. ఆయన కారాగారంలో వున్నాకూడ ఆయనకు వంట చేయడానికి ఒక మంచి వంటవాడిని కేటాయించేవారు. అయితే ఒకసారి కొన్ని కారణలవలన ఆయనకు వేఱే వంటవాడిని నియమించారు. ఆయన మామూలుగా భోజనం చేశారు. అయితే ఆరోజు రాత్రి ఆయనకు తన తల్లిని తాను చంపుతున్నట్లు కలవచ్చింది. మఱ్నాడు ఆయన తనకు వంటచేసి పెట్టిన వ్యక్తి ఆచూకి తీస్తే ఆ వంటచేసిన వ్యక్తి తన తల్లిని చంపి కారాగారమునకు వచ్చినవాడు. అతడు చేసిన వంట తినడంవల్ల గాంధీగారికి తన తల్లిని చంపినట్లు కలవచ్చింది. అహింసను పాటించే ఆయన మనస్సు యెంత వున్నతంగా తీర్చిదిద్దబడిందో గమనించండి.

మనము యిప్పుడా సాధన చేయాలంటే చాలా కష్టము. మఱిప్పుడేమి చేయాలి? భగవంతునికి నివేదన చేసి అప్పుడు ఆ ఆహారమును ప్రసాదంగా తీసుకోండి. చాలు. అప్పుడు యే ఆహారమును తీసుకున్నా అది ప్రసాదంగా వుంటుందితప్ప వండిన వ్యక్తి మనస్సు దానిమీద ప్రభావమును చూపించదు.

ఇక్కడ నిత్యజీవితంలో మనముచేసే చిన్నచిన్న తప్పులు కొన్ని గమనించుదాము. చాలామంది అన్నం వడ్డించాక వచ్చి కూర్చుంటారు. అది తప్పు. ఆహారం వడ్డించేముందే వచ్చి కూర్చోవాలి. కూర్చున్నాక వడ్డించాలి. అన్నం పరబ్రహ్మ స్వరూపమని గదా మన పెద్దలు చెప్పారు. మఱి పరబ్రహ్మ వస్తుంటే నువ్వు ఎదురెళ్ళి స్వాగతం

www.missionrk.com
పలుకుతావా? లేక వచ్చాక అప్పుడు పలకరిస్తావా? ముందే స్వాగతిస్తావు. భోజనమునుకూడ అలాగే తీసికోవాలి. ఆహారం వడ్డించేముందే వచ్చికూర్చోవాలి. పూర్వకాలంలో ఆహారమును యీ పద్ధతిలోనే తీసుకునేవారు. ఇలా చేయడంవలన ఆరోగ్యమూ చేకూరుతుంది. అన్నం వడ్డించాక ఎప్పుడో వస్తే ఈగలు, దోమలు వాలతాయి. ఆ ఆహారమును తీసికోవడంవలన అనారోగ్యము వస్తుంది. వడ్డనకు ముందే రావడం అన్నది అన్నమును గౌరవించడము. వడ్డించాక రావడం పరబ్రహ్మను అగౌరవపరచడము. నిత్యజీవితంలో ఇలాంటి నియమాలను పాటించకుండా ఆధ్యాత్మికతలో ముందుకు వెళ్ళలేము. ఆహారమును తీసుకునేటప్పుడు ఇంట్లో సభ్యులందఱూ కల్సికూర్చుని తీసుకోవాలి. ఇప్పుడు అలా చెయ్యడం లేదగనుకే హోటల్స్‌కి వెళ్ళినప్పుడు బలవంతంగా అలా చేయాల్సివస్తోంది. ఇక్కడో చిన్న విషయమును తెలుసుకుందాము. పలహారశాలల్లో ఆహారమును అందించే వ్యక్తులు తర్వాతి జన్మలలో వున్నత పదవులలో రాణించే వ్యక్తులుగా జన్మిస్తారు. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, ఉన్నతాధికారులుగా పుడతారు. ఇది భారతీయులు చెప్పిన కర్మసిద్ధాంతము. కొన్ని రాజభవనాలే పలహారశాలలుగా మారుతున్నాయి. రాజభవనాలలోని రాజులు రాజులుగా యెందుకు జన్మించారంటే ఇతఋలకు ఆహారమును సమర్పించడంవలన. అయితే ఈనాడు రాజులు ఆపద్ధతికి వదిలేశారు. అయితే రాజభవనాలు నిర్మించబడింది భోజనదానంవల్లనేగనుక అవి పలశారశాలలుగా మారుతున్నాయి.

**" సాధారణ బీద అపరిగ్రహి బ్రాహ్మణ జీవితము నాలో ఒక అసాధారణ ఆనందము, సంతోషము, ఉల్లాసము నింపింది. ఈ అనుభూతి ఇతఋలకుకూడ లభిస్తే ఎవ్వఱి మనస్సుకి పరద్రవ్యమును ఆశించి పాపభారమును శిరస్సున మోపే కోరికయే కలుగదు. అపరిగ్రహీ జీవితంవల్ల లభించే అనుదానాలవలన ప్రక్రియ అంతఃకరణలో ఎంత అద్భుతమైన ప్రభావమును చూపిస్తుందో యెవఱి కెరుక? నాకుమాత్రము యీ దివ్యవిభూతుల భాండాగారము అప్రయత్నంగానే దొరికింది. "**

1975 ఆ ప్రాంతంలో గురుదేవులు ప్రాణప్రత్యావర్తన శిబిరమును నిర్వహించారు. దానిలో చాలామంది పాలుపంచుకున్నారు. ఆ శిబిరంలో గురుదేవులు తమ ఆత్మశక్తిని సాధకులకు పంచారు. సాధనా సమయంలో గురుదేవులు సాధకులను పిలిచి 'మీరు ఈ జన్మలోను, పూర్వజన్మలలోను చేసిన తప్పులను ఒక కాగితం మీద వ్రాసి నాకు యివ్వండి' అన్నారు. సాధకులు అలానే చేశారు. 'ఇకనుండి మీ జీవితంలో ఇవి వుండవు' అని గురుదేవులు వారికి వాగ్దానము చేశారు. (మాస్టరుగారుకూడ ఆ శిబిరంలో పాలుపంచుకున్నారు.)

మనము చేసే వుద్యోగాలు దేశకాల పరిస్థితులనుబట్టి చేసుకుంటూ సంపాదించన ధనములో 10% గురువులకు అంశదానంగా యిస్తే యే పాపము అంటదు. అందుకని గురువులు అంశదానము చేయమని చెప్పేది. లంచము తీసుకుంటే యే గురువూ రక్షించడు. వారు చెప్పింది కేవలం అంశదానంగురించే తప్ప పాపాలకు లభించే శిక్షల నుండి రక్షిస్తామని కాదు. కాలం ఖర్మం కల్సిరాక లంచం తీసుకుంటూ పట్టుబడితే గురువు వచ్చి రక్షించడు. అయితే మనిషి మంచిగా వుండటానికి ప్రయతిస్తే పరిస్థితులు కచ్చితంగా మారుతాయి. 10% అంశదానము ఇవ్వడంతోనే నీ ఆవేదన గురువుకు అర్థమౌతోంది.

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే.....అన్నాడు జగద్గురువు. నీ ధర్మమును నువ్వు అనుసరిస్తే భగవంతుడు పెద్దపెద్ద భయాలనుండికూడ నిన్ను రక్షిస్తాడు. ఇదంతా పరద్రవ్యేషులోష్టవత్ గూర్చే. ఇతఋల ధనము ముట్టుకోకు. ముట్టుకుంటే అది ప్రమాదమునకు దారితీస్తుంది. తస్మాత్ జాగ్రత్త.

www.missionrk.com

**“ ఆతర్వాత అడుగులో ఆధ్యాతికతయొక్క మూడవమజిలీ వస్తుంది. అది ఆత్మవత్సర్వభూతేషు. అందఱిని తనలాగే భావించుకొనుట అనేది వినుటకు, చెప్పుటకు యీ శబ్దావళి అతి సాధారణం అనిపిస్తుంది. దీని అవధి నాగరిక కర్తవ్యముల పాలన, శిష్టాచారము, సద్వ్యవహారము వరకు వెళ్ళి ఆగిపోతుంది. కానీ దీని తత్త్వ్యజ్ఞానము అతి విస్తృతము. పరమాత్మసత్తాతో పూర్తిగా కలిసిమెలసి ఏకీకరణ చెందే స్థితి దీని పరిధి. ఈ సాధన కొరకు ఇతరుల అంతరంగంతో తన అంతరంగమును మేళవించి వారి సంవేదనలు తన సంవేదనలుగా అనుభూతి చెందాలి. వసుధైకకుటుంబకము యొక్క మాన్యత దీని మూర్తిభవించిన రూపమే. అందరూ నా కుటుంబీకులే, నాతోపాటు ఇతరులు మరియు ఇతరులతోపాటు నేను ఒకే సూత్రంలో గ్రుచ్చబడి ఒకరిలో ఒకరు పూర్తిగా కలసిపోయిన భావన, ఈ అనుభూతియొక్క ప్రతిక్రియ. ఇతరుల సుఖము తన సుఖంగాను, ఇతరుల దుఃఖము తన దుఃఖంగా అనుభవంలోకొస్తుంది. ఇటువంటి వ్యక్తి తన వరకే సీమితము కాలేడు. స్వార్థపరిధిలో కట్టబడివుండలేడు. ఇతరుల దుఃఖమును నివారించడానికి, వారికి సుఖములు చేకూర్చుటకు చేసే ప్రయత్నాలు తన వ్యక్తిగత ఆకాంక్షగా, ప్రయోజనంగా అనిపిస్తాయి. ”**

సోదరి నివేదిత స్వామీ వివేకానందునితో కాళిమాత యొక్క తాత్త్విక స్వరూపమును తెలుసు కొనుటకు ఒక ప్రశ్న అడిగింది. స్వామీజీ ఆ ప్రశ్న విని కొన్ని క్షణాలు ఆలోచనలలో నిమగ్నమయ్యారు. తరువాత నెమ్మదిగా ఇలా అన్నారు. ఇది తెలుసుకొనుట అంత తేలికకాదు. అయినా నీకు మాతృత్వం తెలుసుకొనుటకు నిజమైన కోరికుంటే ఈదేశపు స్త్రీలను మాతృ భావనతో సేవించు. నీకు తత్త్వబోధ జరుగుతుంది. నివేదిత అటులనే చేసెను. ఈసాధనలో ఒకరోజు ఆమెకు కాళీమాత స్వరూపం యొక్క తత్త్వానుభూతి అయినది. తనయొక్క సుప్రసిద్ధ కవిత “ కాళి ది మదర్”లో ఈ అనుభూతిని వివరించింది.

# నా జీవనసాధనయొక్క అంతరంగ విశేషాలు

(జనవరి, 1971 అఖండజ్యోతి నుండి గ్రహించబడినది)

" చాలామంది పరిజనులు నా సాధన, దాని ఫలితాలుగురించి విశదంగా తెలుసుకోవాలి అనుకుంటారు. ఇది స్వాభావికమే. నా భౌతిక స్థూలజీవితములో బహిర్గతమైన అంశాలు లోకుల దృష్టిలో అద్భుతమైనవి, వానిలో రకరకాల సిద్ధులు, చమత్కారాలు, అలౌకికమైన సంఘటనలను గమనించవచ్చు. వాటి వెనుక వున్న రహస్యాలను తెలుసుకోవాలి అనే వుత్సాహము స్వాభావికమే. అందువల్ల పరిజనులు నా ఆత్మకథ తెలుసుకోవాలి అని యీరోజులలో నన్ను బలవంతము చేయుట అకారణము గాదు.

నేను యెప్పుడు యేది దాచిపెట్టాలి అనుకోలేదు. మోసగించుట, కపటము నాకు అలవాటు లేదు. నా వివశత యేమిటంటే ప్రపంచనాటకరంగములో నా పాత్ర ప్రత్యక్షముగా, శారీరకముగా వున్నప్పుడు వాస్తవాన్ని తెలిపితే, దర్శకుల దృష్టి ఇంకొక దిశకి మళ్ళుతుంది. అందువల్ల ఆదర్శాల కొఱకు యే కర్తవ్యనిష్ఠను నేను అందఱిలోను జాగృతము చేయదలచుకున్నానో ఆ ప్రయోజనము సిద్ధించదు. వ్యక్తులు యీ రహస్యాల జంఝాటంలో యిరుక్కుంటారు. అందువల్ల నా వ్యక్తిత్వము కూడా వివాదాస్పదము అవుతుంది. అప్పుడు నేను యేమి చెయ్యాలో, ఇతరుల చేత యేమి చేయించడానికి నేను పంపబడ్డానో, దానికి చాలా అవరోధాలు యేర్పడతాయి. నిస్సందేహంగా నా జీవితము అలౌకికతలతో నిండివున్నది. నా జీవితములో రహస్యమయ తెరలు యెన్ని వున్నాయి అంటే సమయానికి ముందే వాటిని యెత్తితే చాలా అరిష్టాలు సంభవిస్తాయి. అందువల్ల నా తర్వాత వచ్చేవారికి నా జీవితాన్ని ప్రమాణికత అనే గీటుఱాయితో అన్నివిధాల, అన్ని కోణాలలో పరిక్షించి ఆధ్యాత్మికవిద్య యెంత సమర్థమైనదో, ఎంత సారగర్భితమైనదో నిరూపించే బాధ్యత అప్పగిస్తున్నాను. ఈ పరసువేది స్పర్శతో ఒక అతి సాధారణవ్యక్తి తన తుచ్ఛ కాయ కళేబరములను స్వర్ణము వలె బహుమూల్యముగా చేసుకొనుటలో యెలా సమర్థుడయ్యాడు? ఎలా సఫలత పొందాడు? అనేది తెలుసుకుంటారు. ఈ దృష్టితో నా జీవితములోని అనేక రహస్యమయ సంఘటనలను సమయము వచ్చినప్పుడు పరిశోధనలు చేయవచ్చు. అప్పుడు యీనాడు నాకు చాలా దగ్గఱగా వున్న పరిజనులు కొంత సహాయపడవచ్చు. దానికి యింకా సమయము వున్నది. అందువల్ల వాటిమీద తెరలు యింకా అలాగే వేసివుండాలి.

ఆత్మకథ వ్రాయమని అడిగేవారికి నా సాధనాక్రమము యెలా నడిచినదో మాత్రమే తెలుపగలను. వాస్తవానికి నా వుపలబ్ధులన్నీ ప్రభుసమర్పిత సాధనాత్మక జీవితవిధానము మీద ఆధారపడినవే. దీనిని తెలుసుకొనగలిగితే ఆధ్యాత్మిక జీవితము మీద ఆసక్తి కలిగిన ప్రతివొక్కరికి ఆత్మికప్రగతి, దానివల్ల లభ్యమయ్యే విభూతులు పొందే ఆనందమయ మార్గము సులభము అవుతుంది. నా కలము ద్వారా పాఠకులు యింతమాత్రమే పొందగలరు. దానితోనే సరిపెట్టుకోవాలి.

www.missionrk.com

నా 60 సంవత్సరాల జీవితములో మొదటి 15 సంవత్సరాలు అందఱివలె సాధారణముగా గడిచినవి. తర్వాత 45 సంవత్సరాలు ఆధ్యాత్మిక ప్రసంగాలను నా జీవితములో కలుపుకుంటూ గడిపాను. ఈ ప్రయోగాలలో పూజ-ఉపాసనల పాత్ర చాలా తక్కువ. రోజుకి 6 గంటలు చొప్పున 24 సంవత్సరాల గాయత్రీ ఉపాసన కంటే దానితోపాటు జోడించబడిన మానసిక పరిష్కారము, భావనాత్మక ఉత్కృష్టత అభివర్ధన ప్రయత్నాలకు ప్రాముఖ్యత యివ్వాలి. విచారణ మఱియు కార్యపద్ధతిని పరిష్కృతము చేసుకొనివుండకపోతే నా ఉపాసనా కర్మకాండ కూడా అనేకుల మంత్ర-యంత్రములతో కూడిన పూజా - ఉపాసనాకర్మకాండ వలె నిరర్థకము అయివుండేది. నా జీవనసాధన, మీరు సఫలము అనుకుంటే, దానిలోని అలౌకికతకు కారణాలు వెతుక్కుంటే దానికి ప్రధాన కారణము అంతరంగ, బహిరంగ స్థితుల పరిష్కారమే అని తెలుసుకోవాలి. పూజ-ఉపాసన గౌణము. ఆత్మకథయొక్క ఒక అంశము వ్రాస్తే, దుస్సాహసము చేస్తూ నేను ఒక తథ్యమును ప్రతిపాదిస్తున్నాను.

నా పూర్తి మనోయోగమును మఱియు పురుషార్థమును ఆత్మశోధనకే వెచ్చించాను. నా ఉపాసనను కూడా భావపరిష్కార ప్రయత్నాలతో పూర్తిగా జోడించాను. ఇక పాఠకులకు తెలియడానికి నా సాధనా విధానాలు చెప్తాను.

ఆధ్యాత్మిక జీవితానికి మూడు మెట్లు వున్నాయి.

1. మాతృవత్ పరదారేషు, 2. పరద్రవ్యేషు లోష్టవత్, 3. ఆత్మవత్ సర్వభూతేషు.

మానవ జీవితక్రమములో కూడా కాన్షస్‌నెస్, సబ్‌కాన్షస్, సూపర్‌కాన్షస్‌నెస్ వున్నాయి.

ఈ మూడింటిని అధిరోహిస్తూ సుదూర లక్ష్యాలను పొందాను.

1. మాతృవత్ పరదారేషు, 2. పరద్రవ్యేషు లోష్టవత్, ఈ మజిలీలు వ్యక్తగతమైన సాధనలు. ఇవి నాలో నేనే యుద్ధము చేసుకొనుట, నా ఇంటిని నేనే చక్కబరచుకొనే ప్రయత్నాలు. పూర్వజన్మ సంస్కారాలను సమర్థగురుని సహాయముతో సులభంగానే సాధించగలిగాను. నన్ను కుమార్గము వైపు లాక్కెళ్ళే ధైర్యము చేయటానికి నా మనస్సు అంత మొండిది కాదు, చెడ్డది కాదు. అప్పుడప్పుడు కొంచెము మార్గమునుంచి తప్పుకోవడానికి ఊహ వచ్చినా, ఒక గట్టి దెబ్బ వేస్తే దారికి వచ్చేది. మనస్సును యిలా నియంత్రణ చేసుకొనుట వల్ల పాపము, పతనము నుంచి కూడా తప్పించుకోగలిగాను. ఇక యిప్పుడు అన్నిరకాల ప్రమాదాల నుంచి తప్పించుకున్నాను గనుక, హయిగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాను. కబీరుదాసు అతి పల్చగా పారదర్శకమైన దుప్పటి అల్లాడు, ప్రయత్నపూర్వకముగా దానిని కప్పుకున్నాడు. దానికి యేవిధమైన మరకలు, మచ్చలు అంటకుండా తిరిగి యిచ్చివేశాడు. నన్ను ఆ మార్గములోనే నడిపించిన పరమాత్మకు అనేక ధన్యవాదాలు. ఆ పదచిహ్నములను వెతుక్కుంటూ, ఆ ఆధారాలను గట్టిగా పట్టుకొని ఇక మార్గచ్యుతు డయ్యే ప్రమాదము లేని స్థితికి చేరుకున్నాను. "

మనిషికి శరీరాలు కూడా మూడు వున్నాయి. 1. భౌతికశరీరము, 2. ప్రాణమయశరీరము, 3. మనోమయ శరీరము. 1. భౌతికశరీరము - గురుదేవులు యిక్కడ భౌతికశరీరమును యెలా వుపయోగించుకోవాలి? అనేది చెప్తునారు. ఈనాడు మన మందఱమూ భౌతికశరీరాలకు బానిసలము. కష్టపడము. కష్టంగా వుందంటే యింక ఆ పనిజోలికి వెళ్ళము. కానీ గురుదేవులు యేమి చెబుతున్నారు? భౌతికశరీరాలను లొంగదీయండీ, దానిని చావగొట్టండీ అని చెప్తునారు. మీ ఇష్టమొచ్చినవిధముగా మీ శరీరము మాట వినాలి. అది ప్రయత్నపూర్వక సాధన వలన వస్తుంది. 2. కోర్కెలు. మీకు కోర్కెలు అంటూ యేమైనా వున్నయా అని ఆలోచన మీకు యెప్పుడైనా వచ్చిందా? మీరు యెంత గొప్పవారో! మీకు కోర్కెలు లేవయ్యా బాబు అని గురుదేవులు తరువాత చెప్తారు. ఒక చిన్న అడ్డంకి

వస్తే ఆ కోర్కెను వదిలేసుకుని నాకు కోర్కెలే లేవు అని అనగలవా? అంటే అది కోరికా? లేక భావనా? అసలు మనకు కోర్కెలు లేవు. జరిగితే సరే. లేకపోతే పోనీలే నా ఖర్మలో అలా వున్నది అని రాజీపడతారు. అసలు మీకు కోరికే వుంటే అది తీరేవఱకు మంకుపట్టుపట్టాలి. ప్రపంచములో కొన్నిరకాల వ్యక్తిత్వమున్నవారికే కోర్కెలున్నాయి. రాజకీయనాయకులు, వ్యాపారులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, రచయితలు.

**రాజకీయనాయకులు** : వీరి కున్న తీవ్రమైన కోర్కె భావనాత్మక ఉత్కృష్టతగా మారితే అది రామరాజ్య స్థాపనకు నాంది అవుతుంది.

**వ్యాపారులు** : ధనవంతులు తమ ధనమును సక్రమముగా వినియోగిస్తే? అనేక అద్భుతాలను సాధించవచ్చు. అయితే 'ఈనాడు ధనము అసురుల చేతిలో చిక్కుకునిపోయింది' అని గురుదేవులు చాలా స్పష్టంగా ఒకచోట వ్రాస్తారు. ఆ అసురుల చేతిలోనుండి ధనమును బయటకు తీయాలి. గురుదేవులు ఆ పనిని చేసితీరుతారు.

**శాస్త్రవేత్తలు** : ఐన్‌స్టీన్ తరువాత అసలైన శాస్త్రవేత్తలు యెవఱూ లేరు. ప్రకృతిలో ఒక కష్టతరమైన రహస్యాన్ని యెంతటి కష్టమునైనా ఛేదించి లక్ష్యాన్ని చేరుకోవాలనే మానసిక ఆసక్తి యే శాస్త్రవేత్తలోనైనా కనిపిస్తోందా?

**కళాకారులు** : వీరు మనలో లేనిపోని ఆవేశాలను పెంపొందించే పరిస్థితులను నెలకొల్పుతున్నారు.

**రచయితలు** : వీరు సమాజమునకు వుపయోగపడే సాహిత్యమును ఏమేఱకు వ్రాస్తున్నారు అన్నది ప్రశ్న. ఈ ఐదుగురు సక్రమమైనమార్గములో వుండి కృషి సలిపితే ప్రపంచము మారుతుంది.

**" కబీరుదాసు అతి పల్చగా పారదర్శకమైన దుప్పటి అల్లాడు, ప్రయత్నపూర్వకముగా దానిని కప్పుకున్నాడు. దానికి యేవిధమైన మరకలు, మచ్చలు అంటకుండా తిరిగి యిచ్చివేశాడు. నన్ను ఆ మార్గములోనే నడిపించిన పరమాత్మకు అనేక ధన్యవాదాలు. ఆ పదచిహ్నములను వెతుక్కుంటూ, ఆ ఆధారాలను గట్టిగా పట్టుకొని ఇక మార్గచ్యుతుడయ్యే ప్రమాదము లేని స్థితికి చేరుకున్నాను."**

కబీరుదాస్ యీ మూడు శరీరాలకు అంటే భౌతిక శరీరానికి, కామయ, మనోమయ శరీరాలకు యేవిధమైన మచ్చలు, మరకలు పడకుండా తిరిగి ఇచ్చేసేడో అలా ఆ మార్గములోనే నడిచాను అని శ్రీరామశర్మఆచార్య గురుదేవులు యిక్కడ చెబుతున్నారు.

**" ఆధ్యాత్మికత యొక్క కర్మకాండలు అంత కష్టమైనవి కావు. దృఢమైన సంకల్పబలముండి శ్రద్ధ-నిష్ఠ తగ్గకపోతే మానసిక ఉద్విగ్నత వుండదు. ఉపాసన విధివిధానము కూడా దారి తప్పకుండా సాఫీగా నడచిపోతుంది. ఒక సాధారణ వ్యాపారి, ఒకే దుకాణంలో, ఒకేవిధంగా తన పూర్తి జీవితాన్ని ఆనందంగా గడుపుతాడు. అతని మనస్సుకి అది విసుగనిపించదు. అయిష్టం అనిపించదు. కిళ్ళీ, సిగిరెట్లు అమ్మేవారు రోజుకు 12-14 గంటలు తమ వ్యాపారాన్ని వుత్సాహంతో శాంతిపూర్వకంగా చేసుకొంటారు. అటువంటప్పుడు 24 సంవత్సరములు రోజుకు 6-7 గంటలు గాయత్రీ సాధన చేసే సంకల్పమును నేను యెందుకు నెరవేర్చలేను? ఉపాసన, - కిళ్లీ, బీడీలు అమ్మటము, మిఠాయిలు అమ్మటము, వ్యవసాయము చేయుట కంటే తక్కువ లాభదాయకము, అనవసరము అనుకునేవారికే ఉపాసనలో మనస్సు లగ్నంకాదు. అనవసర మనిపించే అరుచికరమైన పనులలో మనస్సు నిలవదు కదా? "**

గురుదేవులు చెప్పిన యీ విషయాలు మానవజాతి భవితవ్యతను నిర్ణయిస్తాయి. ఈ విషయాలను అవగాహన చేసుకుని ఆచరించే మనుష్యులకొఱకు యీ పుస్తకము వుపయోగపడుతుంది. అటువంటివారు నిరంతరము యీ పుస్తకంలోని విషయాలు మధించాలి. ఆచరణలో పెట్టే ధైర్యము చూపించేవారికి తగిన శక్తి ఆధ్యాత్మికత యిస్తుంది.

www.missionrk.com

**“ఎవరి ఆంతరిక ఆకాంక్ష, భౌతిక సుఖసాధనాలే అంతా అనుకుంటుందో వారికి ఉపాసనలో విసుగు, అరుచి అనే అడ్డంకులు వస్తాయి.”**

ఇలాంటివారికి ఉపాసన చేయాలంటే ‘ఇప్పడేమి చేస్తాములే’ అనే భావము కలుగుతుంది. ఎందుచేత నంటే వారికి భౌతికసౌఖ్యాలే ముఖ్యము కనుక. కాని అవి శాశ్వతము కాదు అన్న విషయము మీకు తెలుసు. కావలసినది మానసికశాంతి అని తెలుసు. కానీ ఆంతరిక ఆకాంక్ష లొంగదు.

**“ ఎవరైతే పూజా - ఉపాసనల ద్వారా కోరికలు తీర్చుకోవాలి అనుకుంటారో, వారే ప్రారబ్ధ, పురుషార్థ న్యూనత వల్ల కోరుకున్న వరదానాలు లభించకపోతే, నిరాశ నిస్పృహలకు లోనవుతారు. ”**

మనిషి కోరుకున్న కోరికలు తీరతాయి అనేది యీ వాక్యాలు చదివితే అర్థమౌతుంది. కాని అవి తీరటానికి రెండు షరతులు పెట్టారు గురుదేవులు. 1. ప్రారబ్ధము అంటే అది లభించడానికి తగిన పరిస్థితి మఱియు మానసికస్థితి వుండాలి. 2. పురుషార్థము అనగా ప్రయత్నము. ఈ రెండిటి సమన్వయము యోగవిద్య చెబుతుంది. మనము ఆ సమన్వయమును మర్చిపోయాము. సమన్వయము చేయగలిగే గురువులను మర్చిపోయాము. మనకు నచ్చింది చేస్తాముతప్ప గురువు చెప్పినట్లు చేయడంలేదు.

రోగనివారణకి వైద్యు డేమి చెప్తే అది చెయ్యాలి. ఇక్కడా అంతే. ఆధ్యాత్మికజగత్తులో అన్నిరకాల రోగాలను నయము చేసే గురువులను మనము పూర్తిగా విస్మరించాము. మీకు మామూలు జలుబు వస్తే యేదోవొక మందు వేసుకుంటారు. అదే జ్వరమొచ్చి అది నాలుగురోజులైనా తగ్గకపోతే వైద్యుని దగ్గరికి వెళ్ళాల్సిందే. మఱి ఆధ్యాత్మిక జగత్తులో మీరు యే గురువు నడిగి సాధనలు చేస్తున్నారు? మీ ప్రారబ్ధము, పురుషార్థము లేమిటో మీకు తెలియవు. నువ్వు యే దిశలో సాధనలు చేయాలి? ఎక్కడినుండి చేయాలి? అనే విషయాలు మీకు యెవఱు చెప్తారు? గురువు చెప్పాలి. అలా చెప్పేటటువంటి గురువులు వున్నారు. మీరు వారిని విశ్వసిస్తే వారు మీకు వ్యక్తిగతముగా సాధనలు యిస్తారు. అలా అనేకమందికి వారు దారి చూపించారు. మీయొక్క ప్రారబ్ధమే మిమ్మల్ని గురువుల దగ్గరికి చేరుస్తుంది. ఆ గురువు దగ్గఱ పురుషార్థం వల్ల విజయము కలుగుతుంది. అందువల్ల మీ గురు వెవఱో తెలియకుండా సంతోషీమాతను, సత్యసాయిని, శిరిడిసాయిని యెందుకు పట్టుకుంటారు? సాధనాజగత్తులో మొట్టమొదట గురువుయొక్క అనివార్యతను గుర్తించండి. అయితే భౌతికజగత్తులోని మార్గదర్శకుడు లేదా గాయత్రీజపము మిమ్మల్ని మీ గురువు దగ్గరికి చేరుస్తుంది. మీ ప్రారబ్ధకర్మను బట్టి మీకు యే గురువు సరిపోతారో ఆ గురువు దగ్గఱకు ఆవిడే మిమ్మల్ని చేరుస్తుంది.

అయితే గురువునుకాక వారి జ్ఞానాన్ని పట్టుకోండి. గురువుయొక్క కాళ్ళను కాదు ఆయన ఆచరణలు పట్టుకోండి. మీరు వారినుండి జీవితవిధానమును అనగా జీవించేకళను నేర్చుకుంటే మీ జీవిత యోగక్షేమములను గురువు వహిస్తాడు.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥ (గీ॥ అ॥9 శ్లో॥22)

***భావము : ఎవఱు అనన్యప్రేమికులయిన నా భక్తులై పరమేశ్వరుడ నగు నన్ను నిరంతరము స్మరించుచూ నిష్కామభావముతో భజించుచుందరో, నిరంతరము చింతించుచుందురో అట్టివారల యోగక్షేమముల నేను స్వయముగ ప్రాప్తింపజేయుదును.***

www.missionrk.com

మీకు గురువుపట్ల ఆ అనన్యచింతన యేది? దేవునికి ఆరతి జరుగుతుంటే చిన్నపిల్లల చూపులు ప్రసాదం మీదే వుంటాయి. మన మనస్సు గుడి బయట మనము వదిలేసిన చెప్పుల మీద వుంటుంది. గురువులు తాము యిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటారు. మనమే ఒక స్నేహితుడికి సహాయము చేస్తా మని ఒప్పుకుని ఆ మాట నిలబెట్టుకోవటానికి యెంత కష్టపడతాము? అలాంటిది మిమ్మల్ని పరమగురువులు వదిలేస్తారా? మీకు గురువు మీద విశ్వాసము లేక మీరే ఆయనను వదిలేస్తే ఆయనేమి చేయగలడు! ఒక రాజకుమారునికి అడుక్కుతినవలసిన పనిలేదు. మనిషి భగవంతుని రాకుమారుడు. అలాంటి మనిషి అడుక్కుతింటున్నాడు అంటే అతను రాజకుమారుడు కాదు అని అర్థము కదా? అది మనిషియొక్క ప్రారబ్ధము.

మహారాజు హర్షవర్ధనుడు తన కుమార్తె జాతకమును వ్రాయమని జ్యోతిష్య వరాహమిహిరుని కోరాడు. ఆయన జాతకము చూసి 'మహారాజా! మీ కుమార్తె అడుక్కు తింటుంది' అన్నాడు. రాజకుమారి అడుక్కోవడ మేమిటి? అని రాజుకి కోపమొచ్చింది. వరాహమిహిరుడిని కారాగారంలో బంధించాడు. కుమార్తెను ఒక ఒంటిస్థంభము మేడలో వుంచి పెంచుతున్నాడు. 7 సంవత్సరాల తర్వాత అతనిని బయటకి రప్పించాడు. 'నా కూతురు అడుక్కు తింటుంది అని నువ్వు అన్నావు, కానీ ఆమె హాయిగా జీవిస్తున్నది' అని అన్నాడు రాజు. 'నా జాతకము తప్పదు' అన్నాడు వరాహమిహిరుడు. పద చూద్దాము అన్నాడు రాజు. ఇద్దరూ బాలిక వున్నచోటుకు వెళ్ళారు. వీరు అక్కడికి వెళ్ళేసరికి ఆ బాలిక ఒక ఆటబొమ్మను యెదురుగా పెట్టుకుని, దానిముందు అన్నిరకాల పలహారపుపాత్రలను వుంచి, ఆ బొమ్మతో 'నాకు కొంచెము ఆహారము పెట్టవూ?' అని అడుక్కుంటోంది.

మనిషి పరిస్థితి కూడా అలాగే వున్నది. ఇంతమంది పరమగురువుల మార్గదర్శనము వుండి కూడ మనిషి అష్టసిద్ధులు, నవనిధులను పొందలేకపోతున్నాడు. పొందే సమయము వచ్చింది అని గురుదేవులు చెబుతున్నారు. అయితే ఆలోచనలు మార్చుకోవాలి. అడుక్కోవల్సిన అవసరము లేదు మనిషికి. అతనికి భగవంతుని నుండి వారసత్వంగా సమస్త సంపదలు పొందే సంభావన వున్నది. అయితే గురువును ఆశ్రయించాలి. ఆశ్రయిస్తే ఆయన నీ యోగక్షేమములను వహిస్తాడు. మనము భగవంతుడిని, గురువుని వదిలేసి అడుక్కుతింటున్నాము. గురువులు మనలను జన్మజన్మలకు వదలరు. మనము వదులుతాము.

**"ఎవరి ఆంతరిక ఆకాంక్ష, భౌతిక సుఖసాధనాలే అంతా అనుకుంటుందో వారికి ఉపాసనలో విసుగు, అరుచి అనే అడ్డంకులు వస్తాయి. ఎవరైతే పూజా- ఉపాసనల ద్వారా కోరికలు తీర్చుకోవాలి అనుకుంటారో, వారే ప్రారబ్ధ పురుషార్థ న్యూనతవల్ల (తగ్గుదల) కోరుకున్న వరదానాలు లభించకపోతే, నిరాశ నిస్పృహలకు లోనవుతారు. మొదలు పెట్టినపుడే ఆకాంక్షలకు ప్రతికూలమైన పనిలో ఉత్సాహము వుండదు. ఎక్కువమంది యీ స్థితిలోనే వుంటారు కనుక వారి మనస్సు నిలకడగా వుండుటలేదు అని ఫిర్యాదు చేస్తారు. కాని నా స్థితి వీరికంటే భిన్నమైనది. శరీరము సాధనకు ఒక పనిముట్టు అనుకున్నాను. వస్తువులను జీవించటానికి అవసరమైన ఇంధనములుగా మాత్రమే వుపయోగించాను. గొప్పవాడిని అవ్వాలని, పేరు తెచ్చుకోవాలి అనే మహత్వకాంక్ష నాకు యెప్పుడు రాలేదు. నేను ఆత్మను అని నిరంతరము గర్తుంచుకొనుటవల్ల ఆత్మోత్కర్షకు, ఆత్మకళ్యాణము కొరకు, ఆత్మశాంతికొరకు, ఆత్మవిస్తారము కొరకు యెందుకు ప్రయత్నించకూడదు అని అనిపించేది. ఎప్పుడైతే శరీరమును, నన్ను వేఱు-వేఱుగా చూసుకోగలిగానో శరీరము యొక్క స్వార్థమును, నా స్వార్థమును వేఱుగా చూడగలిగానో అజ్ఞానము యొక్క ఒక పెద్ద అడ్డుగోడ కూలిపోయింది. చీకటిలో వెలుతురు ఆవిర్భవించింది. "**

www.missionrk.com

చాలామంది యిది సంభవమా? అని అనుకుంటారు. ఆత్మకు అన్ని సంభవాలే. శరీరమునకు సంభవము కాదు. మీరు మీ శరీరములను, ఆత్మను వేఋచేసుకోలేకపోతున్నారు. ఆత్మవలె జీవించాలి. ఆత్మకు అన్నీ సంభవమే. శరీరమునకు సంభవము కాదు. ఈ ద్వంద్వమును దాటాలి. అందుకుగాను గురుదేవులు 'ప్రతిరోజు క్రొత్తజన్మ, ప్రతిరాత్రి క్రొత్త మృత్యువు' అనే సాధన అందించారు. ఆ సాధనను చేసుకోవాలి. మీరు ప్రతిరోజు నిద్రలేవగానే 'నేను ఆత్మను, ఆత్మవలె జీవిస్తాను' అని అనుకోవాలి. ఈ భావాన్ని మీ లోపలికి దింపుకోగలిగితే మీ జీవితాలలో చాలా చమత్కారాలు జరుగుతాయి. అలాగే గురుదేవులు మొదట వ్రాసిన పుస్తకము 'నేనెవరిని?' ఆ పుస్తకమును చదివి, గురుదేవులు చెప్పిన విషయమును ఆచరణలో పెట్టుకోవాలి.

**" ఎవరైతే తాను శరీరము అని అనుకుంటారో, ఇంద్రియాల తృప్తియే ఆనందదాయక మనుకుంటారో, వాసనా-తృష్ణ యొక్క పూర్తి యెవరి జీవనోద్దేశ్యమో, వారికి డబ్బు, హోదా, ప్రశంసా మొదలగునవే సర్వస్వము. వారు ఆత్మకళ్యాణంగురించి విస్మరించవచ్చు, లోభ-మోహాలనే బంగారుసంకెళ్ళు ఆనందంగా వేసుకొనవచ్చు. వారికి శ్రేయోమార్గం ఆచరించే వీలు లభించలేదు అనే వంక సత్యము కావచ్చు.**

**అంతఃకరణయొక్క ఆకాంక్షలే పరిస్థితులను నిర్మిస్తాయి. భౌతిక సుఖ-సంపదలే లక్ష్యమైనప్పుడు చేతనయొక్క అన్ని ప్రయత్నాలు దానికొరకే వుపయోగపడతాయి. "**

ఈ వాక్యములుగనుక అర్థమైతే ఆధ్యాత్మికతయొక్క లోతులు మీకు అర్థమైనట్లే. మీ జీవితములో అనేక చమత్కారములు జరుగుతాయి. మీకు సాధనాజగత్తులో అష్టసిద్ధులు, నవనిధులు ప్రాప్తిస్తాయి. మీరే స్వయంగా అనేక చమత్కారములను చేయగలుగుతారు.

ఒకసారి శ్రీరామకృష్ణపరమహంసని దర్శించిన వివేకానందుడు మీరు దేముడిని చూశారా? అని ప్రశ్న వేశాడు. రామకృష్ణులు చూశాను అని జవాబు ఇచ్చారు. అయితే నాకు చూపించండి అని వివేకానందుడు అన్నాడు. శ్రీరామకృష్ణపరమహంస వివేకానందుని గంగానదికి తీసువెళ్ళి గంగలో మునిగాక వివేకానందుని గొంతుమీద చేయిపెట్టి బలవంతముగా నీటిలో ముంచాడు. కాసేపయ్యాక రామకృష్ణులవారు వివేకానందుని మెడ మీద చేయి తీసివేసి 'ఎలా వున్నది?' అని అడిగారు! గాలి కావాలనిపించిది అని అన్నాడు వివేకానంద. 'నీవు గాలి అందక చాలా కష్టపడ్డావుకదా? అయిన నన్ను నీవు సహాయం అడిగావా? అడగలేదు. గాలికోసం తపించావు. భగవంతునిమీదకూడ అంత తపన వుంటే ఆయన దర్శనము నీకు లభిస్తుంది' అని అన్నారు గురుశ్రీరామకృష్ణ.

ఆకాంక్ష అంటే అది. మఱి మీరు భగవంతుని కోసము అలా కొట్టుకుని తపనపడ్డారా? అసలు భగవద్దర్శనము కోసము ప్రయత్నించారా? ప్రయత్నమే లేదు. అందుకు మీకు భగవంతుడు కనిపించడు.

**" అంత:కరణ యొక్క ఆ కాంక్షలే పరిస్థితులను నిర్మిస్తాయి. "**

ఈ వాక్యమును మీరు పదేపదే మననము చేసుకోవాలి. అంత:కరణము అంటే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. ఈ నాలుగిటిని అంతఃకరణములు అంటాము. ఈనాడు మనిషికి చిత్తము అంటే తెలియదు. బుద్ధి అంటే కొంచెము తెలుస్తుందేమో. ఈనాడు మనిషికి మనస్సును వుపయోగించుకోవటము కన్నా మనస్సును అనవసరమైన విషయాలతొ నింపటము తెలుసు. అంటే మనిషి మనస్సు ఒక గ్రంథాలయము లాంటిది. అయితే బుద్ధి అందులోనుంచి యేది అవసరమో అది వేఋచేసి తీసుకుంటుంది. అది నిర్ణయాత్మక బుద్ధి. చిత్తము ఆ విషయమును సబ్‌కాన్షస్‌లోకి పంపుతుంది. అహంకారము ఆ విషయమును సూపర్‌కాన్షస్‌కి పంపుతుంది.

www.missionrk.com

" అంతఃకరణయొక్క ఆకాంక్షలే పరిస్థితులను నిర్మిస్తాయి. భౌతిక సుఖ-సంపదలే లక్ష్య మైనప్పుడు చేతనయొక్క అన్ని ప్రయత్నాలు దానికొరకే వుపయోగపడతాయి. ఉపాసన ఒకచిన్న ఆటగా మారుతుంది. చేసినా పఱ్వాలేదు, చేయకపోయినా పఱ్వాలేదు. ఎక్కువమందికి ఉపాసన ఒక కుతూహలమే. చిన్న పిల్లల ఆటవలె చేసుకుని యే పుట్టలో యే పాముందో అనే భావనే తప్ప, సంకల్పబలము వుండదు. కొంచెముసేపుకూడా మనస్సును పెట్టకుండా చమత్కారాలను ఆశిస్తూ అడ్డదిడ్డంగా చేసే పూజ-ఉపాసన ఫలించకపోతే విశ్వాసము కోల్పోయి మానివేస్తేరు. ఈ పరిణామము సహజమే కదా! నిజమేమిటంటే శ్రద్ధ-విశ్వాసము లేకపోవుట మఱియు జ్ఞానోద్దేశ్యప్రాప్తికొరకు తీవ్రమైన ఆకాంక్ష లేకపోవుట వల్ల ప్రగతి పొందలేకపోతున్నాము.

ఈ వివరాలన్నీ నాకు పూర్తిగా అర్థమయ్యాయి. కనుక నాశరీరాన్ని పోషించుకొనుటకు మరియు కుటుంబవ్యవస్థను నడుపుకోవటానికి కావలసినంత శ్రమమాత్రమే భౌతిక జీవితంలో నేను తీసుకున్నాను. శరీరాన్ని వుపయోగించుకోవటానికి అతి ముఖ్యమైన, ఎంత తక్కువ సంభవమో అంత తక్కువ ప్రయత్నాలు శరీర యంత్రానికి బాడుగ యిచ్చే దృష్టికోణంతోనే భౌతిక కార్యక్రమాలు చేసుకున్నాను. ధన సంపాదన లక్ష్యంకూడ అంతవఱకు వుంచుకున్నాను. నా అంతరఃకరణ నిరంతరము లక్ష్యప్రాప్తికొఱకు ప్రయత్నిస్తూ వుండడంవల్ల భౌతిక ప్రలోభాలు మరియు ఆకర్షణలో ఇరుక్కునే పరిస్థితి, అవసరము నాకు యెప్పుడూ రాలేదు.

ఎప్పుడైతే నా స్వరూపమును ఆత్మస్థితిగా గుర్తించానో అప్పటినుంచి అంతఃకరణ పరమేశ్వరుని పరమ పవిత్ర నివాసగృహముగా దృగ్గోచరమగుట మొదలుపెట్టింది."

దీన్నే ఋషులు - దేహో దేవాలయ ప్రోక్త-ః స్థితి అన్నారు. మీరు దేవాలయాలకు యెందుకు వెళుతున్నారు? శరీరమును దేవాలయముగా గుర్తించటానికి. అయితే యీనాటి మనిషి యీ విషయమును మర్చిపోయి కోరికలు తీర్చుకునేందుకుమాత్రము గుడికి వెళుతున్నాడు. పిల్లలు పాఠశాలకు యెందుకు వెళుతున్నారు? విద్య నేర్చుకోవటానికి. మీరు దేవాలయమునకు వెళితే ఆత్మవిద్య నేర్చుకోవాలి అనే విషయము మీ బుద్ధిలో వుండాలి. దేవాలయమునకు వెడితే దేవత బాహ్యంగా కాదు, మీ మస్తిష్కములో వుండాలి. మీరు దేవతగా మారాలి. గురుదేవులకు యీ విషయము అర్థమైనది.

" ఎప్పుడైతే నా స్వరూపమును ఆత్మస్థితిగా గుర్తించానో అప్పటినుంచి అంతఃకరణ పరమేశ్వరుని పరమ పవిత్ర నివాసగృహముగా దృగ్గోచరమగుట మొదలుపెట్టింది.చిత్తము అంతర్ముఖమగుట మొదలెట్టింది. నాయొక్క మొత్తము ఆలోచనా విధానము పరమాత్మ యొక్క రాజకుమారుడైన ఆత్మ ఏమి చెయ్యాలి? ఏ దిశలో వెళ్ళాలి? అనే ఆలోచనలకు మాత్రమే పరిమితమైనది. ప్రశ్నలు సులభమైనవి, జవాబులు కూడా సులభమైనవి.'

" కేవలము ఉత్కృష్ట జీవితమే జీవించాలి. కేవలము ఆదర్శవంతమైన కార్యపద్ధతులే అవలంబించాలి. ఈ మార్గముమీద నడవలేనివారికి చాలా భయాలు అనిపించి యేమి ప్రమాదాలు వస్తాయో, బీదరికము యెలాంటి పరిస్థితులను చూపిస్తుందో, కుటుంబసభ్యులనుండి యెటువంటి విమర్శలు యెదుర్కొనవలసి వస్తుందో అనే భయాలు పీడిస్తాయి. నేనుకూడా అనేకమంది ఎగతాళిని మఱియు చేతకానివాడ్ని అనే కఠినోక్తులను సహించవలసి వచ్చింది. కుటుంబసభ్యులే నాకు యెక్కువగా అడ్డుపడ్డారు. వారికి నానుండి లభించేటటువంటి అనేక భౌతిక లాభాలు లభించవు, వాటిని పోగొట్టుకుంటున్నాము అనే భావనతో నా ఆలోచనలు, కార్యపద్ధతిని మూర్ఖమైనవిగా అన్నారు. కానీ యిది

www.missionrk.com
యెక్కువసేపు నన్ను బాధించలేదు. మన నమ్మకము, విశ్వాసము, శ్రద్ధ సుదృఢముగా వుంటే విరోధము యెంతసేపు వుంటుంది? చెడుమార్గము మీద నడిచేటప్పుడు మాత్రమే విరోధ తిరస్కారాలు స్థిరంగా వుంటాయి. మంచితనము వ్యక్తిని మాత్రమేకాక యితరులను కూడా రక్షించే విభూతి, శక్తి. దీనికి అడ్డుతగిలేవాళ్ళు, నిందించేవాళ్ళు త్వరలోనే తమ తప్పును తెలుసుకొని అడ్డుతగలడానికి బదులు సహకరించటము మొదలెడతారు. మనయొక్క ఆస్థా, శ్రద్ధ, విశ్వాసము ఎంత గొప్పగా, స్థిరముగా వుంటాయో, ఎంత దృఢముగా వుంటాయో ప్రతికూలత అంత తొందరగా అనుకూలతగా మారుతుంది. కుటుంబము నుంచి వచ్చే విరోధము యెక్కువసేపు నేను భరించవలసి రాలేదు. వారి సందేహాలు వస్తుస్థితి అర్థముకాగానే దూరమైపోయాయి. ఆధ్యాత్మిక జీవితంలో నిజానికి యెప్పుడూ హాని వుండదు. అప్పుడప్పుడు బాహ్యదృష్టిలో బీదరిక మున్నట్లు అనిపించినా యిటువంటి వ్యక్తులు ఆత్మికశాంతి మఱియు సంతోషమువల్ల చాలా ప్రసన్నంగా వుంటారు. ఈ ప్రసన్నత మఱియు సంతుష్టి ప్రతివొక్కరినీ ప్రభావితము చేసి విరోధులను కూడా సహకరించే వ్యక్తులుగా మారుస్తుంది. నా కష్టాలన్నీ ఇలాగే నివారించబడ్డాయి. "

గురుచరిత్ర చదివితే యిందులో చెప్పిన విషయాలు అక్షరసత్యాలని మీరు గ్రహిస్తారు. ఈ దారిలో వెళితే ప్రకృతినుంచి కాని లేక సమాజమునుండి కానీ మీకు అడ్డంకులు రావు.

" గొప్పదనము, పేరుతెచ్చుకోవాలనే ఆకాంక్ష, లోభ, మోహ, తృష్ణల యొక్క సంకెళ్ళు యెప్పుడైతే నివారించుకో గలిగానో అన్నిరకాల బంధనాలనుండి ముక్తి లభించింది. లోభ, మోహ, తృష్ణలనే యీ మూడు సంకెళ్ళు వ్యక్తులను భవసాగరంలో బోర్లపడవేసి ముళ్ళకంచెలమీదకి లాగుతుంటాయి. అంతేకాక అసంతృప్తి, వుద్విగ్నతల యొక్క వ్యథావేదనలతో మూల్గుతూవుంటాడు. ఈ మూడింటిని తుచ్ఛమైనవిగా అర్థము చేసుకోగలిగితేనే లిప్సను, కోరికలను శ్రద్ధగా మార్చుకోగలిగితే, మాయయొక్క బంధనాలు తొలగిపోయి జీవన్ముక్తస్థితి పొందగలము. "

'నజరే తేరీ బదలీకి నజారా బదల్‌గయా' అనే వుక్తి ప్రకారము నా వ్యక్తిగత భావనలు ఆత్మజ్ఞానము పొందగానే పరిసమాప్తమై జీవన లక్ష్యము పొందాలి అనే ఆకాంక్ష నా వ్రేలుపట్టుకుని మార్గదర్శనము చేయడము మొదలెట్టింది. ఇంక లేమి లేదు, దుఃఖము లేదు. శరీరానికి జీవించటానికి యెంత అవసరమో అంతే సమకూర్చి సీమిత సాధనలతోనే తృప్తిచెందే శిక్షణ యిచ్చి, లోభ-లిప్సలను వేఱుచేసేశాను. మనస్సు యిటుఅటు చలించకుండా వుంటే యెంత అనంతమైన శక్తి లభిస్తుందో, ఎంత ప్రసన్నంగా వుంటుందో యీ తథ్యాలను ఎవరైన అనుభవించి తెలుసుకోగలరు. కానీ యేమి చేయగలము? మనుష్యు లందరూ నూనెతో నిప్పును ఆర్పటానికి ప్రయత్నిస్తున్నారు. తృష్ణను -ధనముతోను; వాసనలను, కోరికలను- భోగముతోను తృప్తి చెందించడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి ప్రయత్నాలు దావానలాలను మాత్రమే సృష్టిస్తాయని, ఈ మార్గంమీద పయనించేవారు ఎండమావుల భ్రమలో దారి తప్పుతారని, స్మశానాలలో ప్రేతపిశాచాల వలె ఉద్విగ్నమానసికస్థితిలో వుండి కుకర్మలే చేయగలరని వీరికి అర్థమయ్యేటట్లు యెవరు చెప్పగలరు? చెప్పేవాళ్ళు వినేవాళ్ళు యిద్దఱూ దొందుకు దొందే.

సత్సంగము ప్రవచనాలు నేను చాలా విన్నాను. కానీ ఆధ్యాత్మికతను అంతరంగంలోకి దింపి అనుసరించమని ప్రేరణ నిచ్చే జ్ఞానులు నాకు దొరకలేదు. ప్రవచనాలిచ్చేవారి జీవనవిధానాన్ని జాగ్రత్తగా గమనిస్తే వినేవారికంటే వారి జీవితాలలోనే యెక్కువ మాలిన్యమును చూశాను. వారినుండి మనస్సు యెదురుతిరిగింది. పెద్దపెద్ద సత్సంగాలు, సమ్మేళనాలు జరుగుతూవున్నాకానీ నాకు వాటిని చూడటానికి, వినటానికి మనస్సు ఒప్పేదికాదు.

www.missionrk.com

ప్రకాశము నాకు లభించింది. కాని అది నాకు నా అంతరంగము నుండే లభించింది. బయట నుంచి కాదు. నా ఆత్మయే సాహసించి తన చుట్టూవున్న వలను ఛేదించే ధైర్యము నిచ్చింది. అప్పుడే ఫలితాలు పొందగలిగాను. ఇతరుల మీద ఆధారపడి జ్ఞాని అనిపించుకున్నవారు బహుశా నన్నుగూడ అజ్ఞానిని చేసివుండేవారు. ”

ఎవరికైనా ప్రకాశము (జ్ఞానజ్యోతి) లభిస్తే అది యెప్పుడూ లోలోపల నుంచే లభిస్తుంది అన్నది నాకు అర్థమయింది. కనీసము నావరకు ఇది తథ్యము అని నిరూపణ అయినది. ఆధ్యాత్మిక ప్రగతిలో పెద్దపెద్ద కొండల వంటి బాహ్య అవరోధాలు, లక్ష్యము మీద నిరంతర శ్రద్ధ వుండకుండా, శ్రేయోమార్గములో నడిచే సాహసము చేయకుండా తొలగించుకోలేము. ఈ నిర్ణయముమీద నేను దృఢంగా వున్నప్పుడు సహాయకులు నాకు యెప్పుడూ లభిస్తూనే వున్నారు. గురుదేవులనుండి భగవంతుడి వరకు అందరూ నా లక్ష్యమును సరళము చేయుటకు నిరంతరము లభిస్తూనే వున్నారు. ప్రగతిమార్గములో నెమ్మదినెమ్మదిగ సుదృఢమైన అడుగులు ముందుకు వేస్తూనే వున్నాను. ఈనాడు వున్న నా స్థితికి యీ విధివిధానము అవలంభించటం వల్లనే చేరుకున్నాను. ”

“ సాధారణంగా చాలామంది ఆధ్యాత్మిక జీవనము చాలా కష్టసాధ్యము అంటారు. కాని నా వ్యక్తిగత అనుభవము దీనికంటే సర్వదాభిన్నము. నిజానికి వాసనా తృష్ణలతో నిండి వున్న జీవితము చాలా కఠినమైనది, జటిలమైనది. ఈ స్థాయిలో జీవించే వ్యక్తి ఎంత శ్రమపడతాడో, ఎంత బాధపడతాడో, ఎంత వ్యథా వేదనలు సహిస్తాడో, ఎంత గందరగోళపడతాడో వాటిని చూస్తూ వుంటే ఆధ్యాత్మిక జీవితములోని కష్టాలు నగణ్యమనే చెప్పవచ్చు. ఇంత శ్రమ, ఇంత బాధ, ఇంత ఉద్వేగము పడినా ఒక్కక్షణము కూడా సంతోషము వుండదు. కోరికలను తీర్చుకొనుటకు చెప్పలేనంత ప్రయాస, కాని ఆ కోరిక పూర్తికాకముందే వంద క్రొత్త అభిలాషల సమూహము యేర్పడుట, ఇవంతా యెంత గందరగోళము అంటే, అతి పెద్ద సఫలత పొందినా వ్యక్తికి తృప్తి లేదు, సంతోషము లేదు. ఒక చిన్న సఫలత పొందటానికి ఎంత అలసిపోయే శ్రమ చేయవలసిందో తెలిసినా దాని కంటే పెద్ద సఫలత పొందటానికి నాలుగురెట్లు, పదిరెట్లు బాధ్యత పైన వేసుకుంటారు. గతి తీవ్రమవుతున్న కొద్దీ సమస్యలు యెక్కువవుతాయి. ఝంజాటము యెక్కువ అవుతుంది. వాటిని సవరించుకోవటానికి దేహము, మనస్సు, ఆత్మ యొక్క మొత్తము శక్తి ఖర్చయిపోతుంది. సామాన్య శారీరక మరియు మానసిక శక్తి, సురుసలాంటి అభిలాషలను పూర్తిచేయటానికి సమర్థత లేకపోవటంవల్ల అనీతి అనాచార మార్గాలను యెన్నుకోవలసి వస్తుంది. జఘన్యపాపకర్మలు చేసినా అభిలాషలు, కోరికలు ఎప్పటికి తీరుతాయి? పొందిన ఉపలబ్ధులను, దానికిపడ్డ నిరంతర మానసిక ఉద్వేగము మఱియు వాటివల్ల భవిష్యత్తులో రాబోయే ఘోరఫలితాలు ఈ రెండిటిని కలిపిచూస్తే వాటిని అతి తుచ్ఛముగానే భావించ వలసివస్తుంది. సాధారణవ్యక్తులు నిరంతరము బాధపడుతూ, ఏడుస్తూ, రోషము, శోకముల బారినపడుతూ, జీవచ్ఛవముల వలె జీవితాన్ని గడుపుతున్నారు. నిజానికి వీరినే నిజమైన తపస్వులుగా గుర్తించాలి. అంత కష్టము, త్యాగము, ఉద్వేగము, ఆత్మికప్రగతిమార్గములో భరించగలిగితే ప్రతివ్యక్తి యోగి, సిద్ధపురుషుడు, మహామానవుడు, దేవతే కాక భగవంతుడు కూడా అయిపోగలిగేవాడు. సాధారణమానవులు పాపము యేమీ పొందలేరు. చాలా కోల్పోతారు. నిజానికి వీరే నిజమైన త్యాగులు, తపస్వులు, బలిదానము చేసేవారు. ఎందువల్ల నంటే వీరు అత్యధిక పరిశ్రమతో పాపములు మూటకట్టుకొనే దుస్సాహసము చేయుటయేకాక సంపాదించింది బంధువర్గానికిచ్చి స్వయముగా ఉత్తిచేతులతో వెళ్ళిపోతారు. అందువల్ల నాకు యితరుల సుఖము కోసం స్వయముగా యింత కష్టపడేవారే మహాత్ములు, జ్ఞానులు, పరమార్థీపురుషులు అనే అనిపిస్తుంది. వీరు తమని తాము మోహగ్రస్తుల మని, పాపాత్ముల మని, పదభ్రష్టుల మని అనుకున్నా వీరు నాదృష్టిలో గొప్పవారే. ”

www.missionrk.com

" నాచుట్టూ వున్న అసంఖ్య మానవదేహధారుల యొక్క అంతరంగ బహిరంగ జీవితమును చూస్తే వీరందరికంటే యెక్కువ సుఖమయమైన, ఆనందదాయకమైన జీవితము నేను జీవించానని చెప్పగలను. నాకు జరిగిన హాని యేమిటంటే కొస్త తక్కువ సంపన్నమైన, తక్కువ వెసలుబాటున్న జీవితాన్ని జీవించాను. వస్తుసామగ్రి నా దగ్గర తక్కువ వుండటం వల్ల బీదవాడి లాగ కన్పించాను. సంపద లేకపోవటం వల్ల ప్రపంచము నన్ను చిన్నవాడ్ని అనుకుంది. పట్టించుకోలేదు. ఇంతకంటే యెక్కువ హాని ఆధ్యాత్మికపథములో యెవరికీ జరుగదు. దీనివల్ల నాకు యేమి హాని జరుగలేదు. నా యే పని ఆగలేదు. ఇతరులు షడ్రసోపేతమైన వ్యంజనాలు తిన్నా నేను బార్లీ, శనగలు మాత్రమే తిని సర్దుకున్నాను. వారు నాలికపైన నియంత్రణ లేక రోగాలపాలైతే నేను తిన్న యీ చౌక ఆహారము బాగా అరిగేది. శరీరము రోగరహితముగానే వుండేది. నేను పోగొట్టుకున్న దేమిటి? నాలిక యొక్క క్షణికమైన రుచిని పోగొట్టుకుని నేను తీవ్ర ఆకలి కలిగి **కినాడ్ పాపడ్** తలుపు కూడా అప్పడం అవుతుందిఅనే యుక్తి సార్థకముగా అనుభవించాను. ఇంక రుచి గురించి అడుగుతే విలాసవంతులైన వారి ఆహారము కంటే నాయొక్క బార్లీతో తయారుచేసిన రొట్టె యెక్కువ రుచిగలది అనిపిస్తుంది. ధనము సంపాదించి మంచిబట్టలు, మంచి ఇల్లు మొదలగునవి చేకూర్చుకుని తమ అహంకారములను యితరులు పెంపొందించుకుంటే నేను స్వల్ప సాధనసామగ్రితో వారిలాంటి విలాసపూరిత వాతావరణాన్ని పొందలేకపోయినా సాధారణ జీవితము వల్ల పొందిన ఆత్మసంతోషము, ఆనందము ముందు వారి విలాసమయ జీవితము యెందుకు పనికిరాదు. బాలబుద్ధిగలవారు నన్ను వెక్కిరించినా అవగాహన కలవారు నా సాధారణజీవితము యొక్క తెరవెనకాతల వున్న గొప్పతనాన్ని గుర్తించి దాని ముందు వారి శిరస్సులు వంచారు. మఱి వారు లాభంలో వున్నారా? నేనా? వస్తుస్థితిని జాగ్రత్తగా గమనిస్తే తక్కువ పరిశ్రమ, తక్కువ యిక్కట్లు, తక్కువ బాధ్యతలు తీసుకుని నేను శారీరకంగా, మానసికంగా, ఎక్కువ సుఖముగ వుండుటే కాక సన్మానముకూడా యెక్కువ పొందాను. పిచ్చివాళ్ళు, పిచ్చివాళ్ళను ప్రశంసిస్తే నాకేమి అభ్యంతరము లేదు. వ్యక్తిగతంగా నాకే బాధలేదు. ఆత్మనుంచి పరమాత్మ వరకు, సజ్జనులు, దూరదృష్టి కలవారు అందరూ నా జీవనప్రక్రియాపద్ధతిని ప్రశంసించారు. కష్టాలు తక్కువ, లాభము చాలా యెక్కువ. కోరికలతో అతి యెక్కువ ఖర్చులతో కృత్రిమమైనటువంటి చాలా బరువు అనిపించే జీవితము పాపము - పతనము అనే చక్రములు గల బండిద్వారానే మోయగలము. నాది అంతా తేలికైనదే. పక్కబట్టలు చంకలో పెట్టుకోవటము. బయలుదేరడము. ఏ అలసటా లేదు.

ఏ వ్యధా లేదు. ఆదర్శవంతమైన జీవితమే అతి సరళమైనదని నా వ్యక్తిగత అనుభవము. దానిలో ప్రకాశము, సంతోషము, ఉల్లాసము అన్నీ వున్నాయి. దుష్టులు ఆక్రమణ చేసి యేదైనా హాని కలగచేస్తే యీ యిక్కట్లు పాపభూయిష్టమైన ఘృణిత జీవతవిధానములో కూడా వుంటాయికదా? సంతులు, సేవ చేసేవాళ్ళు యెన్ని కష్టాలు సహించవలసివస్తుందో అంతకంటే చాల యెక్కువ కష్టాలు ప్రతిస్పర్థ, ఈర్ష్యా, ద్వేషము మరియు ప్రతీకారము మొదలగు కారణాల వల్ల భౌతికజీవితములో పడవలసివస్తుంది. హత్యలు, ఆక్రమణలు, దొంగతనాలు, దోపిడీలు, మోసములు మొదలగువాటికి భౌతిక జీవితము మీద తీపివున్న వాళ్ళే గురికావటము చూస్తాము. ఇంతమంది వ్యక్తులు, స్వేచ్ఛగా తమ ప్రాణాలను, ధనాన్ని సమాజానికి యివ్వగలిగితే, వాళ్ళని దేవతలుగా కొలవటమేగాక చరిత్రలో వారి పేర్లు సువర్ణాక్షరాలలో లిఖించబడివుండేవి. క్రీస్తు, సోక్రటీస్, గాంధీ లాంటి వ్యక్తులు అతి తక్కువ సంఖ్యలలోనే యీవిధంగా చనిపోయారు. వీరికంటే వేయిరెట్లమంది పతనోన్ముఖక్షేత్రములో హత్యలకు గురౌతువుంటారు. తన సర్వస్వము దానమిచ్చి, బీదరికము వహించిన భామాషాలాంటి వాళ్ళను వ్రేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. కానీ మోసములు, నమ్మకద్రోహములు, వ్యసనములు, వ్యభిచారము, ఆక్రమణలు, జ్వరములు, రోగాలు, మూర్ఖత్వముల వల్ల

అనేకమంది ధనవంతులు, బీదవారుగా మారడము ప్రతీరోజు చూస్తూనే వున్నాము, వింటున్నాము. ఆధ్యాత్మికక్షేత్రములో నష్టపోవుట, ఇతరుల ఆక్రమణలు తక్కువ. భౌతికక్షేత్రములో ఇవి చాల యెక్కువ. ఈ సత్యమును సరిగా అర్థము చేసుకొనగలిగివుంటే, వ్యక్తులు ఆదర్శవంతమైన జీవితము జీవించడానికి భయపడరు. మరియు భౌతిక లిప్సలో ఇరుక్కుని బోర్లాపడే మూర్ఖత్వము చేయరు. తృష్ణ-వాసన ప్రలోభముల ద్వారా వ్యక్తి పొందేది తక్కువ, పోగొట్టుకునేది చాలా యెక్కువ అనేది నా వ్యక్తిగత అనుభవము. నేను పోగొట్టుకున్నది నగణ్యము, అతి స్వల్పము, కానీ యెంత యెక్కువ పొందానంటే, నాకు మళ్ళీమళ్ళీ ప్రతి వ్యక్తికి ఉత్కృష్టమైన, ఆదర్శవంతమైన పరంపరను పాటించమని చెప్పాలని అనిపిస్తుంది. కాని విషయము కొంచెము కష్టము. నేను నా అనుభవాల సాక్షిగా ఉజ్జ్వలమైన జీవితము జీవించండి అని గోలచేస్తూ వుండగానే సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ యెంతమంది దానిని విన్నారు? విన్నవాళ్ళలో యెంతమంది దాన్ని పాటించారు.?

శ్రేయస్కరమైన దానిని అర్థము చేసుకొని, జీవితముయొక్క స్వరూపము, ప్రయోజనము, దాని ఉపయోగము, అర్థము చేసుకొని ఆ మార్గంలో నడిచే ధైర్యసాహసాలు చేసివుండకపోతే, మాతృవత్ పరదారేషు, పరద్రవ్యేషు లోష్ఠవత్, అనే రెండు మెట్లు యెక్కడము నాకు కష్టమై వుండేది. ఎవరైతే శరీరమునే అంతా అనుకుని అదే తన నిజస్వరూపము అనుకొని, మరియు తృష్ణ-వాసన కొరకే ఆతురత చూపించేవారు, ఆత్మికప్రగతి నుండి వంచితులవుతారు. పూజ-ఉపాసన లాంటి, చిన్నచిన్న కర్మకాండల ఆధారముగా ఎవరి పడవ ఒడ్డుకు చేరలేదు. నేను 24 సంవత్సరాలపాటు నిరంతరము గాయత్రి పురశ్చరణలలో నిమగ్నమై, ఉపాసనయొక్క ఒక మహత్వపూర్ణమైన అధ్యాయము పూర్తి చేయవలసివచ్చింది. కానీ ఆత్మికప్రగతి యొక్క భావనాత్మక ప్రక్రియ, జీవనసాధనతోపాటు కలిపినప్పుడే, ఈ ఉపాసన కర్మకాండ యొక్క సాఫల్యము లభించింది. ''

ఉపాసన ఒక్కటే సరిపోదు దానితోపాటు జీవనదేవతా సాధన కలపాలి. గురువు లందరూ ఈనాడు జీవనదేవతా సాధన అనే పదమును యెక్కువ వుపయోగిస్తున్నారు. శ్రీరామశర్మఆచార్య గురుదేవులు ఆ పదముతోపాటు 'సైన్స్ ఆఫ్ లివింగ్' అనే పదమును కూడా కలుపుతున్నారు. ఏ శక్తివల్ల నైతే, మనము జీవిస్తున్నామో, ఊపిరి పీలుస్తున్నామో దానిని ఉపాసన చేయాలి. నీలో వున్న దేవతను యెలా పట్టుకోవాలి? అనే ఆ సాధన చేయాలి.

" ఇతరుల వలె దేవతలను వశము చేసికొని లేక ఇతరులను మోసగిస్తూ కోరికలను పొందడానికి యంత్ర-మంత్రముల కర్మకాండమాత్రమే చేసివుంటే, జీవనదేవతాసాధనయొక్క ప్రాముఖ్యత అర్థము చేసికొని వుండివుండకపోతే, నిస్సందేహముగా నాకుకూడా యేమి లభించేది కాదు. నాకు లెక్కలేనంత భజనానంది మరియు తంత్రమంత్రము గురించి పూర్తి అవగాహనతో, జీవనదేవతా సాధన చేయకుండా కర్మకాండలలోనే సంవత్సరాల తరబడి నిమగ్నమైయున్నవాళ్ళు అనేకులు తెలుసు. వారి పూజా-ఉపాసనా విధానము నాకంటే చాలా విస్తృతమైనది. కాని పరిశీలనగా చూస్తే వారు యేమి పొందలేకపోయారు అనేది స్పష్టమైనది. వారిలో తమని తాము మోసము చేసుకొనే ఆత్మవంచన చూశాను. దీని ఆధారంగా వారు యీ జన్మలో కాకపోతే చనిపోయిన తరువాత, స్వర్గములో సుఖాలు లభిస్తాయి అనే భ్రమలో వున్నారు. కానీ నా వుద్దేశ్యము, నా భవిష్యద్వాణి యేమిటంటే, వీరిలో యే ఒక్కరికి స్వర్గము మొదలైనవి లభించవు. ఏవిధమైన సిద్ధులు చమత్కారాలు లభించవు. సాధకుడి జీవనక్రమము ఉత్కృష్టత వైపు ఒక క్రమబద్ధ ప్రణాళికను అనుసరిస్తూ ముందుకు వెళుతూవుండాలి. అతని దృష్టికోణములో మంచితనము వైపు మార్పురావాలి. అతను చేసే పనులలో, క్రియాకలాపాలలో ఒక ఆధ్యాత్మవాదికి అనుకూలమైన రీతినీతులు కలిగివున్నప్పుడే అతని కర్మకాండ కాని, మరియు పారాయణలు కాని ఫలితా న్నిస్తాయి. ధూర్తులు, స్వార్థపరులు, పిసినారులు మరియు శరీరము, పిల్లలకొరకు మాత్రమే జీవించేవాళ్ళు తమ ఆలోచనలను, కార్యపద్ధతులను పరిష్కరించుకోకపోతే వారికి తీర్థయాత్రలు, వ్రతములు, ఉపవాసములు, కథాకీర్తనలు, స్నానదానాలు మొదలగు వాటి వల్ల యేమి లాభము వుండదు అని స్పష్టముగా

www.missionrk.com
**చెప్తున్నాను. ఈ కర్మకాండలన్నీ వుపయోగకరమైనవే, కానీ వీటి వుపయోగము ఒక వ్యాసము వ్రాయటానికి వుపయోగపడే కలము వంటివి మాత్రమే. కలము లేకుండా యెలా వ్రాయగలము? పూజా, ఉపాసన లేకుండా ఆత్మికప్రగతి మాత్రము యెలా సంభవము? ఇంత తెలుసుకున్న తరువాత మనకి యింకొక విషయము స్పష్టముగా తెలియాలి. అధ్యయనము, స్వాధ్యాయము, చింతన, మననలు చేయకుండా కేవలము బౌద్ధికవికాస ప్రక్రియ సంపన్నము చేయకుండా, కేవలము కాగితము, కలము ఆధారంగా వ్యాసములు, కవితలు వ్రాయలేము. ఆంతరిక ఉత్కృష్టత కూడా బౌద్ధిక వికాసము లాంటిదే. పూజ-ఉపాసన కర్మకాండలు మంచి కలము లాంటివి. ఈ రెండిటి సమన్వయము వల్లనే పని జరుగుతుంది. ఏది లేకపోయినా అసంపూర్ణతగానే ఉంటుంది. సాధనయొక్క బండి ఒక చక్రముతోనే నడవదు. ఉపాసన మరియు అంతరికఉత్కృషత అనే రెండు చక్రాలు - నా జీవనసాధన - అనే బండికి వుండేటట్లు చూసుకొన్నాను. నేను ఉపాసన యెలా చేశాను? అందులో రహస్య మేమి లేదు. గాయత్రీ మహావిజ్ఞానంలో వివరించినట్టే నేను గాయత్రీమంత్రము యొక్క అతి సామాన్యమైన ఉపాసన చేసుకొన్నాను. "**

ఈనాడు గురువులు ఆధ్యాత్మికతను ఒక విజ్ఞానంవలె ప్రపంచమునకు అందించడానికి ప్రయత్నిస్తున్నారు. నేడు విజ్ఞానము యెందుకు అభివృద్ధి చెందింది అంటే యెవరైనా యేదైనా విషయమును కనిబెడితే అది వెనువెంటనే ప్రపంచమునకు అందిపోతుంది. అంటే ఆ విషయమును నేర్చుకోవాలనే ఆసక్తి గల వ్యక్తులకు అందడానికి కావల్సిన అనేక విధివిధానాలున్నాయి. వెబ్‌సైట్స్, సి.డి.లు, పుస్తకాలు. అంటే ఒక విషయమును ఆ విషయంలో అభిరుచి వున్నవారికి అందజేయటానికి ఈనాడు అన్నిరకాలైన వసతులున్నాయి. ఈనాడు వార్తాసౌకర్యాలు, రవాణాసౌకర్యాలు మొదలగువానివలన ఒక వ్యక్తికి యే విషయంలోనైనా ఆసక్తి వుంటే చాలు ఆ విషయమును వెనువెంటనే గ్రహించుకునేందుకు, ఆ జ్ఞానమును సముపార్జించుకునేందుకు కావల్సిన విధివిధానలు అందరికి అందుబాటులో వున్నాయి. కనుక గురువులు ఆధ్యాత్మికతను ఒక విజ్ఞానంవలె ప్రపంచానికి అందించడానికి ప్రయత్నిస్తున్నారు.

సాధారణంగా ఆధ్యాత్మికజగత్తులో మనకు వినిపించే మాట యేమిటంటే నీకు భగవంతునిమీద విశ్వాసం, శ్రద్ధ లేవుగనుక ఫలితాలు రాలేదు అని. విజ్ఞానంలో శ్రద్ధా, విశ్వాసము వుండవల్సిన అవసరము లేదు. కేవలము విధివిధానము తెలిస్తే చాలు. ఫలితము లొస్తాయి. మీలో అలాంటి శాస్త్రీయ అభిరుచిని కలుగజేయడానికి నేను చేసిన ప్రయత్నము అనేకమంది గురువుల చరిత్రలను, వారి కార్యప్రణాళికలను, ఆలోచనావిధానమును మీకు అందించడము. గురువు లందరూ యీ ప్రయోగమును చేస్తున్నారు. ముఖ్యంగా శ్రీరామశర్మఆచార్య గురుదేవులు యీ ప్రణాళికకు యెలా వుపయోగపడ్డారు? అన్న విషయమును అవగాహన చేసుకోవాల్సిన అవసర మున్నది. చేసుకునేముందు ఆధ్యాత్మికత అంటే సర్వగురువుల చేతనత్వవిజ్ఞాన కలయిక అనే విషయమును గ్రహించాలి. అందఱి గురువుల ప్రణాళికను, సాహిత్యమును అర్థము చేసుకోవాల్సిందే. అందఱి గురువులు గొప్పవాళ్ళే. ముఖ్యంగా యీ యుగములో నిష్కళంక ప్రజ్ఞావతారులైన శ్రీరామశర్మఆచార్య. న్యూటన్ నేను గొప్పవాడినే. కానీ పొట్టివాడిని. అయితే నేను యింత ఎత్తుకు యెలా ఎదిగానంటే రాక్షసుల భుజస్కంధాలమీద కూర్చున్నానుగనుక అంటాడు. అంటే న్యూటన్ ఇదివరకు శాస్త్రవేత్తలు ప్రపంచమునకు అందించిన జ్ఞానము అనే పీఠం మీద కూర్చున్నాడుగనుక ఆ జ్ఞానమును వుపయోగించుకుని గొప్పవాడయ్యాడు. అంతేకాదు ఆ జ్ఞానమును ఇంకొక అడుగు ముందుకు తీసికెళ్ళాడు.

ఆధ్యాత్మికజగత్తులో శ్రీరామశర్మఆచార్య అనే ఒక మహత్తరమైన వ్యక్తిత్వ మున్నది. భౌతికవిద్యలో పట్టా లేకపోయినా చేసిన పని మాత్రం అదే. గురువులందరి జీవితవిధానములుకూడ ఆధ్యాత్మికతలో ఒక భాగంగా వుండాలి. ఒక గురువువల్ల నువ్వు పైకి ఎదగలేవు. ఫిజిక్స్ ఒక్కటే చదివినా ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణుడవవ్వలేవు. కానీ ఫిజిక్స్‌లో యెంతమంది శాస్త్రవేత్తలు చెప్పిన సూత్రములను చదివిస్తామో; అలాగే రసాయనశాస్త్రంలో యెంతమంది శాస్త్రవేత్తలు చెప్పిన సూత్రములను చదివిస్తామో. అలాగే యిక్కడా చదవాలి. ఆధ్యాత్మికజగత్తులో గురువు లందరూ యేమి చేయమని చెప్పారో మనకు తెలియాలి. ఆత్మవిద్య రావాలంటే అనేక పుస్తకాలు చదువుకోవాల్సిందే. ఆధ్యాత్మికత అనేది సర్వగురు చేతనత్వముల ఫలితము.

గురుదేవులు 1971లో వ్రాసిన కొన్ని వ్యాసాలను గమనిస్తే..... ఆధ్యాత్మికజగత్తులో మొదటి అడుగు వేసిన వ్యక్తి పరమగురువులతో సంబంధమును పెట్టుకుని తన నిత్యజీవితమును ఎలా గడుపుకోవాలో చెబుతాయి ఆ వ్యాసములు.

ఆధ్యాత్మికజగత్తులో మొదటి అడుగువేసిన వ్యక్తి హిమాలయములలో వుండే పరమగురువులతో సంబంధము పెట్టుకుని నిత్యజీవితంలో మీ పనులను మానకుండా, వారియొక్క పనిముట్టుగా యెలా పనిచేయగలను? అనేది ఆలోచించాలి. మీరు ఆధ్యాత్మికతలో ఇంత నిష్ణాతులయ్యారు అని యెవ్వరికి తెలియాల్సిన పనిలేదు. మీరు చెప్పుకుంటారో, మానుకుంటారో మీ యిష్టము. గురుదేవులు వద్దని అనలేదు. కానీ గురుదేవులు చాలా స్పష్టంగా చెప్పింది యేమిటంటే 'ఆధ్యాత్మికశక్తున్నీకూడ నీ కైవశమౌతాయి. ఈ ఆధ్యాత్మికశక్తులన్నింటినికూడ నువ్వు ఉపయోగించుకోవచ్చు.' గురువులు యెలా వుపయోగించుకున్నారో నువ్వూ అలా వుపయోగించుకో. అన్ని పనులకూ మీరు వుపయోగించుకోవచ్చు. కానీ మీ ముఖ్య లక్ష్యము యేమిటంటే ఆ శక్తులని వుపయోగించుకుంటూ హిమాలయములలో వున్న ఆ గురువుల లేక గురుసత్తా పనికి వుపయోగించుట.

హిమాలయములలో యీనాటికి ఆ విశ్వామిత్రుడు, ఆ వశిష్ఠుడు, జమదగ్ని మొదలగువారు సశరీరంగా వున్నారు. ఉండటేమేగాదు, ఏడుస్తున్నారు. కళ్ళెంబట నీరు కారుస్తున్నారు. పిల్లవాడు చెడిపోతే, పిల్లవాడు తప్పుమార్గంలోకి వెళితే తల్లిదండ్రులు యెలా ఏడుస్తున్నారో, వారు అలా ఏడుస్తున్నారు. గురుదేవులు స్వయంగా తమ ఆత్మకథలో ఆ విషయమును వ్రాసుకున్నారు. ఇది మీ హృదయమును యేమైనా స్పృశిస్తే ఏడుస్తున్న ఆ ఋషుల గురించి ఆలోచిస్తారు. భారతీయులమైన మనము, ఆధ్యాత్మికవిద్యకు కేంద్రమైన మనము, ఆధ్యాత్మిక విద్యను ప్రపంచమునకు అందజేయవల్సిన మనము, ఆధ్యాత్మికతయొక్క ఓనమాలు మర్చిపోయాము. ఆధ్యాత్మికత అంటే యేమిటి? నేను సుఖంగా వున్నానా? లేదా? నా కష్టాలుపోయాయా? లేదా? ఇంతే. ఇంతకంటే ఆధ్యాత్మికత గూర్చి యేమి తెలియడంలేదు. గురువు లున్నప్పుడు ఆ సంస్థలలో వుండేదేమో! గురువులు వెళ్ళిపోయిన తర్వాత యే సంస్థలోను గురుత్వముగాని, ఆధ్యాత్మికతగాని, ఆధ్యాత్మిక జీవితవిధానంగాని పరిపూర్ణంగా లోపించింది. ఈ నిజాలను మనము స్పష్టంగా అవగాహన చేసుకోకపోతే కష్టము. వినడానికి, చెప్పడానికికూడ బాగోలేదు. ఏ సంస్థాకూడ యే ఆధ్యాత్మికతకొరకు ఆ సంస్థ స్థాపించబడిందో దాన్నిగూర్చి ఒక్కరూ మాట్లాడటంలేదు.

శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు ఋషు లందరి కార్యక్రమాలకు నేను నూతన ప్రాణము పోస్తున్నాను అని అన్నారు. అంటే గురువు లందరి జీవితవిధానములను ఒక చోటుకు చేర్చి ప్రాణము పోసి దాన్ని నర్సరీ

www.missionrk.com
అన్నారు. కానీ యేమి జరగాలి? ఆ నర్సరీలోనుండి ఆ చెట్లను బయటకు తీసికొచ్చి ఆ చెట్టుని మీలో నాటుకోవాలి. బయటెక్కడా కాదు. మీలో నాటుకోవాలి. మీ శరీరంలో నాటుకోవాలి. మీ అంతఃకరణలో నాటుకోవాలి. దానికి మనము పునాదులు వేశాము. ఆ పునాదులలో మనము యింతవరకు చదువుకున్నది యేమిటంటే 'ఆధ్యాత్మికత అంతరంగాన్ని మారుస్తుంది. మారిన అంతరంగము బాహ్యపరిస్థితులను మారుస్తుంది' అని. అది సూత్రము. అందుచేత మీరు బయట యేమి మార్పు తీసుకురావాలనుకుంటున్నారో; ఆ మార్పు యెక్కడ రావాలంటే మీ అంతరంగంలో రావాలి.

విజ్ఞానశాస్త్రంలో కూడ అదే సూత్రము వర్తిస్తుంది. ముందు శాస్త్రవేత్తల అంతరంగంలో క్యాన్సర్‌కు మందు కావాలి అని వారి మనస్సులలో కోరిక రావాలి. ఆ కోరిక వచ్చాక అదే భావమున్న వారందరూ ఒకచోటుకు చేరాలి. చేరిన తర్వాత ఉదయంనుండి సాయంత్రం వరకు వారందరూ ఆ పనిమీదే నిమగ్నమైవుండాలి. విజ్ఞానశాస్త్రంలో జరుగుతున్నది అదేగదా? క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్స్‌లో వున్న ప్రతివారి అంతరంగము యేమిటంటే క్యాన్సర్‌కు మందుకావాలి. దానికి ఒక వ్యక్తి ప్రయత్నము సరిపోదు. సమూహంయొక్క ప్రయత్నము కావాలి. ఒక సంఘటన కావాలి. కానీ ఆ సంఘటన మీకు ఘటనగా మారటానికి ఒకడు అక్కడ, ఒకడిక్కడ వుంటే జరుగదుగా? వారి మధ్య సమన్వయము వుండాలి. ఇవాళ ఒక శాస్త్రవేత్త చేసిన ప్రయోగమును అందరు శాస్త్రవేత్తలు చేస్తే అది వృధాయేగా! ఈనాడు వార్తాసౌకర్యాలవ్యవస్థ అద్భుతంగా అభివృద్ధి చెందింది. మీరు ఎక్కడున్నా కల్సి పనిచేయవచ్చు. నువ్వేమి చేస్తున్నావో ప్రక్కవాడికి చెప్పవచ్చు. అతనేమి చేస్తున్నాడో అమెరికాలో వున్న వ్యక్తికి చెప్పవచ్చు. అతను తాను యేమి చేస్తున్నాడో రష్యాలో వున్న మఱో వ్యక్తికి చెప్పవచ్చు. ఆవిధమైన అవగాహనతో ఆధ్యాత్మికత రూపొందాలి. అలా రూపొందటానికి ఆధ్యాత్మికత చెప్పే సూత్రము మీకు నిరంతరము గుర్తుండాలి.

అంతరంగము మారాలి. మీ ఆలోచనావిధానము మారాలి. మీ భావనలు ఉత్కృష్టమైన భావనలుగా వుండాలి. ఇవి నియమాలు. ఇవి లేకపోతే ఆధ్యాత్మికత లేదు. ఆధ్యాత్మికత వుండాలంటే భావమయ ఉత్కృష్టత వుండాలి. చాలామంది గురువుల నిలా అడుగుతారు. 'నేను ఫలానాది చేస్తున్నాను. నావొక్కడికే ఫలితము రావాలిగాని, ప్రక్కవారికికూడ వస్తే ఎలా?' అని. అలా అడుగవద్దు. అది భావనాత్మక ఉత్కృష్టత. ఆ చేతనత్వ విస్తారము వుండాలి. వర్షము కావాలి అని నువ్వు కోరుకుంటే నీ ఒక్కడి పొలంమీదా వర్షము కుఱవదు. కుఱిస్తే ఎక్కడ కుఱుస్తుంది. అందరి పొలాలమీదా కుఱుస్తుంది. అందరిలో నువ్వుండాలి.

రెండవది మనిషి ఆలోచనావిధానమును తెల్సుకోవాలి. మీరేమనుకుంటున్నారు? ఆధ్యాత్మిక ఆలోచనా విధానము చాలా సులభమని. ఏ ఆలోచనావిధానంకూడ సరళమైనది కాదు. మీరు దాన్ని నేర్చుకోవాలి. దానికి ఒక ఉదాహరణను గుర్తుంచుకోండి.

బియస్సీ చదివే విద్యార్థి రసాయనశాస్త్రవేత్త లాగ ఆలోచించడము నేర్చుకుంటున్నాడు. ఎన్నాళ్ళల్లో? ఫిజిసిష్ట్ - ఫిజిసిష్ట్ లాగ ఆలోచించడము నేర్చుకుంటున్నాడు. ఎన్నాళ్ళల్లో? ఇంజనీర్, లాయర్, వైద్యుడు ఒకరోజులో అవుతారా? మరి మీరుపూజలు మొదలెట్టేస్తున్నారు. ఉపాసనలు మొదలెట్టేస్తున్నారు. అసలెలా ఆలోచించాలో తెలుసా మీకు? మహాకాళి ఉపాసన చేసేటప్పుడు మీ ఆలోచన ఎలా వుండాలి? మహాలక్ష్మి సాధన చేస్తున్నప్పుడు మీ ఆలోచన ఎలా వుండాలి? ఇవన్నీ తెలియాలిగదా? తెలియకుండా యేంటి మీరు చేసే పూజల కర్థము? భాద్రపదమాసం వస్తుంది. వినాయకుడి పూజచేసి, పారేస్తారు అంటే నిమజ్జనము చేస్తారు. సాక్షాత్తు నిమజ్జనం

www.missionrk.com
చేస్తారు. మామూలుగా కాదు నీటిలో ముంచుతారు. మళ్ళా ఆయన బయటికొచ్చి మిమ్మలెక్కడ పట్టుకుంటాడో అని. ఆశ్వీయుజమాసంలో నవరాత్రులొస్తాయి. దుర్గాదేవినికూడ అంతే. ఏమి చేస్తున్నారో మీకు తెలియదు. ఆ తప్పును మనము దిద్దుకోబోతున్నాము. ఆధ్యాత్మికతను ఒక విజ్ఞానంలాగ అధ్యయనము చేయాలి అని గురుదేవులు తన జీవితమంతా ప్రయత్నించారు. ఒక విధివిధానమును అభివృద్ధి చేయడానికి అనేక ప్రయత్నములను చేశారు. అవి అర్థము చేసుకుని ఆచరణలో పెట్టడానికి మీ ఆలోచనావిధానము మారాలి. ఒకే ఆలోచనావిధానంతో .... ఎవరు, ఎప్పుడు, ఆ మాట అన్నాడో తెలియదుగాని -శివకేశములకు బేధము లేదు అన్నాడు. ఎందుకు లేదు? ఒకే విద్యుచ్ఛక్తితో పనిచేసే హీటర్‌కి, ఫ్రిజ్జ్‌కి తేడా వున్నది. హీటర్ నీటిని కాస్తుంది. ఫ్రిజ్జ్ నీటిని చల్లబరుస్తుంది. విద్యుచ్ఛక్తి భేదము లేదు. సరే. కానీ శివకేశములకు భేదమున్నది. ఋషులు ఆ మాట యే వుద్దేశ్యంతో చెప్పారు? ఒకే విద్యుత్తుతో హీటర్, ఫ్రిజ్జ్ పనిచేసినట్లే ఒకే పరబ్రహ్మతత్త్వముతో హరిహరులు పనిచేస్తారు అన్న దృష్టితో చెప్పారు. మీరు ఆ వుద్దేశ్యంతో అనడము లేదు. మీరేమంటున్నారు? శివుడు-కేశవుడు ఒక్కడే అని. ఒక్కడికే వేఱువేరు రూపా లివ్వడానికి ఋషులకు ఆలోచనలేదా? ఈ ఆలోచనావిధానమును సవరించుకోండి.

ఒక స్వామీజీ వైష్ణవోపాసకుడు, అందుచేత ఆయన శివాలయంవైపు కన్నెత్తైనా చూడడట. అతను సరిగానే ప్రర్తిస్తున్నాడు. కానీ ఎప్పుడు? కచ్చితంగా తన సాధనను చేస్తున్నప్పుడు. నువ్వు శివతత్త్వమును నేర్చుకుంటున్నప్పుడు, శివోపాసన చేస్తున్నప్పుడు కచ్చితంగా విష్ణువును ముట్టుకోనవసరంలేదు. ఫ్రిజ్జ్‌గురించి చదువుకుంటున్నప్పుడు, హీటర్‌గురించి చదవలేరు. చదవవచ్చు అది వేరే విషయము. చదవగలవు. అది వేరే విషయము. కానీ చదవకూడదు అన్నది విజ్ఞానము.

మీ ఆలోచనలలో వున్న మార్పు మీకు స్పష్టంగా అవగాహనవ్వాలి. గాయత్రీ ఉపాసన లేక యజ్ఞం అనగానే పసుపువస్త్రములనే ధరించాలి. మహాలక్ష్మి సాధన అనగానే పసుపువస్త్రములను ధరించాలి. ఈ రెండిటికి పసుపువర్ణమును వాడాలి. మేము తెలుపురంగు వస్త్రములను ధరిస్తే పర్వాలేదా? ఎందుకు పుసుపువస్త్రములను ధరించాలి? అని ప్రశ్నిస్తే.......... ఒక సైనికుడే ఆ ప్రశ్న వేశాడనుకోండి. ఆ మాట అంటే వాడిని చంపేస్తారు. అతనికా విషయము తెలుసు. అంతెందుకు ఒకటవ తరగతి పిల్లవాడికి యూనిఫారం వేయకుండా పాఠశాలకు పంపించండి. నీకు దమ్ముంటే పంపించు. ఏమి చేస్తారు బడివారు? పేరు తీసిపారేస్తారు. అంటే ఒకే లాగ అందరు బట్టలను ధరించాలి అని ఒకటో తరగతి పిల్లవాడికున్న భావము ఆధ్యాత్మికతలో లేదు. మీరు ఆధ్యాత్మికవేత్తలని మీరు అనుకుంటున్నారా? దేవుడికి తెలియాలి మీరెవరో!! అందువల్ల ఆధ్యాత్మికజగత్తులో గురుదేవులు అందించిన ఒక మాటను చాలా జాగ్రత్తగ గుర్తుంచుకోండి.

**"నా పూర్వజన్మ వృత్తాంతాలు నేను మీకు చెప్పను. చెబితే ఏ ఉత్కృష్టత వైపు, ఏ ఆధ్యాత్మిక ఆదర్శము వైపు మిమ్మల్ని నేను మలచాలనుకుంటున్నానో అది జరుగదు. నేను సాధనలు ఎలా చేశానో చెబుతాను. "**

మీరూ అలాగే చేసుకోండి. కానీ గురుదేవులు తమ ఆత్మకథలో 3 మాటలు వాడారు. ఆయన అన్న మాటలలో మొదటిది ----

హిమాలయాలలో ప్రపంచమును శాశించే ఒక సమూహ మున్నది. దాన్ని అంతర్ ప్రభుత్వము అంటారు. చెప్పింది జాగ్రత్తగా నేర్చుకోండి. మీలో అదృష్టవంతులెవరైనా ఆ అంతర్ ప్రభుత్వములోనికి వెళ్ళవచ్చేమో! మీయంతట

www.missionrk.com
మీరు ఆ అంతర్ ప్రభుత్వమును చూడలేరు. వారు చూడనిస్తే చూడగలరు. అలాంటి అంతర్ ప్రభుత్వ సంస్థలు ప్రతీ వూరిలోను వున్నాయి. హైదరాబాద్‌లోను వున్నది. బోంబేలోను వున్నది. మద్రాస్‌లోను వున్నది. కలకత్తాలోను వున్నది. అలాగే మిగతా వూళ్ళలోను వుంటాయికదా! అవి విచిత్రమైన స్థలాలలో వుంటాయి. మీరు ఊహించలేని స్థలాలలో వుంటాయి.

మేడమ్ బ్లావెట్స్కీ బోంబే వచ్చినప్పుడు, అప్పటికి థియోసాఫికల్‌సొసైటీ యింకా ఒక రూపుదాల్చలేదు, థియోసాఫికల్‌సొసైటీనే స్పష్టంగా రూపుదాల్చలేదు, డబ్బున్నవారు, యూరోపియన్స్ ఒకచోట చేరారు. సమావేశము జరుగుతున్నప్పుడు ఈవిడ లేచి గబుక్కున ఫలానాచోట ఒక భవంతి వున్నది అక్కడికి వెళ్ళాలి అన్నది. ఈవిడను చూడటానికి వచ్చినవారందరూ యేమనుకున్నారంటే 'ఈవిడేమో చాలా గొప్పవ్యక్తి అనుకున్నాము మేము. అసలక్కడ భవంతి యేమి లేదు. అక్కడ స్మశానం వున్నది........' అనుకున్నారు తమలో తాము. అక్కడ ఒక భవంతి వున్నది అని ఆవిడ చెప్పింది. మాకు తెలుసు మేడమ్. అక్కడ ఏ భవంతి లేదు. మేము రోజు ఆ దారంబటే వెళుతూ వస్తూంటాము. మీరు ఇప్పుడే బొంబాయిలో దిగారు, మీకు యెక్కడేమున్నాయో తెలియదు అన్నారు. అంటే మీకెందుకు పదండి అన్నది. అప్పుడు కార్స్ లేవు. జట్కాబండీలున్నాయి. వాటిలో అక్కడికి వెళ్ళారు. ఆ ప్రాంతానికి యెలా వెళ్ళాలో యీవిడ మార్గదర్శనము చేసింది. అక్కడికి వెళితే అక్కడ ఒక అందమైన పెద్ద భవంతి వున్నది. తోట వున్నది. జలయంత్రాలున్నాయి........ అక్కడ ఆపమన్నది. ఇప్పుడు వీరికి ఒక పెద్ద సమస్య అయ్యింది. ఆ భవంతిని మేమెప్పుడూ చూడలేదంటారు. కానీ భవంతి వున్నది. దాన్ని వారూ చూశారు. సరే యీవిడ లోపలికి వెళ్ళి 3 గంటల తర్వాత బయటికొచ్చింది. బయటికొచ్చిన తర్వాతకూడ అక్కడ భవంతి వున్నది. సరే వీరు తిరుగు ప్రయాణంలో జట్కాబండి యెక్కారు. ఆవిడను విడిదిస్థలంలో దింపి వీళ్ళందరూ మాట్లాడకుండా జట్కాను వెనక్కి త్రిప్పించారు. తీరా భవంతి వున్నది అన్నచోటుకు వెళ్ళి చూస్తే అక్కడ స్మశాన మున్నది.

అలాంటి ఊహాతీతమైన ఒక సంఘటన ఒక వ్యక్తికి జరిగింది.

ఒక మైదానము. ఆ మైదానంలో ఒక పెద్ద భవంతి. వీరు చూసొచ్చారు. వచ్చాక మళ్ళీ వెళ్ళి చూస్తే అక్కడొక ఱాయి వున్నది. ఆ ఱాయి మీద ఒక గొల్లపిల్లవాడు కూర్చునున్నాడు అంతే.

ఎందుకిది చెబుతున్నాను అంటే......మనకు 5 ఇంద్రియాలుంటాయి. శబ్ద, స్పర్శ, రూప, రస, గంథములను గ్రహించేందుకు. ఈ 5 ఇంద్రియాలు ఒక హద్దులో పనిచేస్తుంటాయి. కాస్త సైన్స్ తెలిసున్న వ్యక్తి అతనికి విజిబుల్‌లైట్‌గురించి యెంత తెలుస్తుంది? బహుకొద్ది. ఎలక్ట్రోమాగ్నటిక్స్‌లో ఎక్స్‌రేస్‌నుండి అల్ట్రావైలెట్ కిరణాలవరకు పెద్ద విశాలమైన తరంగాలున్నాయి. అది చాలా విశాలమైన విభాగము. కానీ విజిబుల్‌లైట్ పరిధి తక్కువ. అది వంకాయరంగు నుండి ఎఱుపువఱకు మాత్రమే వుంటుంది. కానీ అన్నీ ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలే. కొంచెం యెక్కువ ఇన్ఫ్రారెడ్ కిరణాలను ఎలక్ట్రోమాగ్నటిక్ కిరణాలలోకి తెచ్చుకోగలిగావనుకో! ఇప్పుడు నీకు కంటికి చీకట్లో కనిపించనివికూడ కంటికి కనిపించడము మొదలెడతాయి. ఇన్ఫ్రారెడ్ ఫోటొగ్రఫీ సైన్యవిభాగంలో చాలా వుపయోగపడుతుంది. మామూలు కంటికి చీకటిగా వున్నది. దాన్ని ఇన్ఫ్రారెడ్ రేడియేషన్‌తో గనుక ఫోటొ తీస్తే ఇదివరకు నీ కంటికి కనిపించనిది కనిపిస్తుంది. అది ఎఱుపుకు సంబంధించినది. మఱో వైపు వంకాయరంగుతో కూడ అనేక చమత్కారములు జరుగుతాయి.

www.missionrk.com

అంటే అదృశ్యజగత్తులో నీ కంటికి అది కనిపించడంలేదు. అంటే అదృశ్యజగత్తును చూడగలిగే వ్యక్తులున్నారు. ఆ వ్యక్తులతో కూడిన అంతర్ ప్రభుత్వము ప్రపంచమును శాశిస్తున్నది అన్న విషయమును గుర్తుంచుకోండి. ఏవిధంగా అయితే ఒక ప్రమాదకరపరిస్థితి యెదురైనప్పుడు మన ప్రభుత్వము నిపుణులను యెలా పంపిస్తుందో; అలాగే ఆధ్యాత్మికజగత్తులోకూడ జరుగుతుంది. ఏ త్సునామీనో వస్తే ఒక్క ప్రభుత్వమేకాదుగా, అన్ని ప్రభుత్వాలు కలుస్తాయి. అలాగ యీనాడు ప్రపంచంలో ఒక విచిత్రమైన లేమి యేర్పడింది. ఇప్పుడున్న పరిస్థితి యేమిటంటే మనము విశ్వాసమును కోల్పోయాము. మనకు ఎవ్వరిమీదా నమ్మకం లేదు. మీరు కాస్త జాగ్రత్తగా ఆలోచించుకోండి. ఈ మాటయొక్క లోతుగనుక మీకర్థమైతే మీరు చాలా దూరము ఆలోచించగలుగుతారు. ఇప్పుడున్న పరిస్థితి యేమిటంటే మనము విశ్వాసరాహిత్యపరాకాష్ఠలో వున్నాము. మన మాటలుకూడ చాలా తమాషాగా వుంటాయి. నా స్నేహితుడు ఎప్పుడు ఒక మాట చెబుతుంటాడు. ఏమని? ఎక్కడికైనా రమ్మంటే 99% వస్తాను, 1% రాను అని. అతను 99% ఎలా రాగలడో నాకు తెలియదు. వస్తే 100% వస్తాడు, రాకపోతే 100% రాడు. ఆ భాషే రారు అని చెబుతోంది.

మనకు తెలియని అదృశ్యజగత్తులు చాలా వున్నాయి. కంటికి కనిపించేదైతే దాన్ని దివ్యదృశ్యము అంటాము. చెవికి వినిపించేదైతే దాన్ని దివ్యశ్రవణము అంటాము. స్పర్శకి సంబంధించినదైతే దాన్ని దివ్యస్పర్శ అంటాము. రుచికి సంబంధించినదైతే దివ్యమైన రుచి అంటాము. ముక్కుకి సంబంధించినదైతే దివ్యగంథము అంటాము. ఇవి మానవజాతియొక్క సొత్తు. నువ్వు యీ దివ్యత్వం పైపు వెళ్ళవచ్చు. దివ్యం దదామితే చక్షుః - నీకు నేను దివ్యమైన ఆ కళ్ళనిస్తున్నాను అని గీతలో తన విశ్వరూప ప్రదర్శనకు ముందు జగద్గురువు అర్జునుడితో అంటాడు. అందుచేత ఆధ్యాత్మికజగత్తులో మనము చేస్తున్న సాధనలు ప్రపంచమునుండి పాఱిపోయే సాధనలు కాదు. మనము మన చేతనత్వమును విస్తరింపజేసుకుంటున్నాము. మీ జీవితము నేమి సంకుచితము చేసుకోవడంలేదు. ఆ ఆలోచనావిధానమును అర్థం చేసుకోండి. ఆ విస్తరణకు భగవద్గీత నాంది పలికింది. ఎవరైనా మీకు ఇలాంటి వివరణనిచ్చారా? లేదే.

అర్జునుడి లాంటి మహాతపస్వి శ్రీకృష్ణుని ఒక మాట అడుగుతాడు. నేను విశ్వరూపమును చూడగలనా? అని అడుగుతాడు. మీరు చేసే తపస్సులు, సాధనలు విశ్వరూపదర్శనమునకు వుపయోగపడవు. ఈ విషయమును స్పష్టంగా అర్థము చేసుకోండి. అది మీ చేతనత్వంలో మార్పే. మీ చేతనత్వంలో మార్పు రావాలి. అయితే అది చాలా సులభము. మెలకువగా వున్న వ్యక్తి నిద్రపోవడానికి యేమి కష్టపడాలో చెప్పండి. కానీ మీ చేతనత్వము మారిపోతుంది. నిద్రలో కలలు చూస్తావు. నిద్రాస్థితి వేరు. జాగ్రదావస్థ వేరు. కలలుకనే చేతనత్వం కచ్చితంగా వేరు. కానీ ఆ చేతనత్వము మీలో రావడానికి మీరేమి కష్టపడాలి? నిద్రపోవాలి అంతే. మీరేమన్నా కష్టపడుతున్నారా? లేదే. అయితే ఆధ్యాత్మికజగత్తు కష్టము అనే భ్రమ వచ్చింది. ఎందుకొచ్చిందంటే - కలలు చూడాలంటే అది కచ్చితంగా నేను యీ శరీరమును అనేది మర్చిపోవాలి. నేను యీ శరీరమును అంటే నిద్ర రాదు. అప్పుడు మీరు అనిద్రారోగగ్రస్తులౌతారు. కనుక ఆధ్యాత్మిజగత్తులో నేను శరీరమును అనేది మర్చిపో అన్నారు. మీ లోభాలు, మోహాలు, క్రోధాలు ఆ క్షణంలో మర్చిపోండి చాలు. ఆ క్షణంలో నువ్వు ఆధ్యాత్మికజగత్తులో వెళ్ళాలనుకుంటున్న చేతనత్వతలంలోకి వెళ్ళేటప్పుడు వాటిని మర్చిపో. లేకపోతే నువ్వు ఆ చేతనత్వస్థాయిలకు వెళ్ళలేవు. నీకు లోభం వద్దు, మోహం వద్దు, నువ్వు డబ్బు సంపాదించుకోవద్దు, నువ్వు శారీరక సుఖాలగురించి ఆరాటపడవద్దు అని యే

www.missionrk.com
గురువూ అనడంలేదు. గురువు అలా అనడు. మంచి శక్తిశాలియైన గురువుంటే, ఆధ్యాత్మికత అంటే తెలిసున్న గురువు వుంటే అసలా సుఖాలు నీకోసం కొట్టుకొస్తాయి, పరిగెట్టుకొస్తాయి అని చెబుతాడు. ఈ భౌతికసుఖాలకోసం నువ్వేమి ప్రయత్నించనక్కర్లేదు. వద్దు అనికూడ అననక్కర్లేదు. ఆ తప్పు చెయ్యకూడదు. అయితే భౌతికసుఖాల వెంట వెంపర్లాటవద్దు. తేడా అర్థమవ్వాలి మీకు. వెంపర్లాట వుండకూడదు. ఎందుకంటే నువ్వు వాటికోసం వెంపర్లాడుతుంటే నువ్వు ఆ చేతనత్వంలోకి వెళ్ళలేవు.

అర్జునుడికే ఆ అనుమానం వచ్చింది. నేను మహాభారతయుద్ధము చేయబోతున్నాను. మఱి నాకు వెంపర్లాట వున్నదికదా? లేకపోతే యుద్ధం యెందుకు చేస్తాను? అయినా నేను యుద్ధం చేయడానికి అనర్హుడిని అంటాడు. అప్పుడు కృష్ణుడు గీతను ప్రబోధిస్తాడు. అలా చెప్పేటప్పుడు వివిధ లోకముల ప్రస్తావన వస్తుంది. అప్పుడు అర్జునుడు -మన్యసే యది త్వం శక్యం - నేను ఆ సూక్ష్మజగత్తులను చూడగలను అని నువ్వు అనుకుంటే చూపించు అంటాడు. చూడగలను అనుకున్నాక నువ్వు ఏమి చేయాలి? నువ్వేమి చేయనక్కర్లేదు. ఆ దృష్టి గురు విస్తాడు. నీయంతట నీకు యే సాధనలు చేసినా ఆ దృష్టి రాదు. రాక్షసులు దానికి పెద్ద ఉదాహరణ. వారు 3 లోకాలలోను వున్నారు. రావణాసురుడికి ఆ దృష్టి రాలేదు. 3 లోకాలలోను వున్నాడంతే. ఏంటా 3 లోకాలు? భౌతికమైన లోకం, కోరికలయొక్క లోకం, ఆచరణయొక్క లోకం, ఆలోచనలయొక్క లోకం. వాటిలో జీవించాడు.

ఆచరణ అంటే మీ మనస్సులో యేది వున్నదో అది కోరికగా మారితే ఆచరణ అవుతుంది. ఆచరణ అంటే ఆలోచన కోరికగా మారిన పరిస్థితి. ఇది రావణాసురుడికి వున్నది. ప్రతి రాక్షసుడికి వున్నది. ఆ రాక్షసుడికి ఆ దివ్యలోకాలు తెలియవు. ఎక్కడో వున్న ఆధ్యాత్మికతనుగూర్చి మనము మాట్లాడుకోవడంలేదు. ముక్తికోసం మాట్లాడుకోవడంలేదు. ఆ గందరగోళమును వదులుకోండి. ఏమీ చేతకాని గురువులు ఆధ్యాత్మికతను సర్వనాశనం చేసిపారేశారు. ఏమి తెలియని గురువులు, అవగాహనారాహిత్యమున్న గురువులు పాడుచేశారు. అందుకే గురుదేవులు ఒకచోట తన బాధను చెబుతూ ఏడుస్తారు. నాకు యెప్పుడూ కూడ శాంతి లభించలేదు. ఇంతమంది మానవులు యిక్కడుంటే నేను వెళ్ళి స్వర్గంలో కూర్చునే పిచ్చి ఆలోచన నాకు రాలేదు అంటాడు. పిల్లవాడు యేడుస్తుంటే యే తండ్రికి నేను శాంతంగా కూర్చుంటాను అనే ఆలోచన వస్తుంది? ఆధ్యాత్మికతయొక్క ఆ విధానమును నేర్చుకోండి. మీరు యిప్పుడున్న ఆధ్యాత్మికత అనే మాటకు వ్యతిరేకమైన విధానమును, నిజమైన విధానమును నేర్చుకోవాలి.

ఆధ్యాత్మికతలో మీరేమి సుఖాలను పొందడంలేదు. సామర్థ్యమును పొందుతున్నారు. శక్తిని పొందుతున్నారు? దేనికి శక్తిసామర్థ్యములను పొందుతారు? ఇతరుల దుఃఖమును తీసివేయడానికి పొందుతారు. ఇతరుల బాధను తీసివేయడానికి సామర్థ్యమును పొందుతారు. దానికి మనము యేమి చేయాలి? ఏవిధమైన జీవితవిధానమును అవలంబించాలి? అనేది మనము నేర్చుకుంటున్నాము అనే విషయావగాహన కలిగుండండి. లేకపోతే కచ్చితంగా జారిపోతారు. మీరు ముక్తికోసం సాధనలు చేయడంలేదు. మీరు స్వర్గప్రాప్తికోసం యేమి చేయడంలేదు. దానికోసమే గురువుగారి దగ్గఱకు వస్తే జాగ్రత్త. ఆయన ఆ విషయములను గూర్చి చెప్పరు. ఆయనకే లేదది. ఆయనకు చేతకానిది మనకేమి చెబుతాడు. ఇంతకీ గురుదేవులు మనకేమి చెప్పబోతున్నారు?

నీ దృష్టిని దివ్యదృష్టిగా మార్చుకో! నీ శ్రవణమును దివ్యశ్రవణముగా మార్చుకో. నీ స్పర్శను దివ్యస్పర్శగా మార్చుకో. అసలు యీ పదాల అర్థమే మర్చిపోయాము. అసలు దివ్యస్పర్శ అంటే యేమిటో తెలుసా మీకు?

www.missionrk.com

జర్మనిలో ఒకాయ నున్నాడు. ఆయన గొప్పదన మేమిటంటే ఆయన చేతికి ఒక వస్తువిస్తే దాన్ని పట్టుకుని అది తీసుకురాబడిన స్థలంయొక్క లేక తెచ్చిన మనిషియొక్క భూతభవిష్యవర్తమానాలు చెపుతాడు. అందుచేత చాలామంది రక్షకభటులు అనేక విషయాలలో ఆయన సహాయము తీసుకునేవారు. ఒకసారి ఒక హత్య జరిగిన స్థలంలోని ఒక రుమాలు ఆయన చేతికిచ్చారు. దాన్ని పట్టుకుని ఆ హత్య ఎలా జరిగింది, ఎప్పుడు జరిగింది మొదలైన విషయాలు చెప్పాడు.

అంటే మీరు యే వస్తువునైనా ముట్టుకుంటే మీరా దివ్యస్పర్శను వుపయోగించుకోగలిగితే ఏమి జరుగుతుంది? ఆ కణము లేక పదార్థము ఎక్కడినుండి వచ్చిందో, ఎవరెవరు దాన్ని ముట్టుకున్నారో, ఏ సంఘటనలు దానిచుట్టూ అల్లుకున్నాయో అవన్నీ మీకు తెలుస్తాయి. మనకు యివన్నీ తెలిస్తే చాలా విగుసుకదా? ఎంత కష్టము? దివ్యస్పర్శను మీరు వుపయోగించుకోవా లంటే వుపయోగించుకోవచ్చు. ఉపయోగించుకోను అంటే మానేయవచ్చు. ఇది అర్థము చేసుకోండి. పంచతన్మాత్రలనే గాయత్రీయొక్క 5 ముఖాలుగా గురుదేవులు అభివర్ణించారు. ప్రతి మనిషిలోనూ 5 ముఖాలు వున్నాయి. మనిషిలో వున్న ఇంద్రియాలు దివ్యత్వమును పొందితే గాయత్రీ ఉపాసన అంటారు. అంతర్ ప్రభుత్వంగూర్చి చెబుతూ యిదంతా చెబుతున్నాను.

హిమాలయాలలో కొన్ని కోట్ల సంవత్సరాలబట్టీ యితఱ గ్రహాలనుండి వచ్చిన మానవశరీరధారులు ప్రపంచమును శాశిస్తున్నారు. మానవుడికి తనను తాను శాశించుకోవడమే తెలియదు. ఇంక అతను పృథ్వీగ్రహమును యేమి శాశిస్తాడు? కానీ ఆ అంతర్ప్రభుత్వంలో ఈనాడు మానవజాతికి చెందిన కొంతమంది మనుష్యులుకూడ ఆ స్థాయికి వెళ్ళారు. ఆస్థాయికి వెళ్ళిన మానవజాతికి చెందిన కొంతమంది వ్యక్తులు, ఇతర గ్రహాలనుండి వచ్చి అనేక కోట్ల సంవత్సరాలబట్టీ పృథ్విని శాశిస్తున్నవారు వున్నారు. ఇతర గ్రహాలనుండి వచ్చినవారిని మన భాగవతంలో సనత్కుమారులు అని చెప్పాడు వ్యాసుడు. వాళ్ళు నల్గురు ప్రపంచమును శాశిస్తారు. వారెప్పుడూ చిన్నపిల్లలలాగే వుంటారు. ఎందుకంటే వారికి వయస్సు లేదు. వారు కాలమునకు అతీతులు. మొదటగా మీ చేతనత్వంలో యీ అవగాహన రావాలి. పృథ్విని శాశించే ఒక ప్రభుత్వమున్నది. ఈ పృథ్విని ఆ ప్రభుత్వము వదిలెయ్యలేదు. ఎప్పుడైన పెద్ద వినాశనము సంభవించి పృథ్వీగ్రహం, మనుష్యులు నాశనమైపోతారంటే వారు రక్షిస్తారు అనే నమ్మకము వుండాలి.

**యదాయదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**

**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ (గీ॥ అ॥ 4, శ్లో॥ 7)**

***భావము : ఓ భరతవంశీయుడా! ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియు, అధర్మమునకు వృద్ధియు కలుగునో, అప్పడప్పుడు నన్ను నే సృష్టించుకొందును. సాకారరూపంలో జనుల ముందు ప్రకటితమగుచుందును.***

ఈ వాగ్దానమును కచ్చితంగా నిలబెట్టుకుంటుంది కృష్ణావతారము. కానీ కృష్ణావతారమునకు ముందు వచ్చిన అవతారము లన్నీ యితఱ లోకవాసులే. మానవజాతిలోని వ్యక్తులు అంతర్ప్రభుత్వంలో పాలుపంచుకొనగలిగే స్థాయికి అప్పటికింకా ఎదగలేదు. కృష్ణావతారం తర్వాత కొన్నివేలమంది ఆ స్థితికి యెదిగారు. ఏ స్థితికి? ఒక అంతర్ప్రభుత్వమున్నది. దానితో మనము సంబంధము నెరపుకోగలము అని తెల్సుకుని వారితో సంబంధమును పెట్టుకునే స్థాయికి యెదిగారు. ఈ వేలమంది సాధకులలో బుద్ధుడి కాలంలో కొంతమంది అంతర్ప్రభుత్వంలో

www.missionrk.com
కొన్ని పదవులనుకూడ చేపట్టారు. క్రీస్తు కాలం వచ్చేసరికి అంతర్‌ప్రభుత్వంలో దాదాపు 33% మన మానవులే అయ్యారు. మానవశరీరధారులు వారి ఆత్మోన్నతి స్థాయినిబట్టి అంతర్‌ప్రభుత్వంలో స్థానము సంపాదించారు.

ఈనాడు పరిస్థితులు యెలా మారాలంటే అసలు ప్రపంచంలో వున్న మొత్తము శాసన వ్యవస్థ మనుష్యుల చేతిలోకి వెళ్ళిపోవాలి. అందుచేత యిన్ని ప్రభుత్వాలు వుంచనక్కర్లేదు. ఆ అంతర్‌ప్రభుత్వ మొక్కటి వుంటే చాలు. ఇప్పుడు మనల్ని పరిపాలిస్తున్నది ఆ అంతర్‌ప్రభుత్వ దూతలు. ఒక ముఖ్యమంత్రిగాని, ఒక ప్రధానమంత్రిగాని......... వారంతా యెవరైయుండాలి? అంతర్‌ప్రభుత్వంచేత యెన్నుకోబడినవారైవుంటారు.

మనిషి అంతర్ ప్రభుత్వములో స్థానమును సంపాదించుకున్నాడు అనేదానికి పెద్ద నిరూపణ యెవరంటే - శిరిడిసాయి. ఆయనను మనము అఖిలాండకోటిబ్రహ్మాండనాయక, రాజధిరాజ, యోగిరాజ అని అంటున్నాము. కానీ మనుష్యులకు ఆ స్థాయి, ఆ విషయావగాహన లేదు. ఆయన స్థాయి అర్థము కాదు. అవధూత కాన్సెప్ట్ అర్థము కాలేదు. దత్తాత్రేయ కాన్సెప్ట్ అర్థము కాలేదు. దత్తుడు అనంగానే ఆయన 3 తలలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరతత్త్వమును సూచిస్తాయి అనే విషయము అవగాహనలోకి రావాలి. గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వర- త్రిమూర్తిస్వరూపుడైన ఆ దత్తుడిగూర్చి చెపుతున్నారు అనే అవగాహన రావాలి. కానీ దత్తుడు అనంగానే మనకు యెవఱు గుర్తొస్తారు? 3 తలల దత్తుడు గుర్తుకువస్తాడు. కానీ నిజానికి దత్తుడు త్రిమూర్తి స్వరూపమునకు సంకేతము.

మన ప్రభుత్వంలోకూడ 3 సింహాలున్న టోపిని రక్షకభటులు ధరిస్తారు. అంటే ఆ 3 సింహాలు ప్రభుత్వమా? కాదుగా? ప్రభుత్వమునకు సంకేతము. అలాగే ఇక్కడాను. అందుచేత యీ గురుతత్త్వమునకు లొంగాలి మనిషి. పూర్వము గురువులేకాదు, కులగురువులు కూడ వుండేవారు. ఈనాడు ఎవరికైనా కులగురువులు వున్నారా? లేరు. కులగురువులకు మన భూమిలో యెంతో ప్రాముఖ్యత వున్నది. శ్రీకృష్ణచరిత్రలో యీ కులగురువు ప్రాముఖ్యతను గమనిద్దాము.

శ్రీకృష్ణునికి నామకరణసంస్కారము జరుగాలి. కులగురువే ఆ సంస్కారమును చేయాలి. శ్రీకృష్ణుని కులగురువు ఆయనకు నామకరణ సంస్కారము చేస్తే కచ్చితంగా కంసునికి ఆ బాలుడు తనను చంపేందుకు పుట్టిన పిల్లవాడే అని అర్థమౌతుంది. అందుకని గోశాలలో రహస్యంగా కులగురువైన గర్గమునిద్వారా నామకరణ సంస్కారము జరిగింది.

ఈనాడు గురువుకు మనము మన జీవితాలలో అంత ప్రాముఖ్యత నిస్తున్నామా? లేదు. అసలు ఈనాడు అలాంటి గురువులు వున్నారా? వెతికితే కనిపిస్తారు. అర్హత వుంటే కచ్చింగా వారు మార్గదర్శనము చేస్తారు. శ్రీరామశర్మఆచార్య ఆ జీవితవిధానము ఆ ఆశ్వాసన యిస్తుంది. ఈనాడు ఋషులు గోత్రా లైతే వున్నాయిగాని అసలా ఋషి యెవఱో, ఆయన ఏమి సాధనలు చేశాడో, ఏ తపస్సులు చేశాడో మనకు తెలియదు. చాలామందికి ఋషుల గోత్రాలు తమకున్నా, ఆ ఋషులెవరో, వారి పేర్లేమిటో తెలియదు. మన గోత్రమునుబట్టి మనము యే సాధన చేయాలో, ఏ తపస్సు చేయాలో తెలుస్తుంది. ఒక ఋషి ఒక సాధన చేస్తాడు, మఱొ ఋషి మఱొ సాధన చేస్తాడు. సగోత్రీకులు వివాహము యెందుకు చేసుకోకూడదు అని పెద్దలు నిర్ణయించారంటే యీ ఋషి సాధనలే మీరు చేయకుండా మఱో ఋషి చెప్పిన సాధనలుకూడ ఆచరణలో పెట్టుకోవాలని. అయితే జీవితాలలో వేఱే సాధనలు, తపస్సు, కాంతి రావడం అంత సులభము కాదు.

ఈనాడు ప్రపంచమునకు సంభవిస్తుంది అన్న ముప్పు రాదు. అలా రాకుండా గాయత్రీపరివార్ సమూహము కృషిచేస్తుంది. భగవంతుడిమీద, ఇన్ని కోట్ల సంవత్సరాలబట్టీ మానవజాతికి మార్గదర్శనము చేస్తున్న దైవీప్రణాళికయొక్క గురుత్వంమీద వారికి నమ్మక ముండాలి. దేనిమీద నమ్మకము వుండాలి? ఆ దైవీప్రణాళికయొక్క అంశే మీలో కూడ వున్నది. దాన్ని ఆత్మ అంటారు. భారతీయు లందఱికి తాము ఆత్మలము అనే నమ్మక మున్నది. కాని ఆత్మల వలె జీవిస్తున్నామా అన్నది ప్రశ్న. కనీసము విదేశీయులు జీవిస్తున్నట్లుకూడ మనము జీవించడంలేదు.

అంతర్ ప్రభుత్వ మున్నది. అది ప్రపంచమును శాశించేందుకు వ్యవస్థను కలిగివుంటుంది అని భాగవతంలో చెప్పబడింది. భాగవతంలో రుక్మిణీకళ్యాణము అనే విభాగము దీనిని విశదీకరిస్తుంది. ఒకవేళ మనము ఆత్మలమే అయితే మన శరీరంలో వున్న ఆత్మలయొక్క వునికి శ్వాసద్వారానే వున్నది అని తెలుసు. ఈ విషయము తెలియడానికి మనము శాస్త్రవేత్తలు గావక్కఱ్లేదు, ఆధ్యాత్మికవేత్తలు గావక్కఱ్లేదు. మన శరీరంలో ఆత్మ వుంటే ఆ ఆత్మ వునికి దేన్నిబట్టి తెలుస్తుంది? శ్వాసద్వారా. శ్వాస లేకపోతే ఆత్మ లేదు. శ్వాస వుంటే ఆత్మ వున్నట్లు. శ్వాసను వుపయోగించి మీరు ఎలా జీవించాలి అనేది గాయత్రీమంత్రము చెబుతుంది. గాయత్రీమంత్రము శ్వాసను ఎలా వుపయోగించు కోవాలో చెబుతుంది. ఈ రెండిటికి మధ్య గల సంబంధమును మనము పూర్తిగా మర్చిపోయాము. ప్రాణాలను రక్షించేది గాయత్రి. మఱి ప్రాణము అంటే ఏమిటి? ఆకాశం అంటే ఏమిటి? అనే రెండు విషయాలు తెలియాలి.

దత్తాత్రేయుని అతి ముఖ్యమైన నామము యేమిటంటే -దిగంబర. దిగంబరతత్త్వము అంటే ఆకాశతత్త్వము. గురువు. ప్రాణతత్త్వము - ఆకాశంలోని కదలిక. స్థిరమైన ప్రాణము - ఆకాశము. అస్థిరమైన ఆకాశము - ప్రాణము. ఆకాశము- స్థిరము. ప్రాణము - అస్థిరము. దాదాపు రెండు ఒక్కటే. కదలిక వున్న ఆకాశము - ప్రాణము. కదలికలేని ఆకాశము - ఆకాశము. ***గురుదేవులు అందించిన గాయత్రీమంత్రసాధన చలిస్తున్న ప్రాణమును స్థిరంగా ఎలా వుంచుకోవాలో నేర్పుతుంది అనే విషయము తెలుసుకోండి. ఇన్ని కోట్ల మంత్రజపములు చేశామే! అవి తప్పా? కాదు. కానీ అది గురుదేవులు చెప్పిన గాయత్రీజపము కాదు. 5 రకాలుగా చలిస్తున్న 5 ప్రాణాలు అంటే గాయత్రీ పంచముఖములు, ఒకే ప్రాణంగా స్థిరంగా మారాలి అంటే ఏకముఖిగాయత్రీ అవ్వాలి అనేది గురుదేవుల వుద్దేశ్యము.*** మన శరీరంలో అస్థిరంగా చలించే ప్రాణములు 5 రకాలుగా వుంటాయి. 5 ఇంద్రియాలుగా వుంటాయి. ఈ 5 ఇంద్రియాలు చలిస్తూ వుంటే ప్రాణము. ఇది పంచముఖీగాయత్రీ స్వరూపము. ఈ 5 ఇంద్రియాలు అంటే 5 ప్రాణాలు చలించకుండా వుంటే ఒకే ప్రాణము అవుతుంది. అది ఏకముఖిగాయత్రి.

సరే ప్రపంచంలో అంతర్ ప్రభుత్వమున్నది. అది ప్రపంచమును పాలిస్తుంది. ఈ విషయము తెలియగానే మనము ఆ గురువు చెప్పిన విషయమునుగూర్చి ఆలోచించము. వారి గొప్పదనమును గూర్చి ఆలోచిస్తాము. వారి స్థాయిలగూర్చి మనము పట్టించుకోనవసరంలేదు. వారు చెప్పింది చేస్తే చాలు. అయితే గురువు స్థాయిని పట్టుకోవాలనుకునే ఆసక్తి గలవారు థియోసాఫికల్‌లోని 'ద బిగినింగ్ ఆఫ్ సిక్స్‌రూట్ రేస్' అనే పుస్తకము చదవాలి. శ్రీరామశర్మఆచార్య గురుదేవులు ఎక్కడనుండి వచ్చారో, ఆయన స్థాయి యేమిటో తెలుస్తుంది. చంద్రగ్రహంనుండి పృథ్వీగ్రహంమీదకు వచ్చిన మానవజాతి పృథ్వీగ్రహమును వదిలి యెక్కడికి వెడుతుంది? అనే విషయము ఆ పుస్తకంలో చెప్పబడివున్నది.

ఏకముఖీగాయత్రీ ఉపసాన చేస్తున్నప్పుడు 4 విషయాలు గమనిస్తారు.

www.missionrk.com

1. హంసవాహిని గాయత్రీ స్వరూపము. 2. ఒక చేతిలో కమండలము. 3. రెండవచేతిలో పుస్తకాలు లేదా జపమాల వుంటుంది. 4. పద్మము వుంటుంది. ఈ 4 విషయాలను అర్థము చేసుకోగలిగితే మీలో వున్న ప్రాణశక్తికి దిగంబరస్థితి ప్రాప్తిస్తుంది. దిగంబరస్థితి అంటే ----------- దత్తస్థితి. అంటే ఆకాశస్థితి.

ఉపాసకులు యెట్టిపరిస్థితులలోను కర్మకాండను వదలకూడదు. భాగవతము మఱియు గురుదేవుల ఆచరణ యీ విషయంయొక్క ప్రాముఖ్యతను తెలుపుతాయి. భాగవతంలో శ్రీకృష్ణుడు మధుర వెళుతూ సాయంసంధ్యాసమయ మయ్యింది అని చెప్పి రథం దిగి సంధ్యావందనము ఆచరించి అప్పుడు తిరిగి ప్రయాణమును ఆరంభిస్తాడు.

వంట చేసుకోవడానికి నీక్కావల్సిన పదార్థములును తెచ్చిపెట్టి కాసేపయ్యాక వచ్చి అన్నం తిను అంటే నువ్వేమి తింటావు? తినాలంటే వంట చేసుకోవాలిగా! లేకపోతే అన్నము రాదు. ఇక్కడా అంతే. ఆకలేస్తుంటే ఎంతసేపు కూర్చుని ధ్యానము చేయగలవు? చేయలేవు. కర్మకాండ లేకుండా ఎలా? కలము లేకుండా నీకు ఎంత బుద్ధిబలము వుంటేమాత్రము యేమి వ్రాస్తావు? పనిముట్లు లేకుండా యెంత పెద్ద శస్త్రచికిత్సానిపుణుడైనా శస్త్రచికిత్స చేయగలడా? చేయలేడుగా? అందుచేత కర్మకాండ చాలా ముఖ్యము. అయితే దాన్ని వుపయోగించుకోవడము నేర్చుకోవాలి. గురుదేవులు చెప్పేది పూజ, ఉపాసన చేయమనే. వాటిని మానేయకండి.

**" కలము లేకుండా యెలా వ్రాయగలము? అలాగే పూజ, ఉపాసన లేకుండా ఆత్మిక ప్రగతిమాత్రము ఎలా సంభవము?**

**"ఇంత తెల్సుకున్నతర్వాత మనకు ఇంకొక విషయము స్పష్టంగా తెలియాలి. అధ్యయనము, స్వాధ్యాయము, చింతన, మననలయొక్క బౌద్ధికవికాశ ప్రక్రియ సంపన్నము చేయకుండా కేవలం కాగితము, కలము ఆధారంగా వ్యాసములు, కవితలు వ్రాయలేము. ఆంతరిక ఉత్కృష్టత కూడ బౌద్ధిక వికాసము లాంటిదే. "**

కవిత్వము వ్రాయాలంటే ముందు మీ బుద్ధి వికసించాలి. బుద్ధివికసించిన తర్వాత వ్రాయాలంటే కలము వుండాలి.

**'ఆత్మిక ఉత్కృష్టత కూడ బౌద్ధిక వికాసము లాంటిదే. '**

ఆత్మిక ఉత్కృష్టత యొక్క లక్షణాలు గుర్తుంచుకోండి. 'ఒక అంతర్ ప్రభుత్వమున్నది.' ఇది ఒక మాట అనుకోకండి. మీలో శ్రద్ధ, విశ్వాసము వుంటే మీ ఆచరణ మారుతుంది. శాస్త్రవేత్తలు యెంత శక్తివంతమైన అణుబాంబుని కనిపెట్టినాకూడ పృథ్వికి యేవిధమైన ఆపదా సంభవించదు. ఎందుకంటే అంతర్‌ప్రభుత్వము యీ పృథ్విని శాశిస్తుందిగనుక.

**" అధ్యయనము, స్వాధ్యాయము, చింతన, మననములయొక్క బౌద్ధికవికాశ ప్రక్రియ సంపన్నము చేయకుండా కేవలం కాగితము, కలము ఆధారంగా వ్యాసములు, కవితలు వ్రాయలేము. ఆత్మిక ఉత్కృష్టత కూడ బౌద్ధిక వికాసము లాంటిదే. పూజ, ఉపాసన, కర్మకాండలు మంచి కలము లాంటివి. ఈ రెండిటి సమన్వయం వల్లనే పని జరుగుతుంది. ఏది లేకపోయినా అసంపూర్ణంగానే వుంటుంది. సాధనయొక్క బండి ఒక చక్రముతోనే నడవదు. ఉపాసన మఱియు ఆంతరిక ఉత్కృష్టత అనే రెండు చక్రాలు నా జీవనసాధన అనే బండికి వుండేటట్లు చూసుకొన్నాను. నేను ఉపాసన ఎలా చేశాను? అందులో రహస్యము యేమి లేదు. గాయత్రీమహావిజ్ఞానములో వివరించినట్లే నేను గాయత్రీమంత్రముయొక్క అతి సామాన్యమైన ఉపాసన చేసుకొన్నాను. "**

www.missionrk.com

గురుదేవులు చెప్పిన ఆంతరిక ఉత్కృష్ఠ అనే మాటకు అర్థము - మీరు అంతర్‌ప్రభుత్వంమీద అత్యంత బలమైన నమ్మకమును కలిగియుండాలి. జీవితంలోని ప్రతి అడుగులోను యీ నమ్మకమును కలిగివుండాలి. ఉండటమేకాదు, నువ్వు దానికి తగిన స్థాయికి చేరగలిగితే నువ్వుకూడ అందులో భాగస్తుడవౌతావు అని.

**" నేను ఉపాసన ఎలా చేశాను? అందులో రహస్యము యేమి లేదు. గాయత్రీమహావిజ్ఞానములో వివరించినట్లే నేను గాయత్రీమంత్రముయొక్క అతి సామాన్యమైన ఉపాసన చేసుకొన్నాను."**

గురువుగారు యేదైనా పెద్ద పెద్ద బీజమంత్రాలు, కర్మకాండలు చెపుతారేమో అని అనుకుంటున్నారేమో అవేమి చెప్పరు. ఎందుకంటే గురుదేవులే గాయత్రీమాతయొక్క సామాన్యమైన ఉపాసన చేశారు.

**"ఒకటిమాత్రము గుర్తుంచుకోండి. భజన చేయడానికి యెంత సమయము కూర్చునా ఆ సమయమంతా పరబ్రహ్మముయొక్క పరమతేజోమయసత్తా గాయత్రీమాతయొక్క దివ్యప్రకాశము నా రోమరోమంలో ఓతప్రోతమౌతున్నది మఱియు ప్రచండాగ్నిలో పడవేసిన ఇనుము యెలా ఎఱ్ఱగా అగ్ని వలె మారుతుందో, నాయొక్క నగణ్యమైన అస్తిత్వము దివ్యతేజోమయంగా మారుతోంది అనే భావన చేస్తుండేవాడిని. "**

కనుక మీరు గాయత్రీజపము చేస్తున్నప్పుడు మీ రోమరోమంలో ఒక దివ్యకాంతి నిండుతోంది అనే భావనకూడ వుండాలి. యద్భావం తద్భవతి. మీరు గాయత్రిజపము చేస్తునప్పుడు మీరు పసుపురంగు వస్త్రములను ధరిస్తే మీ శరీరంలోంచికూడ పసుపురంగు కిరణములే బయటకు వస్తాయి. ఇది గాయత్రీవిజ్ఞానము. పసుపురంగు వస్త్రములను ధరించినవారి మధ్యన కూర్చుంటే మీ కన్నులలో యే రంగు కనబడుతుంది? పసుపురంగు.

**" నా యిష్టదేవత వలెనె నా స్థాయికూడ ఉత్కృష్ఠమౌతున్నది' అనే భావన నిరంతరము వుండేది. శరీరంయొక్క కణ కణపరమాణువులో గాయత్రీమాతయొక్క బ్రహ్మవర్చస్సు వుండటంవలన నా శరీరంలోని ప్రతి అవయవము జ్యోతిర్మయమైనది. ఆ అగ్నిలో ఇంద్రియముల లిప్సలన్నీ కాలి భస్మమైపోయినవి. ఆలస్యము మొదలగు దుర్గుణాలు నశించాయి. రోగవికారములు యీ అగ్నిలో కాలిపోయాయి. శరీరము నాదే అయినా దానిలో ప్రచండ బ్రహ్మవర్చస్సు వికసించుచున్నది. నా వాణిలో సరస్వతి నాట్యము చేయుచున్నది. అసత్యము, మోసము మఱియు రుచి అనే అసురులు నోరు అనే దివ్యమందిరము వదిలి పలాయనము చిత్తగించారు. కళ్ళలో ఇతరుల సుగుణములను గ్రహించడము మఱియు భగవంతుని సౌందర్యము జడచేతనా లన్నింటిలో చూడగలిగే సామర్థ్యమే మిగిలింది. ఛిద్రాన్వేషణ, కాముకత లాంటి దోషములు నా కళ్ళల్లో లేవు. చెవులు మంగళకరమైనవాటినే వింటాయి. మిగతాదంతా కేవలము కోలాహలమే, అవి శ్రవణేంద్రియమును తాకి యే ప్రతిస్పందనా లేకుండా వెనక్కితిరిగి వెళ్ళిపోతున్నాయి.**

**"గాయత్రీమాతయొక్క పరమతేజస్వీప్రకాశము నా సూక్ష్మశరీరంలో, అంతఃకరణ చతుష్టయము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములలో ప్రవేశించి అవి ప్రకాశవంతమగుట దర్శించాను. ఈ బ్రహ్మవర్చస్సు నా మనస్సును పాశవిక, ఇచ్ఛా, ఆకాంక్షలు లేనటువంటి వుచ్చభూమిక వైపు నన్ను లాక్కొనిపోతున్న దని అనుభవంలోకి తెచ్చుకొన్నాను. దివ్యత్వమును పరిప్లావితము చేయగలిగే ఆకాంక్షలు మేలుకొంటున్నాయి. బుద్ధి క్షణికావేశానికి, తుచ్ఛప్రలోభముకొఱకు మానవజీవితం లాంటి అతి పెద్ద ఉపలబ్ధిని నష్టము చేసుకోకూడదు అనే నిర్ణయాలు చేసుకొంటుంది. ఈ జీవితంయొక్క ప్రతిక్షణము ఆదర్శాలఽప్రతిష్ఠాపనకు వుపయోగించాలి. చిత్తములో వుచ్చ నిష్ఠలు చోటుచేసుకుని సత్యము, శివము, సుందరము వైపు ముందుకు వెళ్ళాలనే వుత్సాహపూరిత ఆలోచనలు ఉత్తుంగతరంగాలుగా యేర్పడుతున్నాయి.**

www.missionrk.com

**సవితాదేవతయొక్క తేజస్సు, నా అంతఃక్షేత్రంలో ప్రవేశించి, నా అహంను పరిష్కృతము చేసి మరణధర్మ జీవధారుల స్థితినుండి అనేక యోజనములు దూరంగా తీసుకువెళ్ళి ఈశ్వరుని యొక్క సమర్థ, పరమపవిత్ర సచ్చిదానంద స్వరూపంలో స్థిరపరచుచున్నది.**

జపము చేస్తున్నప్పుడు మీరు యీ భావన చేసుకుంటూవుండాలి. కళ్ళల్లో, చెవులలో గురుదేవులకు వచ్చిన భావనలు రావాలి. జపము చేస్తున్నప్పుడు అవి రావడానికి అభ్యాసము చేసుకుంటూవుండాలి. ధియో యో నః ప్రచోదయాత్ - అది నన్ను సన్మార్గంలో ప్రేరేపణ చేస్తుంది. గురువుల దగ్గఱకు వెళ్ళినప్పుడు మీ మోహము పోవడానికి కారణము యీ మాటే. మఱయితే గురువుల దగ్గఱకు వెళ్ళినప్పుడు రోగాలు యెందుకు తొలగిపోవు? అనే సందేహము వస్తుంది. మనము మన రోగాలను గురువుల దగ్గఱ వదిలెయ్యగలిగితే రోగాలు పోతాయి. అది చెయ్యడము అంత సులభము కాదు. మనము రోగాలు అనుభవించడానికి అలవాటుపడిపోయాము. కనుక రోగాలు కొన్నిసార్లు పోవడము లేదు.

జపము చేస్తున్నప్పుడు మిమ్మల్ని పైకి లేపగలిగేది మీ వాణియే. జపము చేస్తున్నప్పుడు మీ చెవులలో దివ్యశ్రవణము, కళ్ళలో దివ్యదర్శనము అనేవి రావాలి.

ఆధ్యాత్మికతలో వున్న 4 స్థాయిలను గుర్తుంచుకోవాలి. అవి - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. జపము చేస్తున్నప్పుడు మనస్సెలా మారాలి? బుద్ధి యెలా మారాలి? చిత్తాహంకారములు యెలా మారాలి? మారటానికి జపము చేస్తున్నప్పుడు మెల్లిమెల్లిగా మిమ్మల్ని మీరు సూర్యునిలో కలుపుకోవాలి. జపంతోపాటు భావన ముఖ్యము. జపములో మెల్లిగా మనస్సు స్థాయినుండి అహంకారముస్థాయికి యెదగాలి. అయితే జపము చేస్తున్నప్పుడే సాధకుడు 3-3 స్థాయిలలో పైకి వెళుతుంటాడు. అలా వెళ్ళగా వెళ్ళగ వున్న తలములు 7×7=49 తలములు. 49వ తలంలో సూర్యునియొక్క భౌతికశరీరము వున్నది. మన కంటికి కనిపించే సూర్యుడు 49 వ తలంలో వున్నాడు.

**" గాయత్రీమాతయొక్క పరమతేజస్వీప్రకాశము నా సూక్ష్మశరీరంలో, అంతఃకరణ చతుష్టయము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములలో ప్రవేశించి అవి ప్రకాశవంతమగుట దర్శించాను. ఈ బ్రహ్మవర్చస్సు నా మనస్సును పాశవిక, ఇచ్ఛా, ఆకాంక్షలు లేనటువంటి వుచ్ఛభూమిక వైపు నన్ను లాక్కునిపోతున్న దని అనుభవంలోకి తెచ్చుకొన్నాను. దివ్యత్వమును పరిప్లావితము చేయగలిగే ఆకాంక్షలు మేలుకొంటున్నాయి. బుద్ధి క్షణికావేశానికి, తుచ్ఛప్రలోభముకొఱకు మానవజీవితం లాంటి అతి పెద్ద ఉపలబ్ధిని నష్టము చేసుకోకూడదు అనే నిర్ణయాలు చేసుకొంటుంది. ఈ జీవితంయొక్క ప్రతిక్షణము ఆదర్శాలఽప్రతిష్ఠాపనకు వుపయోగించాలి. చిత్తములో వుచ్ఛ నిష్ఠలు చోటుచేసుకుని సత్యము, శివము, సుందరము వైపు ముందుకు వెళ్ళాలనే వుత్సాహపూరిత ఆలోచనలు ఉత్తుంగతరంగాలుగా ఏర్పడుతున్నాయి. సవితాదేవతయొక్క తేజస్సు, నా అంతఃక్షేత్రంలో ప్రవేశించి, నా అహంను పరిష్కృతము చేసి మరణధర్మ జీవధారుల స్థితినుండి అనేక యోజనములు దూరంగా తీసుకువెళ్ళి ఈశ్వరుని యొక్క సమర్థ, పరమపవిత్ర సచ్చిదానంద స్వరూపంలో స్థిరపరచుచున్నది. "**

**గాయత్రీపురశ్చరణకాలంలో నేను జపము మాత్రమే చెయ్యలేదు. భావతరంగాలుకూడ నిరంతరము మనస్సులో వుంచుకుని చేసుకునేవాడిని. కారణశరీరంలో అనగా భావభూమికయొక్క అంతరాళాలలో ఆత్మబోధ, ఆత్మదర్శనము, ఆత్మానుభూతిని మఱియు ఆత్మవిస్తారఅనుభూతిగా అంతర్జ్యోతిరూపంగా దర్శించేవాడిని. "**

www.missionrk.com

సాధనలోని చరణములలో గురుదేవులు చెప్పిన 4 స్థాయిలను ముందు అర్థము చేసికోవాలి.

***1. ఆత్మబోధ*** :- మనకు వున్న బోధ యేమిటంటే శరీరము వున్నది. భౌతికశరీరము దానికి సంబంధించిన సుఖదుఃఖాలను, ఆనందము, దుఃఖములను అనుభూతి చెందుతుంది. అలాగే శరీరమునకు సంబంధించిన బంధువులు, సంతానము మొదలగునవి అనుభూతిలోకి వస్తాయి. ఇవన్నీ వుండటము తప్పు అనలేదు పెద్దలు. భౌతికశరీరమును దాటి కాస్త పైకి ఎదగాలి. ఎదిగి ఆత్మబోధ అనే స్థాయికి వెళ్ళాలి. ఆత్మబోధ యెలా చేసుకోవాలో తెలియడానికి రమణమహర్షి పుస్తకాలు బాగా వుపయోగపడతాయి.

***2. ఆత్మదర్శనము*** :- ఆత్మబోధ తర్వాత ఆత్మదర్శనము అనే స్థాయి వస్తుంది. ఆత్మదర్శనము అనే సాధనకు లాహిరీమహాశయ మఱియు పరమహంసయోగానంద పుస్తకాలు చదవాలి. ఎందుకంటే శ్వాసను అవగాహన చేసుకోవడమే ఆత్మదర్శనము. అలాగే శిరిడిసాయి చరిత్ర స్వాధ్యాయము చేయాలి. (కేవలం పారాయణ ఈ ఫలితాలనియ్యదు). తర్వాత కఠోపనిషత్తు వుపయోగపడుతుంది. దాన్నిగనుక జాగ్రత్తగా చదివితే - మెలకువగా వున్నప్పుడు ప్రేయోమార్గంలోను; రాత్రిపడుకునేటప్పుడు శ్రేయోమార్గంలోను ఎలా మసలుకోవాలో చెబుతుంది.

***3. ఆత్మానుభూతి*** :- దీన్నిగూర్చి తెలియాలంటే శ్రీరామకృష్ణపరమహంసను పట్టుకోవాల్సిందే. వివేకానంద సవాల్ విసురుతాడు గురుదేవులు రామకృష్ణులతో. ఏమని? నాకు ఆత్మానుభూతిని యివ్వగలవా? అని. గురువు కచ్చితంగా ఆ అనుభూతిని యిస్తాడు. అయితే శిష్యుడిలో ఆ స్థాయి తపన వుండాలి. నీటిలో మునిగినప్పుడు గాలి కావాలి అని యెంతలాగ కోరుకుంటావో నాకు భగవంతుడు కావాలి అని అంతలాగ తపిస్తే అప్పుడు ఆత్మానుభూతి లభిస్తుంది. ఆత్మానుభూతియోగం గూర్చి తెలియాలంటే అరవిందో చెప్పిన యోగమార్గమునుకూడ అర్థము చేసుకోవాలి. ఆయన వ్రాసిన పుస్తకాలను అధ్యయమను చేయాలి.

***4. ఆత్మవిస్తారము*** :- సాధనలో తర్వాతి చరణము ఆత్మవిస్తారము అనే అనుభూతి వస్తుంది. అంటే యీ ప్రపంచమంతా నేను అను అనుభూతి. దీనికి థియోసాఫికల్ సొసైటీలోని పుస్తకాలను అధ్యయనము చేయవల్సిన అవసరమున్నది. ఆత్మవిస్తారసాధన బుద్ధుడు చేశాడు. తర్వాత శ్రీరామశర్మఆచార్యగురుదేవులు చేశారు. బుద్ధుని జీవిత వుత్తరార్థము శ్రీరామశర్మఆచార్య గురుదేవుల జీవితము. గురుదేవుల పూర్వార్థము బుద్ధుని జీవితము. ఆత్మవిస్తారసాధనకే మఱోపేరు ఆత్మవత్సరభూతేషు.

**" గాయత్రీపురశ్చరణకాలంలో నేను జపము మాత్రమే చెయ్యలేదు. భావతరంగాలుకూడ నిరంతరము మనస్సులో చేసుకునేవాడిని. కారణశరీరంలో అనగా భావభూమికయొక్క అంతరాళాలలో ఆత్మబోధ, ఆత్మదర్శనము, ఆత్మానుభూతి మఱియు ఆత్మవిస్తార అనుభూతిగా అంతర్జ్యోతిరూపంగా దర్శించేవాడిని.**

**నాయొక్క ఆత్మ పరమ తేజస్వి సవితాదేవతయొక్క ప్రకాశములో దీపములో పురుగులు ఆత్మాహుతి చేసుకున్నట్లు ఆ సవితలో లీనమైపోయింది. నా అస్తిత్వము సమాప్తమైనది. దాని స్థానంలో పరమతేజస్సు ప్రతిష్ఠితమైనది. నేను సమాప్తమైపోయాను. నీయొక్క ఆధిపత్యమే వున్నది. ఆత్మ మరియు పరమాత్మయొక్క అద్వైత కలయికయొక్క అనుభూతి క్షణక్షణము వచ్చేది. బ్రహ్మానందంయొక్క సరసత అనుభవంలోకి వచ్చేది. ఈ అనుభూతికొరకు ప్రపంచంలోని అన్ని విషయానందాలను వదులుకొనవచ్చును. "**

www.missionrk.com

ఆత్మానందం ముందు భౌతికసుఖాలు, ఆనందాలు చాలా తుచ్ఛమైనవి అని గురువులు పదేపదే చెపుతారు. జపము చేస్తున్నప్పుడు ఆ భావతరంగాలను జ్ఞప్తిచేసుకుంటుంటే యేదో ఒక జన్మలో ఆ అనుభూతి కచ్చితంగా వస్తుంది.

**" జపముతోపాటు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములో దివ్యప్రకాశముయొక్క ప్రతిష్ఠాపన మొదట ధ్యాన, ధారణ రూపంలో ప్రయత్నపూర్వకంగా చేయవలసివచ్చేది. మెల్లిమెల్లిగా అది నా సహజమైన ప్రకృతిగా మారింది. తర్వాత అది ప్రత్యక్షానుభూతిగా వుండిపోయినది. నాయొక్క ఉపాసనకాలములో నా లోపల, బయట పరమ తేజస్వి సవితయొక్క దివ్యజ్యోతి సాగరము అనుభూతిలోకి వస్తూ, నాయొక్క అస్తిత్వము, ఈ దివ్యజ్యోతితో ఓతప్రోతమవుతోంది అని నిరంతరము అనుభూతి చెందేవాడిని. ఈ ప్రకాశంతప్ప నా అంతరంగ బహిరంగములో యింక యేమి లేదు. నా ప్రాణముయొక్క ప్రతిస్ఫురణలో జ్యోతిస్ఫుల్లింగముల కంటే నాకు యేమి మిగలలేదు. ఈ దివ్య అనుభూతులతో, కనీసము పూజ సమయములో కచ్చితంగా నన్ను నేను ఓతప్రోతము చేసుకుంటూవుండేవాడిని. ఉపాసన, సాధనయొక్క పూర్తి సమయము యీ అనుభూతితోనే వుండేవాడిని. "**

జపము చేస్తున్నప్పుడు గురుదేవులకు యీ అనుభూతులు వచ్చేవి. మనస్సులో యిలాంటి భావనలు చెలరేగేవి. మీరుకూడ జపము చేస్తున్నప్పుడు ఆ భావములను మనస్సులో నింపుకోవాలి. అనుభూతి మెల్లగా వస్తుంది. కనీసము 6 నెలలు కచ్చితంగా అనుకున్న సమయానికి, అనుకున్న సంఖ్యలో జపము పూర్తిచేయాలి. అప్పుడు ఫలితము వస్తుంది. గురుదేవులు 6 గంటలు జపము చేసేవారు. గురుదేవులు చెప్పినట్లు చేస్తే ఫలితములు వస్తాయి. ఆ నియమాలను కచ్చితంగా పాటించితీరాలి.

**" పూజయొక్క 6 గంటలు, మిగిలిన 18 గంటలు ప్రేరణ నిచ్చేది. ఏ పనిచేస్తున్నా యిష్టదేవతయొక్క యీ తేజస్సే నాకు మార్గదర్శకము. ఆయన సంకేతానుసారమే నాయొక్క ప్రతి పని, క్రియ జరుగుతున్నది. నేను లాలస, లిప్స, తృష్ణ లేక వాసనలతో ప్రేరితమైన యే పనీ చేయుట లేదు. తల్లి యేవిధంగా చిన్నపిల్లవాడి వ్రేలుపట్టుకుని నడిపిస్తుందో, అదేవిధంగా ఆ దివ్యసత్తా నా మస్తిష్కమును పట్టుకుని వుచ్చఆలోచనలను ఆలోచించుకోవడానికి మఱియు శరీరమును పట్టుకుని వుచ్చఆదర్శములవైపు నడువటానికి వివశుడిని చేసింది".**

మాతాజీ చెప్పిన జ్యోతిఅవతరణ సాధన చేస్తే మీకు కూడ యీ అనుభూతి సులభంగా లభిస్తుంది. దీనికోసం యే మనోనిగ్రహము అవసరంలేదు. మిమ్మల్ని మీరు ప్రేరేపించుకోనవసరంలేదు. అదే ప్రేరణనిస్తుంది. అది ప్రేరణనియ్యకపోతే మీరు యే అనుభూతి పొందలేరు. మీలోని లోభము, మోహము మొదలగునవి పోవు. కానీ యీ ఉపాసనావిధానమును పాటిస్తే కచ్చితంగా గురుదేవులకు వచ్చిన అనుభూతులు వస్తాయి. ఎందుకంటే యిదంతా సైన్స్‌గనుక. జపములో భావన చేసుకుంటుంటే అది నిత్యజీవితంలో అనుభూతిగా మారుతుంది.

**" ఉపాసన తర్వాత మెలకువగా వున్న ప్రతిక్షణము శారీరక నిత్యకర్మలనుండి ఉపాసన, స్వాధ్యాయ, చింతన, శరీర పోషణకు నిమిత్తము చేసే పనులు, కుటుంబవ్యవస్థ మొదలగు అన్ని క్రియలు ఆ పరమేశ్వరుడే నియోజన చాలన చేస్తున్నాడనే అనుభూతి నిరంతరము వుండేది. రాత్రి పడుకునే 6 గంటలు యెంత గాఢంగా నిద్రపోయేవాడినంటే సమాధిస్థితిలో వున్నానా అని అనిపించేది. తల్లి ఒడిలో నన్ను నేను సమర్పించుకుని పరమశాంతసంతుష్టభూమికలో ఆత్మసత్తాలో తాదాత్మ్యత చెందేవాడిని. లేచిన తర్వాత క్రొత్త జీవితము, క్రొత్త వుల్లాసము, క్రొత్త ప్రకాశము, మార్గదర్శనము నా ముందు నడుస్తూ పథ ప్రదర్శనకు తయారుగావుండేవి.**

www.missionrk.com

24 సంవత్సరాల 24 మహాపురశ్చరణ కాలంలో సామాజికపారివారిక బాధ్యత లేవి నాకు లేవు. అందువల్ల పూర్తి తత్పరతతో, తన్మయత్వంతో యీ జప, ధ్యానముల సాధనాక్రమము సక్రమంగా నడిచినది. మాతృవత్‌పరదారేషు మఱియు పరద్రవ్యేషు లోష్టవత్ అనే నిరంతర నిష్ఠ శరీరమును పాపకర్మలనుండి రక్షించింది. అన్నంయొక్క సాత్త్వికత మనస్సును మానసిక అథఃపతనములో పడకుండా కాపాడినది. బార్లీ, రొట్టె, ఆవుమజ్జిగ - ఈ ఆహారమే నాకు రుచించినది, అరిగినది. ఆహారమునుబట్టి మనస్సు అనే సత్యము నా జీవితకాలంలో అడుగడుగునా అనుభవంలో కొచ్చింది. అతి తీవ్రసంయమనములతో శరీరమును, మనస్సును నిగ్రహించకుండా వుండకపోతే యే ప్రగతిని సాధించలేకపోయేవాడిని.

అక్షరకూర్పు : శ్రీమతి లక్ష్మిగోపాల్
శ్రీమతి సరోజిని

**అవసరం**

గాయత్రి పరివారంలోని ఉత్సాహవంతులైన కర్మచారి యువకులు ఎవరికయితే మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నదో, ఇంటి ఇంటికీ వెళ్లి వాంగ్మయ గ్రంథాల ప్రచార, ప్రసారం చేయగలరో వారు అవసరము. వారికి కనీసపు డిగ్రీ అవసరము. బ్రాహ్మణోచితమైన నిర్వహణకి కావాల్సిన పరిస్థితులు ఉంటాయి.

పేరు, చిరునామా, వయస్సు, చేయుపని, తండ్రి పేరు, చిరునామా, ఆయన చేయు పని, కుటుంబ వ్యక్తుల వివరాలు, దీనిని పంపు వ్యక్తి యొక్క రాశి, పాస్‌పోర్టు సైజు ఫోటోతో పాటుగా మిగిలిన వివరాలతో వారి ప్రార్థనా పత్రాన్ని దగ్గరలో ఉన్న గాయత్రీ శక్తి పీఠంలో చూపించి, వారి అనుమతితో పంపించవలసినది.

**వ్యవస్థాపకులు, అఖండ జ్యోతి సంస్థాన్, మధుర.**